ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 13, సెప్టెంబరు 2024

ఒంగోలు నగరపాలక సంస్థలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నడిచిన నిధుల దోపిడీ వ్యవహారం తాజాగా వెలుగుచూసింది. టెండర్ పద్ధతిన పనులు చేపడితే పైసలు మిగిలేది తక్కువే అని భావించిన కొందరు నాటి వైసీపీ పెద్దలు, అధికారులతో కలిసి చక్రం తిప్పారు. నామినేషన్ పద్ధతిన పనులు విభజించి, భారీగా దోచుకునేందుకు పావులు కదిపారు. నిబంధనలకు విరుద్ధంగా అత్యవసరం పేరుతో అందరూ పంచుకుని పనులు చేపట్టారు. దీంతో కార్పొరేషన్ ఖజానాకు భారీగా గండిపడింది. అటు కార్పొరేటర్ల పెద్ద, ఇంజనీర్లు, కమిషనర్ అందరూ ఒక్కటై వ్యవహారం నడిపినట్లు తెలుస్తోంది. ముందుగానే పర్సంటేజీలు నడవగా దీనికి సంబంధించి బిల్లులు ప్రస్తుతం ఆన్‌లైన్ చేయడం గమనార్హం.



ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం

జగన్ సభకు నీళ్ల ఖర్చు రూ.10లక్షలు

కార్పొరేషన్ పెద్దలు, అధికారుల కుమ్మక్కుతో పనులు పక్కదారి

పుష్‌కార్టుల మరమ్మతులు, పరికరాల కొనుగోలు పేరుతో దోపిడీ

టెండర్లు లేకుండా రూ.95లక్షలు స్వాహా


వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం రాత్రి ఒంగోలు ఆర్టీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణేషుడి ప్రతిమను కూరగాయలతో అలంకరించిన స్థానికులు.

పనులు పంచుకుతిన్నారు

ఒంగోలు కార్పొరేషన్‌లో వెలుగుచూసిన వైసీపీ అవినీతి దందా

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 12: ఒంగోలు నగర కార్పొరేషన్‌లో నామినేషన్ పనుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పందొమ్మిది పనులకు రూ.95లక్షల ఖర్చుచేసినట్లు బిల్లులు పెట్టారు. అయితే నిన్న మొన్నటివరకు వైసీపీలో కీలకంగా వ్యవహరించిన ఆ పార్టీ కార్పొరేటర్ పెద్ద నేడు టీడీపీలో ఉండగా, ఎన్నికల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా సాధారణ సర్వసభ్య సమావేశానికి ఈ వ్యవహారం రాకుండా స్టాండింగ్ కౌన్సిల్‌తో ఆమోదింపజేశారు. ఇందంతా ఇలా ఉంచితే ఈ పనులన్నీ తెనాలికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు మాత్రమే కేటాయించడం అనుమానాలకు తావిస్తోంది. అయితే ప్రస్తుతం ఇందుకు సంబంధించిన బిల్లులన్నింటినీ ఆన్‌లైన్ చేయగా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ముందుగా పర్సంటేజీలు ముట్టచెప్పినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ పనుల ద్వారా కార్పొరేషన్ ఖజానాకు లక్షల్లో నష్టం వాటిల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేస్థాయిలో పనుల ఆమోదానికి అంగీకారం తెలిపిన నాటి వైసీపీ పెద్దలు, ఇంజనీర్లు, ఇటీవల బదిలీపై వెళ్లిన కమిషనర్‌కు భారీగానే ముట్టినట్లు సమాచారం.

రూ.95లక్షలకు టెండర్ కాదని నామినేషన్

ఒంగోలులో పారిశుధ్యం పనుల్లో ఉపయోగించే చెత్త సేకరణ వాహనాలు (పుష్‌కార్టులు) రిపేరుకు అక్షరాల రూ.30లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు. 2015లో నగరంలో పారిశుధ్యం మెరుగునకు సుమారు 450 పుష్‌కార్టులు కొనుగోలు చేశారు. కాగా వాటిలో ప్రస్తుతం 250 బండ్లు వరకు రిపేరుకు రాగా, మరో వంద బండ్లు పూర్తిగా తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. ఇదిలా ఉంచితే మరి కొన్ని ఇంకా బాగు చేయాల్సి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నేతల కన్ను పుష్‌కార్టులపై పడటంతో పారిశుధ్య విభాగంలో అవినీతికి తెరలేచింది. పుష్‌కార్టుల రిపేరుకు రూ.25లక్షలు ఖర్చు అయినట్లు చూపుతుండగా, వాటికి పెయింటింగ్‌ల కోసం అదనంగా మరో రూ.5లక్షలు ఖర్చుచేసినట్లు లెక్కలు తేల్చారు. ఇదిలా ఉంచితే పారిశుధ్య కార్మికులకు గ్లౌజ్‌లు, కొబ్బరి నూనెలు, యాప్రాన్‌లు, పారిశుధ్య పరికరాలు కొనుగోలుకు మరో రూ.20 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు చూపారు. అయితే అందులో ఇంతవరకు కొబ్బరి నూనె ఇవ్వకపోగా, కనీసం పరికరాలు కూడా కొనుగోలు చేయలేదని సమాచారం. మరోవైపు కాలువల్లో పూడికతీత పనులకు ఏటా రూ.40 లక్షల నుంచి రూ. 50లక్షలు కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి ఖర్చుచేస్తుండగా, అవికాకుండా పనులు చేపట్టినందుకు ఎక్స్‌కవేటర్‌లు ఏర్పాటు చేసినట్లుగా చూపారు. ఎక్స్‌కవేటర్ బిల్లులే రూ.10లక్షలు ఖర్చు అయినట్లు లెక్కలు కట్టారు.

జగన్ సభకు రూ.10లక్షలు

వడ్డించే వాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చున్నా ఇబ్బంది లేదన్నట్లు ఉంది కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు వ్యవహారం. తుఫాన్‌విపత్తులు, విషజ్వరాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే చేపట్టే అత్యవసర పనులను ఏడు నెలల క్రితం అప్పటి సీఎం జగన్ సభకు ముడిపెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ఒంగోలు పరిధిలోని నరసాపురం అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన జగన్ సభకు కార్పొరేషన్ నిధులు భారీగా ఖర్చయినట్లు పాలవర్గ పెద్దలు తేల్చారు. ప్రజలు, లబ్ధిదారులను తరలించేందుకు ఏర్పాటు చేసిన బస్సుల కోసం, అలాగే వేదికపై పెద్దల దాహం తీర్చడం కోసం అక్షరాల రూ.10 లక్షలు ఖర్చు అయినట్లు లెక్కలు తేల్చారు. వాస్తవానికి రూ.5లక్షలు దాటితే ఆ పనులకు టెండర్లు పిలవాలి. కానీ ఇక్కడ నిబంధనలకు అధికారులు, పాలవర్గ పెద్దలు తూట్లు పొడిచారు. విభజన పేరుతో రూ.5లక్షల చొప్పున వేర్వేరుగా పనులు చేపట్టారు. ఈ పనులన్నీ టెండర్ పద్ధతిన పిలిస్తే పర్సంటేజీలు అందరికీ ఇవ్వాల్సి వస్తుందని భావించిన సదరు పాలక పెద్దలు, ఇంజనీర్లు, పూర్వపు కమిషనర్ కుమ్మక్కయి పనులు విభజించారు. నామినేషన్ పద్ధతిన భారీగా దోపిడీకి తెరదీయడంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగానే గండిపడింది. పనిలో పనిగా వారి సొంత ఖజానాకు భారీగానే లాభం చేకూరింది.



ఒకే వ్యక్తికి అన్ని పనుల కేటాయింపు

వాస్తవానికి కార్పొరేషన్ ద్వారా ఖర్చుచేసే నిధులు, చేపట్టే పనులకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రొక్యూర్‌మెంట్‌తో టెండర్లు పిలవాలి. అందులో పాల్గొనే కాంట్రాక్టర్ పనులు దక్కించుకునేందుకు లెస్ టెండర్ వేసి, నిర్ణీత కాలంలో పనులు పూర్తిచేయాలి, అయితే ఇక్కడ పూర్తి మొత్తం రూ.95 లక్షలకు పనులు చేపట్టాలంటే టెండర్‌లు పిలవాల్సి రావడంతో అడ్డదారులు వెతికారు. రూ.5లక్షలలోపు పనులకు నామినేషన్ పద్ధతిన ఇచ్చేందుకు కమిషనర్‌కు అధికారం ఉంటుంది. రూ.10 లక్షలు దాటితే ఖచ్చితంగా టెండర్లు పిలవాలి. కానీ ఇక్కడ పనులు పక్కదారి పట్టించేందుకు అందరూ కుమ్మక్కయ్యారు. అందుకు ఇంజనీర్లు వంత పాడారు. దీంతో రూ.5లక్షల చొప్పున పనులు విభజించి ఏకంగా పందొమ్మిది పనులు పిలిచి, వేర్వేరుగా ఇచ్చేశారు. ఇదిలా ఉంచితే ఈ పనులన్నీ ఒకే వ్యక్తికి కాంట్రాక్ట్ ఇవ్వడం గమనార్హం. గతంలో తెనాలిలో కమిషనర్‌గా పనిచేసి, ఎన్నికలకు ముందు ఒంగోలుకు బదిలీపై వచ్చి, గత నెలలో బదిలీ అయిన అధికారికి అత్యంత సన్నిహితుడుగా ఉండే వీరశేఖరరావుకు కేటాయించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై కొందరు కాంట్రాక్టర్లు, కార్పొరేటర్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.


డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

- 85 జీవో రద్దుపై నేడు రాష్ట్ర కమిటీ సమావేశం
- అందులో తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ఆందోళన

ఒంగోలు(కలెక్టరేట్),సెప్టెంబరు 12 :ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. జీవో నెంబరు 85కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా వైద్యులు ఉద్యమబాట పట్టారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు సర్వీసు కోటా కింద పీజీ చదువుకునేందుకు కేటాయించిన 30శాతం కోటాను 15శాతం తగ్గించడంతో వైద్యులు ఈ ఆందోళన చేపట్టారు. జీవో వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులు ఉన్నత విద్యలో సీట్లను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జారీచేసిన జీవోకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఆందోళన కొనసాగింది. శుక్రవారం రాష్ట్ర అసోసియేషన్ సమావేశం జరగనుంది. అందులో ఇప్పటివరకు జరిగిన ఆందోళనపై చర్చించి భవిష్యత్ కార్యచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు పూర్తి స్థాయిలో ఆందోళనలు చేపట్టే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలతోపాటు వైద్యశాఖ ఉన్నతాధికారులను కలిసి ఈ సమస్యను వివరించనున్నట్లు తెలిసింది. అప్పటికి కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రణాళిక ప్రకటించి తదనుగుణంగా ముందుకుపోనున్నారు. కాగా గురువారం రాత్రి పీహెచ్‌సీ వైద్యులు కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగుల బదిలీల గడువు మళ్లీ పొడిగింపు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12 : రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీల గడువును ప్రభుత్వం మళ్లీ పొడిగించింది. దీంతో మొదట ప్రకటించిన తేదీ నుంచి గడువును రెండుసార్లు పొడిగించినట్లు అయింది. ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆగస్టు 31లోపు ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే 31 నాటికి భారీ వర్షాలు, విజయవాడ వరదల నేపథ్యంలో గడువును ప్రభుత్వం సెప్టెంబరు 15వ తేదీ వరకు పొడిగించింది. అయితే వరద పరిస్థితులు ఇంకా కుదుటపడకపోవడంతో బదిలీల గడువును ఈనెల 22 వరకు పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రక్రియను ఈనెల 22లోపు పూర్తి చేయాలని, 23 నుంచి ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగుల బదిలీల గడువును ఈనెల 30 వరకు పొడిగించారు. ఈ శాఖలో అక్టోబరు 1 నుంచి బదిలీల నిషేధం అమలులోకి వస్తుంది.


వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన దేకనకొండ బాధితులను పరామర్శిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు(ఫైల్)

ఆగని వైసీపీ ఆగడాలు

- పలుచోట్ల టీడీపీ కార్యకర్తలపై దాడులు
- పోలీసుల తీరుపై విమర్శలు

దర్శి, సెప్టెంబరు 12: అధికారం కోల్పోయినా వైసీపీ నాయకుల ఆగడాలు తగ్గలేదు. పలుచోట్ల దురుసుగా వ్యవహరిస్తూ టీడీపీ వర్గీయులపై దాడులు చేస్తున్నారు. గతంలో జరిగిన ఘటనలపై పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోకపోవడంతో వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. కొద్దిరోజుల క్రితం కురిచేడు మండలం దేకనకొండలో టీడీపీ వర్గీయులపై ఉద్దేశపూర్వకంగా దాడిచేసి 12 మందిని గాయపర్చిన విషయం తెలిసిందే. అక్కడ టీడీపీ వర్గీయులు వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు మండపం నుంచి ట్రాక్టర్‌పై పెట్టే ఏర్పాటుచేస్తున్నారు. ఈసమయంలో పొలం నుంచి ఊరిలోకి ట్రాక్టర్‌పై వచ్చిన వైసీపీ వర్గీయులు టీడీపీ వర్గీయుల ట్రాక్టర్ అడ్డుగా ఉందని ఉద్దేశపూర్వకంగా గొడవకు దిగి దాడిచేశారు. పోలీసులు సర్దుబాటు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు పోలీసుల సమక్షంలోనే రాళ్లు, కర్రలతో దాడులు చేశారు. ఈ దాడిలో 12 మంది టీడీపీ వర్గీయులకు గాయాలయ్యాయి. అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులపై కూడా విసిరిన రాళ్లు పడ్డాయి. వైసీపీ వర్గీయులు రెచ్చిపోతున్నప్పటికీ అక్కడ పోలీసులు ఏ కారణం చేతనో పటిష్ట చర్యలు తీసుకోలేదు. ఆత్మరక్షణ కోసం టీడీపీ వర్గీయులు వారి దాడులను అడ్డుకునే ప్రయత్నం మాత్రమే చేశారు.

కురిచేడు మండలం త్రిపురాంతకం సర్కిల్ పరిధిలో ఉంది. అక్కడ పనిచేస్తున్న పోలీసు అధికారి గత ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఇక్కడ దాడులకు పాల్పడిన వైసీపీ వర్గీయులపై చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు అక్కడ జరిగిన గొడవలపై ఒక్క అరెస్టు కూడా జరగలేదు. దీంతో అక్కడ పోలీసుల తీరుపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా దర్శి నగర పంచాయతీలోని కొత్తరెడ్డిపాలెం గ్రామస్థులు గణేష్ నిమజ్జనం సందర్భంగా దళితులపై అకారణంగా దాడిచేశారు. గణేష్ నిమజ్జనానికి తూర్పు చౌటపాలెం ఎస్సీ కాలనీకి చెందిన యువకులు డీజే సెట్టును బాడుగకు తీసుకెళ్లారు. ఊరేగింపు సందర్భంగా కొత్తరెడ్డిపల్లె గ్రామస్థులు కొంతమంది డీజే బాడుగకు తెచ్చిన యువకులపై అకారణంగా దాడి చేశారు. గత ఎన్నికల సందర్భంగా కూ డా అనేకచోట్ల టీడీపీ వర్గీయులపై యథేచ్ఛగా దాడులు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సర్కార్ మద్యం దుకాణాలు రద్దు

- పాత స్వరూపంలోకి ఎక్సైజ్ శాఖ
- వచ్చేనెల ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ



ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 12: సర్కార్ మద్యం దుకాణాలను రద్దుచేసి గతంలో మాదిరిగా ప్రైవేటు మద్యం దుకాణాలను ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు వచ్చే నెల 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి రానుంది. అదేక్రమంలో గత ప్రభుత్వంలో జీవో నంబరు 12 ప్రకారం ఎక్సైజ్ శాఖలో ఉన్న 70శాతం ఉద్యోగులను విడగొట్టి ఎస్ఈబీకి కేటాయించారు. కాగా ఈనెల 11న సాధారణ పరిపాలన శాఖ జీవో నంబరు 12ను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎస్ఈబీలో ఉన్న ఉద్యోగులు అందరూ తిరిగి ఎక్సైజ్ శాఖలోకి విలీనమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు మద్యం పాలసీ మీద అనేక రాష్ట్రాలలో ఉన్న సిస్టంను అధ్యయనం చేసి బుధవారం మొదటిసారిగా భేటీ అయ్యారు. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఏదిఏమైనా సర్కార్ మద్యం దుకాణాలు రద్దు వైపే మొగ్గుచూపే అవకాశం ఉంది. వచ్చేనెల నుంచి నూతన పాలసీ అమలులోకి తెచ్చేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు.

ఎస్ఈబీ పూర్తిగా రద్దు

ఎక్సైజ్ శాఖలో ఉన్న 70శాతం ఉద్యోగులను విభజించి స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరోను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాస్తవంలోకి వెళితే ఎస్ఈబీ వచ్చిన తరవాత గంజాయి, ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ రవాణా, ఇసుక రవాణా అధికమయ్యాయి. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, గంజాయిలను అరికట్టడంలో ఆ శాఖ వైఫల్యం చెందింది. కాగా జిల్లాలో ఉన్న 175 మంది ఎస్ఈబీ ఉద్యోగులు 12జీవో రద్దుతో తిరిగి మాతృశాఖకు వచ్చారు. వీరిలో ఇరువురు ఈఎస్‌లు, ఏఈఎస్‌లు ఇద్దరు, సీఐలు 10మంది, 15మంది ఎస్సైలు, 28మంది హెడ్ కానిస్టేబుళ్లు, 98 మంది కానిస్టేబుళ్లు, 10మంది మినిస్టీరియల్ సిబ్బంది ఎక్సైజ్ శాఖకు బదిలీ అయ్యారు. ఒంగోలు, మార్కాపురంలో ఉన్న ఎస్ఈబీ ఈఎస్ కార్యాలయాల్లో ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్లు ఎక్సైజ్ శాఖకు బదలాయించారు.

1 నుంచి నూతన మద్యం పాలసీ

వచ్చేనెల 1 నుంచి నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు మద్యం దుకాణాలకు టెండర్ విధానం అమలులోకి తెచ్చే ఆలోచనలో ఉంది. దీంతో సర్కార్ మద్యం దుకాణాలు రద్దయి ప్రైవేటు దుకాణాలు రానున్నాయి. అందుకోసం ఈనెల 15 నుంచి ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 2019లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 331 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రైవేటు దుకాణాలను రద్దు చేసి ప్రభుత్వ దుకాణాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో 20శాతం దుకాణాలను తగ్గించి 2019-20లో 265కి ప్రభుత్వ దుకాణాలకు అనుమతి ఇచ్చారు. 2020-21 లో మరలా 13శాతం తగ్గించారు. దీంతో 222 దుకాణాలు మాత్రమే నడిచాయి. కొద్దిరోజులు తర్వాత ఎలైట్ మాల్స్, టూరిజం ప్రాంతాలలో అనుమతి పేరుతో జిల్లాలో మరో 36 దుకాణాలను ఇచ్చారు. ప్రస్తుతం ఇప్పుడు 258 మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రైవేటు దుకాణాలకు ఈవేలం విధానం అమలుపరిచే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేయాలనే విషయమై కసరత్తు ఇప్పటికే ప్రారంభమైంది.


ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల నగర మేయర్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్పొరేటర్ గురవయ్య

టీడీపీలో చేరిన మరో వైసీపీ కార్పొరేటర్

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 12: వైసీపీ నుంచి మరో కార్పొరేటర్ తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక 49వ డివిజన్‌కు చెందిన అంగిరేకుల గురవయ్య గురువారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇప్పటికే వైసీపీ నుంచి 19మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరగా, తాజాగా మరొకరు చేరడంతో ఆ సంఖ్య 20కి చేరింది. ఇదిలా ఉండగా, గతంలో టీడీపీ కార్పొరేటర్లు ఆరుగురు, జనసేన కార్పొరేటర్ ఒకరు ఉన్నారు. మొత్తం టీడీపీ బలం 27కు పెరిగింది. అంతేకాకుండా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్‌విజయ్‌కుమార్ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉండటంతో టీడీపీ బలం 30కి చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్నివేళలా అండగా ఉంటానని తెలిపారు. అలాగే సమష్టి కృషితో నగర అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, పలువురు కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

వైసీపీలో మరో సంక్షోభం

- పదవులకు, పార్టీకి దూరమన్న మాజీ మంత్రి బాలినేని
- పార్టీ మార్పుపై పెరిగిన ఊహాగానాలు
- అయోమయంలో జగన్
- నేడు జిల్లా నేతలతో అత్యవసర భేటీ

ఓటమి భారంతో కొట్టుమిట్టాడుతున్న జిల్లా వైసీపీలో మరో సంక్షోభం నెలకొంది. పదవులకు, పార్టీ కార్యక్రమాలకు తాను దూరమని మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తేల్చిచెప్పారు. దీంతో ఆయన పార్టీ మారే యోచనలో ఉన్నారనే ఊహాగానాలకు బలం చేకూరగా, జిల్లా పార్టీ నేతలతో జగన్ అత్యవసరంగా సమావేశం కానుండటం మరో విశేషం. అయితే ఈ సమావేశానికి కూడా బాలినేని డుమ్మా కొడుతున్నట్లు సమాచారం.

లోపలి పేజీల్లో


మార్కాపురం నుంచి విజయవాడ తరలించేందుకు సిద్ధం చేసిన నిత్యావసరాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

వరద బాధితులకు నిత్యావసరాలు

లోపలి పేజీల్లో

డేంజర్ జంక్షన్స్..!

నగరంలో తరచూ ప్రమాదాలు • నిత్యం ట్రాఫిక్ సమస్యలు
పోలీసులున్నా ప్రజలకు తప్పని ఇబ్బందులు



కొత్తపట్నం బస్టాండు రోడ్డులో..
పాతమార్కెట్ సెంటరులో..

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 12: ఒంగోలు నగరంలోని పలు రహదారుల్లోని [illegible] మలుపులు డేంజర్ జంక్షన్లుగా మారాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రధాన కూడలి వద్ద ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడం, మరి కొన్ని చోట్ల ఉన్నా, కాస్తంత చూసీచూడనట్లు వ్యవహరించడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో నే వాహనదారులు పల్టీలు కొడుతున్నా, సంబంధిత అధికారుల చర్యలు కనీసం శూన్యమయ్యాయి. గోతులమయమైన రహదారులకు మరమ్మతులు చేపట్టకుండా నగరపాలక సంస్థ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు ఎవరికి వారే నిర్లక్ష్యంగా ఉండగా, ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ ప్రధాన రహదారులకే పరిమితమైంది. ముఖ్యంగా ప్రతిరోజు ప్రమాదాలు జరిగే ప్రాంతాలైన.. స్థానిక కాపు కళ్యాణ మండపం వద్ద అంజయ్య రోడ్ నుంచి ఆర్టీసీ బస్టాండు వైపు, అదేవిధంగా కోర్టుసెంటర్ నుంచి రంగారాయుడు చెరువువైపు, స్థానిక జయరాం హాలు సెంటర్, సీవీఎన్ రీడింగ్ రూమ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద, నాలుగు రోడ్ల కూడలి, కార్పొరేషన్ కార్యాలయం-శివాలయం మార్గ మధ్యలోని మూల మలుపులు మరింత ప్రమాదకరంగా మారాయి. వాటితోపాటు స్థానిక అద్దంకి బస్టాండ్‌సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఆ మార్గంలోని నాలుగు రోడ్లలో రాకపోకలు సాగిస్తుండగా కనీసం ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుల్ మచ్చుకైనా కనిపించకపోవడం గమనార్హం. ఇక లాయరుపేట వీఐపీరోడ్ నుంచి బైపాస్ రోడ్డు వెళ్ళే మలుపులోనూ, గుంటూరురోడ్‌లో నుంచి త్రోవగుంట వైపు జాతీయ రహదారిలోనూ ఇదే పరిస్థితి ఉండటంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. స్థానిక చర్చిసెంటర్ జంక్షన్, రైల్వేస్టేషన్‌కు వెళ్ళే మార్గంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలోను ప్రమాదాలు జరుగుతున్నాయి.

స్పీడ్ బైక్‌ల హల్‌చల్..

నేడు మార్కెట్‌లో లభిస్తున్న 200 సీసీ మొదలుకుని 350 సీసీ బైక్‌లతో కుర్రాళ్ళు నగరంలోని రోడ్లపై దూసుకుపోతున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణించే మిగతా వాహనదారులు భయందోళన చెందుతున్నారు. అలాగే అమిత వేగంతో వెళ్ళే ఆటోల స్పీడుకు బ్రేక్‌లు పడటం లేదు. ఫలితంగా వాహనచోదకులతోపాటు, ఆ వైపుగా నడిచే పాదచారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రత్యేకించి పాఠశాలల జరిగే రోజుల్లో చిన్నారులు భయంభయంగా రహదారులు దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అదేవిధంగా వృద్ధులు, మహిళలు రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయం గుప్పిట్లో రోడ్డుపై ప్రయాణించాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

పెరుగుతున్న ప్రమాదాల నియంత్రణకు సంబంధి శాఖాధికారులు సమన్వయం కలిగి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. నిత్యం వాహనాల ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో పోలీస్ పర్యవేక్షణతోపాటు పనిచేయని సిగ్నల్‌లైట్‌లను వినియోగంలోకి తీసుకొచ్చి, నగర హోదాకు అనుగుణంగా తగు శ్రద్ధ చూపాలని, ప్రమాదాలు జరగకుండా దృష్టి సారించాని నగరవాసులు కోరుతున్నారు.



అద్దంకి బస్టాండు సెంటరులో వాహనాల రాకపోకలు

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12: లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఒంగోలుకు రానున్నారు. ఉదయం పదిగంటలకు స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు., మధ్యాహ్నం 1.45 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం నగరంలో జరిగే కార్యక్రమాలకు మాగుంట హాజరవుతారు.

భూగర్భ జలమట్టం పెంచేందుకు కృషి చేయాలి

• కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12: జిల్లాలో భూగర్భ జలమట్టం పెంచేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా అధికారులు, జిల్లాలో 57 గ్రామాల్లో పరిమితికి మించి భూగర్భ జలాలను వినియోగించినట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు, నవంబరు నెలల్లో జిల్లాలో కురిసే వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలమట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ దిశగా ఇప్పటికే 14గ్రామాల్లో రూపొందించిన వాటర్ బడ్జెట్ ప్రణాళికను ప్రజలకు వివరించారు. అందులో భాగంగా వచ్చే వారం సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి స్థానికులకు ఆ వివరాలను తెలియజేయాలన్నారు. పరిమితికి మించి భూగర్భ జలాన్ని వినియోగించిన 57 గ్రామాలున్న సంబంధిత ఎనిమిది మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ నీటి మట్టం పెరిగేలా వాటర్ బడ్జెట్ రూపొందించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ దిశగా ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మైక్రో ఇరిగేషన్, డ్వామా, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి వనరులు పొదుపుగా వినియోగించుకోవడంపై వీడియోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు విద్యాసాగర్, వసుంధర, రమణ, శ్రీనివాసరావు, గోపిచంద్, వండర్‌మన్, మురళీధర్‌రావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

17నుంచి స్వచ్ఛతా హీ సేవా..

పరిసరాల పరిశుభ్రత ప్రజలజీవన విధానంలో ఒక భాగం కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ఆ దిశగా వారి ఆలోచనా విధానంలో మార్పు తీసుకరావాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛతా హీసేవా కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 17నుంచి వచ్చేనెల 1వతేదీ వరకు జరగనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై గురువారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఈ అంశంపై అధికారులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు ఉషారాణి, వసుంధర, రవికుమార్, మాధురి, సామా సుబ్బారావు, సురేష్‌కుమార్, వండర్‌మన్, కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుత్ మరణం సంగీతరంగానికి తీరని లోటు

• పలువురు కళాకారుల నివాళి

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 12: ఒంగోలుకు చెందిన ప్రముఖ గాయకుడు గుంజి అచ్యుత్ (50) మరణం జిల్లా సినీ సంగీత రంగానికి తీరనిలోటని పలువురు కళాకారులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. మూడు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో అచ్యుత్ తీవ్ర గాయాలపాలు కాగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు. ఒంగోలుకు చెందిన అచ్యుత్ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ గత మూడు దశాబ్దాలుగా అనేక స్టేజీషోలలో తన గళంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు. అతనికి ప్రకాశం జిల్లా జూనియర్ ఎస్పీ బాలుగా పేరుంది. బాలు కళావాహిని పేరిట సంస్థని నెలకొల్పి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఒంగోలులోని ఆయన గృహంలో అచ్యుత్ భౌతికకాయాన్ని పలువురు కళాకారులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. అచ్యుత్ మృతి జిల్లా సినీ సంగీత రంగంలో తీర్చలేనిదని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. అదేవిధంగా గాయకులు సుహాసిని, స్వర్ణలత, పి.శ్రావ్యరెడ్డి, డి.వెంకటేష్, డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, ఏల్చూరి అనంతలక్ష్మి, అప్పిశెట్టి రత్తయ్య, కనకారావు, ఎన్నూరి నాగేశ్వరరావు, ఐ.మురళీకృష్ణ, ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వేంకటశ్రీనివాసులు తదితరులు అచ్యుత్ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



నివాళులర్పిస్తున్న అరుణ, కళాకారులు, ఇన్‌సెట్లో అచ్యుత్ (ఫైల్)

ట్రాక్టర్ గొర్రు తగిలి వృద్ధుడి మృతి

నాగులుప్పలపాడు సెప్టెంబరు 12: ట్రాక్టర్ ఇనుప గొర్రు తగిలి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కె.తక్కెళ్లపాడు-తిమ్మనపాలెంరోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కె.తక్కెళ్లపాడులోని దళితకాలనీకి చెందిన కొప్పుల రామయ్య (75) గురువారం రాత్రి తిమ్మనపాలెం నుంచి స్వగ్రామానికి మోపెడ్‌పై వస్తున్నారు. అదే గ్రామానికి చెందిన పురుగుండ్ల రాఘవయ్య ట్రాక్టర్ గొర్రుతో తిమ్మనపాలెం వెళుతున్నారు. ఈక్రమంలో రామయ్యకు ట్రాక్టర్ గొర్రు తగలడంతో రోడ్డుపై పడి గాయపడ్డారు. దీంతో బాధితుడిని 108వాహనంలో ఒంగోలులోని రిమ్స్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రామయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య చనిపోగా నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

సీఎస్‌పురం హాస్టల్ వార్డెన్‌కు మెమో

ఒంగోలు నగరం, సెప్టెంబరు 12: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎస్‌పురం బీసీ హాస్టల్ వార్డెన్ చెన్నయ్యకు బీసీ సంక్షేమశాఖాధికారి ఎం.అంజల గురువారం మెమో జారీ చేశారు. ఆయనపై ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చెన్నయ్య విద్యార్థులకు సక్రమంగా మెనూ అందించటం లేదని, వసతిగృహంలో పనిచేసే మహిళా సిబ్బంది పట్ల వేధింపులకు పాల్పడుతున్నాడని, స్థానికంగా ఉండే వారిని చేర్చుకున్నారనే ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు. దీనిపై వార్డెన్‌కు మెమో జారీ చేసినట్లు సంక్షేమశాఖాధికారి అంజల తెలిపారు.

చిన్నారుల విరాళం రూ.1.10లక్షలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల కోసం మేము సైతం అంటూ ఒంగోలులోని సెయింట్‌జేవియర్స్ హైస్కూలు చిన్నారులు ముందుకు వచ్చారు. విద్యార్థులు తాము దాచుకున్న పాకెట్ మని, విద్యార్థుల తల్లిదండ్రులు, పరిసర వాసుల నుంచి విరాళాలుగా సేకరించిన రూ.1.10లక్షలను గురువారం తమ ఉపాధ్యాయులతో కలిసి ఎంఈవో కిషోర్‌బాబుకు అందజేశారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయనిధికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పి.సరస్వతి, సెయింట్‌జేవియర్స్ సిస్టర్స్ కె.జయశీల, ప్రధానోపాధ్యాయులు నక్షత్రం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంఈవోకు నగదును అందజేస్తున్న విద్యార్థులు

రేపు లోక్ అదాలత్ : ఎస్పీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు12: జిల్లాలో ఈనెల 14న జరిగే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులను కక్షిదారులతో మాట్లాడి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆయన కోరారు. వివిధ సందర్భాల్లో ఇరువర్గాల నమోదు చేసుకున్న కేసులను రాజీమార్గంగా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

సీఎం సహాయనిధికి విరాళం



కలెక్టర్ అన్సారియాకు చెక్కును అందజేస్తున్న నరసింహారావు, మహబూబ్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల కోసం లయన్స్‌క్లబ్ మెంబర్, రెడ్ క్రాస్ ఎంసీ సభ్యుడు మంగళగిరి నరసింహారావు, లయన్స్ క్లబ్ సభ్యుడు షేక్ మహబూబ్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు చెక్కును అందజేశారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 12: ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఈనెల 13న శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు జరగనుంది. గత నెల 24వ తేదీన జరగాల్సి ఉండగా, పలు కారణాల చేత వాయిదా పడింది. అయితే నేడు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ నేడు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12 : ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధితులకు రూ.5లక్షల విలువ చేసే నిత్యావసర సరకులను పంపిణీ చేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.పద్మ తెలిపారు. ఒంగోలులోని నారాయణస్వామిభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజయవాడలో సుమారు రెండులక్షల మంది నిరాశ్రయులయ్యారన్నారు. తమ సంఘం విరాళాలరూపంలో సరుకులను సేకరించి శుక్రవారం అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విష్ణు, వేణి, పద్మ, అమ్మాజీ, శ్రావణి, ఎస్.మణి, వై.ఆదిలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రాజశేఖర్‌కు ఉద్యోగుల సంఘం పరామర్శ



రాజశేఖర్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12 : దుండగుల చేతిలో దాడికి గురై స్థానిక రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి సోమిశెట్టి రాజశేఖర్‌ను ప్రభుత్వఉద్యోగుల సంఘం నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఇటువంటి దాడులు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తున్న ఆడిట్‌అధికారి రాజశేఖర్ కళ్ళలో కారం చల్లి విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గంగా ఉందని, ఇందుకు కారకులను అరెస్టు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వరకుమార్, భాను, రంగారెడ్డి, రామ్మోహన్‌రావు, శ్రీనివాసరావు, మసూద్‌ఆలీ పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆదిలక్ష్మి

నాగులుప్పలపాడు సెప్టెంబరు 12: నాగులుప్పలపాడులోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఒంగోలుకు చెందిన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య తన సొంత నిధులతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది మందికి సభ్యత్వ నమోదు కల్పించి ఆదిలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

మద్దిపాడు, సెప్టెంబరు 12: ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లు అమర్చుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ చెన్నారెడ్డి గురువారం తెలిపారు. త్వరలో వాణిజ్య సంస్థలకు, పరిశ్రమలకు వీటిని అమరుస్తామని, ఇందుకోసం సర్వే పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. రీడర్స్ వెళ్లకుండానే ఎంత విద్యుత్ వినియోగించారన్నది తెలుస్తుందన్నారు. గృహ వినియోగదారులకు రాయితీపై సౌరవిద్యుత్ రూఫ్‌టాప్ సదుపాయం కల్పిస్తున్నామని, ఇందుకోసం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన వెబ్‌సైట్‌లో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

రేపు మాల ఉద్యోగుల సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీరును పునఃపరిశీలించి రద్దు చేయాలని కోరుతూ శనివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో జరగనున్న మాల ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని పలువురు కోరారు. స్థానిక దళిత సంఘాల కార్యాలయంలో గురువారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వెలుగు ఉద్యోగుల సంఘం నాయకుడు గోపి, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, అంబేడ్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షుడు దండేల కృష్ణ ఆవిష్కరించారు. ఈనెల 14న జరిగే సదస్సులో మాల ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, జనార్దన్, ఆనందరావు, బాబురావు, బండారు రామారావు, శాంతారావు, పంది డేవిడ్, వివేకానంద్, ఎం.రవి, శ్రీహరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న నాగరాజు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 12: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మెకానికల్ డ్రీమ్స్ టు సాఫ్ట్‌వేర్ డ్రీమ్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి టీసీఎస్‌లో డేటాఎనలిస్ట్ గా పనిచేస్తున్న గుంజి నాగరాజు మెకానికల్, సాఫ్ట్‌వేర్ రంగాల మధ్య తేడాను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీన్ రూపా అక్కేష్, మెకానికల్ విభాగా ధిపతి జి.కొండయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 12: ఒంగోలులోని ప్రభుత్వమహిళా డిగ్రీ కళాశాలలో నాగార్జున యూనివర్శిటీ మూడవ సంవత్సరం 5, 6 సెమిస్టర్ల మూల్యాంకనం శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రారంభమవుతుందని క్యాంపు ఆఫీసర్, కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూల్యాంకనానికి మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటని, స్టాటిస్టిక్స్, కామర్స్‌లకు సంబంధించిన అన్ని సబ్జెక్టుల జవాబుపత్రాలు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులందరూ తమ యూనివర్శిటీ అపాయింట్‌మెంట్ ఐడీకార్డు, పర్సనల్ ప్రొఫైల్, కళాశాల రిలీవింగ్ తీసుకొని మూల్యాంకనానికి హాజరుకావాలని ఆమె కోరారు.

హెచ్‌ఐవీపై అందరికీ అవగాహన ఉండాలి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 12 : సమాజంలో హెచ్‌ఐవీపై అందరికీ అవగాహన అవసరమని గ్రో ప్రాజెక్టు మేనేజర్ షేక్ పీరు బాషా తెలిపారు. ఒంగోలులోని బండ్లమిట్ట బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మీకు తెలుసా అనే పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అనిత, ఆర్.భవాని, కె.మంగ, అరుణ, భారతి, విజయలక్ష్మి, హెచ్ఎం కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు తరలింపు

• పరిశీలించిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, సెప్టెంబరు 12: టీడీపీ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం సిద్ధం చేసిన నిత్యావసరాల ప్యాకెట్లను గురువారం రాత్రి విజయవాడకు తరలించారు. మార్కాపురంలోని సౌజన్య ఫంక్షన్‌హాలులో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి దగ్గరుండి 9 రకాల నిత్యావసరాలను సంచుల్లో నింపించారు. వాటిని నాలుగు లారీల్లో లోడ్ చేశారు. అనంతరం లారీలను జెండా ఊపి విజయవాడ పంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ నగరంలోని 58, 59 డివిజన్ల పరిధిలోని సింగ్‌నగర్, వాంబేకాలనీలలో నిత్యావసరాల ప్యాకెట్లను శుక్రవారం పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే అక్కడి అధికారులతో మాట్లాడామన్నారు. లారీల్లో తీసుకెళ్తున్న సరుకులను అక్కడ చిన్నపాటి ఆటోల్లో నింపి అన్ని ప్రాంతాల్లో సరఫరా చేస్తామన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, కౌన్సిలర్ నాలి కొండయ్య, పఠాన్ఇబ్రహీం, కనిగిరి రమణ, చక్కా మధు, డి.మస్తానయ్య, గఫార్ ఉన్నారు.

సందడిగా గణేష్ నిమజ్జనం



లడ్డూను దక్కించుకున్న భరత్ తదితరులు

చీమకుర్తి,సెప్టెంబరు 12 : చీమకుర్తిలో గణేష్ నిమజ్జన వేడుకలు సందడిగా జరుగుతున్నాయి. స్థానిక ఎంఎస్ఆర్ క్రిష్ణప్రియ అపార్ట్‌మెంట్‌లో పూజలో ఉంచిన లడ్డూని గురువా రం జరిగిన వేలంలో చింతల వెంకటేశ్వరరావు కుటుంబం రూ.45వేలకు దక్కించుకుంది. దీనిని భరత్ భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో మన్నం నాగరాజు, చంద్రారెడ్డి, మల్లిఖార్జున, వెంకటేశ్వర్లు, పార్థసారధి, తిరుపతిరెడ్డి, తిరుపతయ్య, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముసికి సాగర్‌జలాలు విడుదల చేయాలి

చీమకుర్తి, సెప్టెంబరు 12 : ముసి ఏరుకు సాగర్‌జలాలను సరఫరా చేయటం ద్వారా పరివాహకప్రాంతంలోని దాదాపు 45గ్రామాల ప్రజలకు నీటిసమస్య లేకుండా ఉంటుందని రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంత్‌బాబు, పమిడి వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని ముసి పరివాహకప్రాంతంలోని పంటపొలాలను గురువారం వారు పరిశీలించారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం వెలుగువారిపాలెం వద్ద ఓటీసీ ఎస్కేప్ ద్వారా ముసికి సాగర్ జలాలను సరఫరా చేసిందని, ప్రస్తుతం ఆదేవిధంగా చేయాలని కోరారు. కార్యక్రమలో ఎస్‌కే.మాబు, కంకణాల ఆంజనేయులు, మస్తాన్, చిన్నపురెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నగదును అందిస్తున్న మాదాల నరసయ్య

సంతనూతలపాడు, సెప్టెంబరు 12: మైనంపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మాదాల నరసయ్య విజయవాడ వరద బాధితుల కోసం రూ.లక్ష నగదును, చీమకుర్తిలోని అన్నక్యాంటీన్‌కు విరాళంగా మరో రూ.50వేల నగదును గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి అందజేశారు. అదేవిధంగా ఎనికపాడు టీడీపీ నాయకుడు కట్టా సుబ్బారావు రూ.30వేల నగదును వరద బాధితుల సాయంగా ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న తోటివారికి సాయం అందించేందుకు ముందుకురావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

గణనాథుని పూజలో 'పోతుల'

టంగుటూరు, సెప్టెంబరు 12 : టంగుటూరు వాణీనగర్‌లో ఏకదంత సేవాకమిటీ వారు ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకునికి కురుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న రామారావు

మర్రిపూడి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సాంబశివరావు

మర్రిపూడి, సెప్టెంబరు 12 : మర్రిపూడి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఈవోఆర్డీ సాంబశివరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న సుదీప వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో సాంబశివరావును నియమించారు.

బొబ్బిలిసింహం నాటకం ప్రదర్శన





నాటకంలోని సన్నివేశాలు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు12: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో కోలాటాలు, ఈవెంట్ డ్యాన్స్‌పార్టీలు సహజంగా ప్రదర్శిస్తుంటారు. అయితే మండలంలోని చతుకుపాడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ యువకులు బొబ్బిలి సింహం సాంఘిక నాటకం రెండు నెలలుగా నేర్చుకుని బుధవారం రాత్రి ప్రదర్శించారు. గ్రామాల్లో ప్రస్తుతం టీవీల దెబ్బకు సాంఘిక, పౌరాణిక నాటకాల ప్రదర్శనలు కనుమరుగయ్యాయి. ఈ నేపథ్యంలో యువకులు ప్రదర్శించిన నాటకానికి మంచి స్పందన వచ్చింది. పరిసర గ్రామాల నుంచి భారీగా జనం హాజరయ్యారు.

పాతసింగరాయకొండ విద్యార్థినుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం పద్మజ

సింగరాయకొండ, సెప్టెంబరు 12 : మండలంలోని పాతసింగరాయకొండ జడ్పీ హైస్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థినులు జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ పద్మజ తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి నరసరావుపేటలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో నిర్వహించిన 18వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో సీహెచ్. తులసి, డి. అక్షర, సీహెచ్. పూజ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టులో చోటు దక్కించుకున్నారని వివరించారు. ఎంపికైన విద్యార్థినులు తమిళనాడులోని చెంగల్‌పట్టులో ఈ నెల 27 తేదీ నుంచి నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు ఎండీ అన్వర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

సింగరాయకొండ, సెప్టెంబరు 12 : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై ఈనెల 5 తేదీన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న మూలగుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,ఇన్‌చార్జి ఎంఈవో కత్తి శ్రీనివాసులును గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 అవుల శ్రీనివాసులు, పాకల జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు అర్రిబోయిన రాంబాబు, అంబటి బ్రహ్మయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, శీలం ప్రసాద్‌రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కొండపి ఎమ్మార్సీలో..

కొండపి: మిట్టపాలెం హెచ్‌పీ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన అవ్వారి పిచ్చమ్మను గురువారం కొండపిలోని ఎమ్మార్సీ సెంటర్‌లో ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావులు సన్మానించారు. ఈ సందర్భంగా పిచ్చమ్మ వృత్తి నిర్వహణను కొనియాడారు.

జీవో 85ను రద్దు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12: ప్రభుత్వ వైద్యులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆటంకంగా కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోనెంబరు 85 రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాహుల్, డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌బీలు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు ప్రభుత్వం జారీ చేసిన జీవో కారణంగా విలువ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవోను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారుల తోపాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, దీనివల్ల జీవకోటికి అవసరమైన ప్రాణవాయువు అందుతుందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సీడీసీ డీన్ జి.సోమశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని యూనివర్శిటీ ప్రాంగణంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మండే హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కను నాటారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పిల్లి వెంకటరావు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 12 : పర్యావరణ పరి రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని జీజీహెచ్ డి ప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జీజీహెచ్ లో ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ అండ్ బ్లూ స్కై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యులు తిరుమలరావు, రమేష్‌బాబు, చెంచయ్య, బాలాజీనాయక్, ప్రభాకర్‌రావు, హేమంత్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి : ఎస్‌ఈ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 12: విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ ఎస్‌ఈ కేవీజీ.సత్యనారాయణ తెలిపారు. గురువారం ఒంగోలులోని విద్యుత్‌భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కరెంటు ప్రమాదాల బారినపడిన బాధిత కుటుంబాలకు రూ.30లక్షల పరిహారం అందజేశామన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో కంటే జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయిని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై 22 వరకు 41 ప్రమాదాలు జరిగాయని, అప్పటి నుంచి సెప్టెంబరు 12 వరకు 28 ప్రమాదాలు జరిగాయన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గారి సూచనలతో ప్రజలలో అవగాహన పెంచామని ఎస్‌ఈ వివరించారు.

వైసీపీలో మరో సంక్షోభం

పదవులకు, పార్టీకి దూరమన్న బాలినేని

పెరిగిన ఊహాగానాలు

అయోమయంలో మాజీ సీఎం జగన్

నేడు జిల్లా నేతలతో అత్యవసరంగా భేటీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత ఎన్నికల్లో ఓటమి అనంతరం జిల్లా వైసీపీలో నెలకొన్న నైరాశ్యాన్ని తొలగించేందుకు ఆ పార్టీ అధినేత గత కొంతకాలం నుంచి ప్రయత్నిస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు ఆయన ప్రయత్నాలు బెడిసికొడుతూనే ఉన్నాయి. గత ఎన్నికల్లో ఓటమి అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులుగా ఉన్న జంకె వెంటకరెడ్డి పదవికి రాజీనామా చేశారు. కొత్త అధ్యక్షుడిని నియమించే వరకు కొనసాగాలని ఆయనకు పార్టీ సూచించింది. అయితే కొత్త అధ్యక్షుడిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించాలని తొలుత జగన్ భావించిన విషయం తెలిసిందే. ఆ ప్రతిపాదనను జిల్లా నాయకులు వ్యతిరేకించారు. దీంతో ప్రతిపాదనను విరమించుకున్న జగన్ అనంతరం మరి కొన్ని పేర్లను పరిశీలించినట్లు తెలిసింది. ఈ దశలో రాష్ట్రంలోను, జిల్లాలోను వైసీపీకి గుడ్‌బై చెప్పే వారి జాబితా పెరిగిపోయింది. అయితే తొలుత గిద్దలూరు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు వైసీపీని వీడారు. దీంతో గిద్దలూరు మున్సిపాలిటీ టీడీపీ పరమైంది. ఆ తర్వాత ఒంగోలులో మేయర్, కార్పొరేటర్లు పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఓటమి అనంతరం ఒక్కసారి మాత్రమే ఒంగోలు వచ్చిన బాలినేని ఆ తర్వాత ఇటు వైపు చూడలేదు. ఒంగోలు కార్పొరేషన్ కూడా టీడీపీ వశం కావటం, ఇతర ప్రాంతాల్లో మరికొందరు నాయకులు కూడా కూటమి భాగస్వామి పార్టీల్లో చేరే ప్రయత్నాలు ప్రారంభించారు. చివరకు బాలినేని కూడా జనసేన వైపు దృష్టిసారించారనే ప్రచారం జరిగింది. ఉమ్మడి జిల్లా మొత్తంలో కొత్త ప్రకాశంలో రెండు నియోజకవర్గాల్లోనే ఆ పార్టీ గెలుపొందింది. వారిలో ఒకరైన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని జిల్లాపార్టీ అధ్యక్షుడిగా నియమిస్తారనే ప్రచారం జరిగింది. కారణాలు ఏమైనా ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదు.

జగన్‌ను కలిసిన బాలినేని

ఈ నేపథ్యంలో మాజీ మంత్రి బాలినేని బుధవారం సాయంత్రం తాడేపల్లిలో జగన్‌ను కలిశారు. నాలుగు రోజులుగా పదేపదే జగన్ నుంచి అందిన పిలుపు అనంతరం ఆయన కలిసినట్లు తెలిసింది. వెంటనే జగన్ జిల్లా పార్టీ అధ్యక్షుడి బాధ్యతలు తీసుకోవాలని, తిరిగి రాజకీయంగా చురుకైన పాత్ర పోషించాలని సూచించినట్లుగా సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను బాలినేని తోసిపుచ్చారు. తాను పదవులు తీసుకోనని చెప్పటంతోపాటు ఇప్పట్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే ఆలోచన కూడా లేదని చెప్పినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత బాలినేని జగన్ వద్ద ఎక్కువసేపు ఉండకుండా తిరిగి హైదరాబాద్ వెళ్లారు.

నేడు జిల్లా నేతలతో జగన్ భేటీ

ఈ నేపథ్యంలో జిల్లా పార్టీ నేతలతో జగన్ శుక్రవారం భేటీ కానున్నారు. ఆ మేరకు ఇద్దరు ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిన నాయకులు, ఇతర ముఖ్య నాయకులకు జగన్ వద్ద సమావేశానికి హాజరుకావాలని రాష్ట్ర పార్టీ నుంచి సమాచారం అందింది. ఇదే సమాచారాన్ని బాలినేనికి కూడా ఇచ్చినట్లు తెలిసింది. సమావేశానికి హాజరయ్యేందుకు బాలినేని సుముఖత చూపలేదని కూడా అంటున్నారు. శుక్రవారం సమావేశానికి బాలినేని రాకపోయినా జగన్ కీలక నిర్ణయాలు తీసుకుంటారా, జిల్లా అధ్యక్ష పదవిని మరొకరికి కట్టబెడతారా? అనేది చర్చనీయాంశమైంది.

మాజీమంత్రితో బీజేపీ నేతల భేటీ

కాగా తాజా ఘటనలతో బాలినేని జనసేనలో చేరే ప్రయత్నాల్లో ఉన్నారనే ప్రచారం మరింత ఊపందుకుంది. జనసేనకు చెందిన ఒక నాయకుడు బాలినేనికి టచ్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే బాలినేని పవన్‌కళ్యాణ్‌తో భేటీ అయిన దాఖలాలు లేవు. ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్‌తో కలిసి జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ సీఎం చంద్రబాబును కలిసి బాలినేని పాలనలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని కోరి ఉండటం విశేషం. ఒక జనసేన ముఖ్య నాయకుడు రియాజ్‌కు ఫోన్ చేసి ఏదైనా ఫిర్యాదు చేయదల్చుకుంటే పవన్‌కళ్యాణ్‌కు చేయాలి గాని, టీడీపీ అధినేత వద్దకు వెళ్లటం కరెక్టు కాదని చెప్పినట్లు తెలిసింది. ఇదేసమయంలో ఆరురోజుల క్రితం కొందరు బీజేపీ నాయకులు హైదరాబాద్ వెళ్లి బాలినేనిని కలిసి పార్టీలో చేరాలని కోరారు. బీజేపీ నాయకుల సూచనలతోనే తాము వచ్చినట్లు వారు చెప్పినట్లు తెలిసింది. ఈ దశలో బాలినేని జగన్‌ను కలిసి పార్టీ పదవి తీసుకోనని, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటానని చెప్పటం విశేషం.

వరద బాధితుల కోసం ఆపన్నహస్తాలు

ఎమ్మెల్యే దామచర్లకు చెక్కులు అందజేత



ఎమ్మెల్యే దామచర్లకు చెక్కును అందజేస్తున్న స్నేహసేవికసమితి ప్రతినిధులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల కోసం మేము సైతం అంటూ ఆపన్న హస్తాలు ముందుకొస్తున్నాయి. ఈ మేరకు గురువారం పలువురు తమవంతు విరాళాలను ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అందజేశారు. స్నేహ సేవిక సమితి ఆధ్వర్యంలో స్థానిక మౌర్యలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల, ఆయన సతీమణి నాగసత్యలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో స్నేహ సేవిక సమితి భాగస్వాములు కావడం అభినందనీయం అన్నారు. అనంతరం సమితి సభ్యులు రూ.5లక్షల విరాళం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా సతీమణి లక్ష్మీపద్మావతి, శిద్దా సూర్యకుమారి, డాక్టర్ నల్లూరి అరుణ, డాక్టర్ కమల పాల్గొన్నారు.

పొదుపు మహిళల ఆధ్వర్యంలో..

వరద బాధితులకు అండగా నిలిచేందుకు మెప్మా ఆధ్వర్యంలో రూ.11,02,450ల చెక్కును గురువారం ఎమ్మెల్యే దామచర్లకు టీడీపీ కార్యాలయంలో అందజేశారు. పీడీ రవికుమార్, సీఎంఎం డొక్కా కొండయ్య ఆధ్వర్యంలో ఈ చెక్కును అందించారు. జిల్లాలోని పొదుపు గ్రూపులోని ఒక్కో సభ్యురాలు రూ.10చెల్లించగా, మెప్మా అధికారులు, సిబ్బంది, ఆర్పీలు తమవంతుగా దాతృత్వం చాటారు. ఒంగోలు నుంచి రూ.6.40లక్షలు, మార్కాపురం నుంచి రూ.1.5లక్షలు, కనిగిరి రూ.1.2 లక్షలు, చీమకుర్తి రూ.92వేలు, గిద్దలూరు రూ.68,300, దర్శి నుంచి రూ.50వేలు, మొత్తం రూ. 11,02,450 చెక్కును అందజేశారు.

రంగా కిసాన్ సంస్థ విరాళం

విజయవాడ వరద బాధితుల కోసం ఆచార్య రంగా కిసాన్ సంస్థ అండగా నిలిచింది. ఈ మేరకు గురువారం తమవంతుగా రూ.లక్ష చెక్కును ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆళ్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, ఎన్.అవనీంద్ర ప్రసాద్, మండవ శ్రీనివాసరావు, దాచర్ల వెంకటరమణయ్య, ఎం. వెంకట్రావు, కారుమూడి వెంకటశ్రీమన్నారాయణ, ఎం. సాంబశివరావు, బోడపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

14న పోలింగ్ సిబ్బందికి ఆన్‌డ్యూటీ

- ఉత్తర్వులు జారీ చేసిన సీఈవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 12 : సాధారణ ఎన్నికల్లో మే 13న పోలింగ్ విధులకు హాజరైన సిబ్బందికి 14వ తేదీన ఆన్‌డ్యూటీగా పరిగణిస్తూ ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా ఉత్తర్వులు జారీ చేశారు. మే 13న పోలింగ్ అలస్యంగా ముగియగా ఎన్నికల మెటీరియల్, ఈవీఎంలు రిటర్నింగ్ అధికారికి అప్పగించి పోలింగ్ సిబ్బంది ఇళ్లకు చేరుకునే సరికి బాగా జాప్యం జరిగింది. పోలింగ్ రోజు పగలంతా కష్టపడి రాత్రిళ్ళు ఎన్నికల సామగ్రి అప్పగించేసరికి తెల్లారింది. ఈ నేపథ్యంలో 14వ తేదీని ఆన్‌డ్యూటీగా పరిగణిస్తూ పోలింగ్ విధులకు హాజరైన వారందరికి స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరు చేస్తున్నట్లు సీఈవో ప్రకటించారు. ఈమేరకు పోలింగ్ విధులకు హాజరైన పీవోలు, ఏపీవోలు, ఇతర పోలింగ్ అధికారులకు 14వ తేదీ కూడా ఆన్‌డ్యూటీగా పరిగణిస్తూ కొత్తగా ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని రిటర్నింగ్ అధికారులను ఈఈవో ఆదేశించారు. ఎన్నికల నియామక ఉత్తర్వులు, రిసెప్షన్ సెంటర్‌లో మెటీరియల అప్పగించి వచ్చిన పత్రం చూపించి వారికే కొత్త డ్యూటీ సర్టిఫికెట్లు ఇస్తారు.

ఏచూరి మృతి సీపీఎంకు తీరని లోటు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సీపీఎం జిల్లా కమిటీ ఘనంగా నివాళులర్పించింది. ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో గురువారం రాత్రి జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వై.సిద్దయ్య, జీవీ.కొండారెడ్డి, ఎస్‌కే.మాబు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

- నేత సీతారాం ఏచూరి మృతి పట్ల మాజీమంత్రి శిద్దా రాఘవరావు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. వామపక్ష పోరాటాల్లో ఆయన పాత్ర మరువలేనిదన్నారు.

- సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్. జి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢసంతాపాన్ని వ్యక్తం చేశారు.



ఒంగోలులో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

- సీతారం ఏచూరి మృతి పట్ల సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు.

- సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతిపై జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సంతాపం తెలియజేశారు.

- కిసాన్‌మోర్చా జిల్లాకన్వీనర్ చుండూరి రంగారావు ఒక ప్రకటనలో సీతారం ఏచూరి మృతిపై విచారం వ్యక్తం చేశారు.

టంగుటూరులో..

టంగుటూరు: సీతారాం ఏచూరి మృతి సీపీఎంకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రాము అన్నారు. సీతారాం ఏచూరి సంస్మరణ కార్యక్రమం గురువారం టంగుటూరులో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాము మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆదర్శనీయుడని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రులు



గద్దలగుంటలో గణేషుడికి ప్రత్యేక అలంకరణ



అద్దంకి బస్టాండులో స్వామివారికి ప్రసాదాల నివేదన



నిర్మల్‌నగర్‌లో భక్తుల పూజలు

ఒంగోలు (కల్చరల్), సెప్టెంబరు 12: వినాయక నవరాత్రి ఉత్సవాలు నగరంలో ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఆరవ రోజు స్వామి వారికి చేసిన వివిధ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్దంకి బస్టాండ్ సిద్ధి వినాయకస్వామి ఆలయంలో వివిధ రకాల నైవేద్యాలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అదేవిదంగా స్వామివారి పూజా కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇక స్థానిక ఆర్టీసీకాలనీలో కూరగాయలతో చేసిన శాకంబర గణపతి సైతం భక్తులకు కనువిందు చేసింది. నగరంలోని మంగమూరు రోడ్డు, లాయర్‌పేట, రాజాపానగల్ రోడ్డు, కొణిజేడు బస్టాండ్, గద్దలగుంట, సీతారాంపురం, సంతపేట, భాగ్యనగర్, రాంనగర్, ప్రగతికాలనీ, కర్నూల్ రోడ్ తదితర ప్రాంతాలలో సైతం గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



స్వామివార్లకు నగదులో అలంకరణ

సేంద్రియ ఎరువులతో అధిక ప్రయోజనాలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 12: రైతులు తమ పంట పొలాల్లో సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా వనరుల కేంద్రం సయన్స్ యకర్త రామ్మోహనరావు సూచించారు. గురువారం వినోదరాయునిపాలెంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సేంద్రియ ఎరువుల ద్వారా తెగుళ్ల ఉధృతిని అరికట్టువచ్చని పేర్కొన్నారు. వరి పంట రకాలు, ఎరువులు, తెగుళ్ల నివారణపై దర్శి కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ రమేష్‌బాబు అవగాహన కల్పించారు. ఎన్‌ఎల్‌ఆర్ 33892 విత్తనం కావాల్సిన రైతులు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏడీఏ రమేష్, ఏవో వెంకటరావు సూచించారు. కార్యక్రమంలో ఏవోలు శైలజారాణి, శేషమ్మ, కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు, కార్యదర్శి శేషగిరిరావు, రైతులు పాల్గొన్నారు.

అమరావతి కాలనీలోని సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, సెప్టెంబరు 12: పేర్నమిట్టలోని 39, 40 డివిజన్ పరిధిలోని అమరావతి కాలనీలోని తాగునీరు, వీధిలైట్ల సమస్యలపై గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను గురువారం కలిసి స్థానికులు వినతిపత్రం అందజేసారు. ఆయా సమస్యలతో చాలా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలోనే సమస్యలను పరిష్కారిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

టెస్ట్ డ్రైవ్ పేరుతో బైక్ చోరీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 12: ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టిన బైక్‌ను టెస్ట్ డ్రైవ్ పేరుతో ఉడాయించాడు ఓ దుండగుడు. ఈ సంఘటన ఒంగోలు నగరం భాగ్యనగర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే.. బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్న గౌరిశెట్టి సుమత్‌నాయుడు తన ఓ ఖరీదైన బైక్‌ను ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టాడు. ఈనెల 10న సుమత్‌నాయుడుకు వేర్వేరు నంబర్లతో ఫోన్ చేసి తమకు బైక్ కావాలని అడిగారు. ఈక్రమంలో ఓ వ్యక్తి తాను గుంటూరు నుంచి వచ్చానని, స్థానిక ప్రకాశంభవన్ వద్ద ఉన్నాని అదేరోజు అర్ధరాత్రి 12.30 గంటలకు సుమత్‌నాయుడుకు ఫోన్ చేశాడు. దీంతో ఆయన అక్కడకు వెళ్లి గుర్తుతెలియని వ్యక్తిని ఇంటికి వచ్చి బైక్‌ను చూపించాడు. అయితే టెస్ట్ డ్రైవ్ చేయాలంటూ బైక్ తీసుకుని ఆ దుండగుడు పరారయ్యాడు. దీంతో మోసం జరిగిందని గ్రహించిన సుమత్‌నాయుడు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీపీ రూ.3 లక్షల సాయం



మంత్రి లోకేష్‌కు డీడీని అందిస్తున్న చంద్రశేఖర్, మంత్రి స్వామి, సత్య

టంగుటూరు, సెప్టెంబరు 12 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ బుధవారం రూ. 3లక్షల డీడీని రాష్ట్ర మంత్రి లోకేష్‌కు అందించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొన్నారు.

చిల్లచెట్లతో నిండిన చెరువులు

● మరమ్మతులకు కూడా నోచుకోని దైన్యం ● క్రమేపి సాగుకు దూరం అవుతున్న ఆయకట్టు రైతులు



అడవిని తలపిస్తున్న పూసలపాడు చెరువు

బేస్తవారపేట, సెప్టెంబరు12 : మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏళ్లతరబడి ఏర్పడిన గండ్లను పూడ్చలేదు. పంట కాలువలు, తూములు అధ్వానంగా ఉన్నాయి. పనుల్లో నాణ్యత లోపించడం, మంజూరైన నిధులను సక్రమంగా చెరువులకు ఉపయోగించకపోవడంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని పూసలపాడు గ్రామంలోని చెరువుల అభివృద్ధి కోసం రెండు దశాబ్దాల క్రితం కోట్ల రూపాయాలు వెచ్చించారు. అయితే నేటికీ ఆచెరువుల ఉపయోగంలోకి రాలేదు. చెరువుల కట్ట బలహీనంగా ఉండడంతో చెరువుకు నీరు వచ్చిన ప్రతిసారి చెరువుకు గండ్లు పడి ఒకరోజులోనే నీరు వాగుపాలవుతోంది. దీంతో 800 ఎకరాల ఆయకట్టు నిరుపయోగంగా మారింది. అయితే ఈ చెరువుకు గతంలో రూ.2కోట్లు ప్రతిపాదనలు పంపారు. అలాగే కోనపల్లె చెరువులో చుక్కనీరు నిల్వ ఉండడం లేదు. పలుమార్లు మరమ్మతులు చేసినా ఫలితం కనిపించడంలేదు. చెరువు భూగర్భంలోని నెర్రెలు ఏర్పడి చెరువులోని నీరు పూర్తిగా ఇంకిపోతోంది. పలువురు నిపుణులు పరిశీలించి అనేక రకాల పనులు ప్రయోగాత్మకంగా చేపట్టినా, ఆశించిన ఫలితం కనిపించడంలేదు. దీంతో 500 ఎకరాల ఆయకట్టు నిరుపయోగంగా మారింది. శింగరపల్లె గ్రామానికి తూర్పువైపున నూతనంగా చెరువుల ఏర్పాటు చేస్తే వందల ఎకరాల్లో పంటలు సస్యశ్యామలమవుతాయని, దీంతో రైతుల పరిస్థితి మెరుగుపడుతుందని అంచనాలున్నా, అధికారులు సర్వేలకే పరిమిత మైంది. రూ.11 కోట్ల ప్రతిపాదనలు తయారు చేసినా, అటవీశాఖ అనుమతి రాలేదు. దీంతో నిధులు మంజూరుకాలేదు. ఫలితంగా వెయ్యి ఎకరాలకుపైగా భూములు బీడు భూములుగా ఉన్నాయి. అలాగే జేసీ అగ్రహారం చెరువుకు పూర్తిస్థాయిలో చెరువు కట్ట ఎత్తు పెంచాల్సి ఉండగా పెంచలేదు. చెరువులో చుక్కనీరులేదు. అలాగే దప్పిలి వారి కుంటకు సప్లై ఛానల్ నుండి నీరు వచ్చే కాలువను అభివృద్ధి చేయాల్సి ఉంది. మోక్షగుండం కొత్తచెరువు, ఖాజీపురం హోసూరమ్మ చెరువుల పంట కాలువకు మరమ్మతులు, తూములకు మరమ్మతులు చేయాల్సి ఉంది. జెన్నివారిపల్లె చెరువుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు నోచుకోక రైతులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. మల్లాపురం చెరువుకు మరమ్మతులు చేసినా, చెరువులో నీరు లేక సుమారు 1500 ఎకరాలు సాగులోకి రాలేదు. జగ్గంబోట్ల కృష్ణాపురం ఉప్పువాగు నుండి ఆయకట్టు కాలువను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. పిటికాయగుళ్ల చెరువుకు రూ.2కోట్లతో పనులు చేసిన ఫలితం సక్రమంగా లేదు. చెరువులో నేటికీ, చిల్లకంపతో నిండి ఉంది. ఇప్పటికైనా చెరువులు అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

పొదిలి : పొదిలిలో చిన్న,పెద్ద చెరువులకు కొన్నేళ్లుగా నీరు చేరకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఏటా రైతులు మబ్బులు కమ్మినప్పుడల్లా రైతులు ఆశగా ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. ఆవిధంగా అన్నదాతల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. కుటుంబ అవసరాలకు సరిపడా తిండి గింజలు పండించుకునేందుకు కూడా నీటివసతి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు చిన్న, పెద్ద చెరువులు ఉన్నా, దశాబ్దకాలంగా నీరు చేరకపోవడంతో మాగాణి పొలాలు ఒట్టిపోయాయి. కొంతమంది రైతులు బోర్లను ఆధారంగా చేసుకొని కొద్దిపాటి పొలాన్ని సాగుచేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. చెరువుకులకు నీరు చేరుతాయని పొలంసాగు అవుతుందనే ఆశలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల్లో ఒక మోస్తారు వర్షం పడి పీతురువాగులో నీరు ప్రవహించినప్పటికీ, ఆవాగు పొడవునా అవసరం లేకున్నా కొందరి నాయకుల స్వార్థం కోసం చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయడంతో ఆ కొద్ది నీరు కూడా చెరువులకు చేరడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. భారీవర్షాలు పడితే తప్పా చెరువులకు నీరు చేరే దారికనపడటం లేదు. పొదిలి పెద్ద చెరువు లోతట్టు విస్తీర్ణం 701 ఎకరాలు. ఈ చెరువుపై ఆధారపడి సుమారుగా 200లకుపైగా రైతులు ఉన్నారు. 800లకుపైగా ఆయకట్టు భూములు ఉన్నాయి. వర్షాలు సక్రమంగా కురిస్తే పొలాలు పండుతాయని అన్నదాతలు గత దశాబ్దంగా ఎదురు చూస్తున్నారు. అయితే సరైన వర్షాలు పడి చెరువు నిండిన దాఖలాలు లేవు. కొంతమంది బోర్ల కింద సాగు చేస్తుంటే మరికొంత మందికి ఆర్థిక స్తోమత లేక మాగాణి పొలాలను బీళ్లుగా వదిలేస్తున్నారు. దీంతో ఏటికేడు సాగు విస్తీర్ణం తగ్గుతోంది. అదేవిధంగా చిన్నచెరువు విస్తీర్ణం 101 ఎకరాలు ఉంది. ఈ చెరువు పరిధిలో 238 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువుకు నీరు చేరకపోవడంతో ప్రస్తుతం బోర్లపై ఆధారపడి సుమారుగా 50, 60 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. మిగిలిన పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఆ కాలువలతో ఇక్కడి పొలాలకు నీరు తెచ్చే అవకాశం ఉంటుంది. ఆ దిశగా పాలకులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.



నీరులేక చిల్లచెట్లతో నిండిపోయిన పెద్దచెరువు

అవీ..ఇవీ..

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాలు



మాట్లాడుతున్న కౌన్సిలర్ నాగేశ్వరరావు

మార్కాపురం, సెప్టెంబరు 12: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కౌన్సిలర్ బుస్సెట్టి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గౌతమ్ కళాశాల పరిధిలోని కోడ్ నెంబర్ 44వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో బి.సుశీలాదేవి మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్నారులు, గర్భిణులు బాలింతలు ఆకుకూరలు, చిక్కీలు తదితర పోషక విలువలతో కూడిన ఆహారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రమాదేవి, కార్యకర్త ఎంవీ.ధనలక్ష్మి, ఆయాలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని కోటగడ్డ సచివాలయ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాలలో పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు నిత్యం తీసుకోవాలని సీడీపీవో బి.జ్యోతి తల్లులకు, గర్భిణులకు సూచించారు. పౌష్టికాహార లోపం తలెత్తితే ఆ ప్రభావం పిల్లలపై ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడి కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

కంభం : కంభం మండలం ఎస్‌పీజీపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడి సూపర్‌వైజర్ చెంచులక్ష్మీ మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు తగిన సూచనలు ఇచ్చి పౌష్టికాహారాన్ని అందజేశారు. అంగన్‌వాడి కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతినెలా ఆసుపత్రికి వెళ్ళి వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కంభం ఏఎన్ఎం రామలింగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

త్రిపురాంతకం, సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని హౌసింగ్ లేఅవుట్‌ను గృహనిర్మాణశాఖ మార్కాపురం ఈఈ దాశరదిశర్మ, ఎర్రగొండపాలెం డీఈఈ సురేష్‌బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఆప్షన్-3 గృహాల నిర్మాణాల్లో నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టరు, లబ్ధిదారులతో మాట్లాడారు. నాణ్యతను పాటించాలని, గృహాలకు క్యూరింగ్ చేయాలని సూచించారు. నిర్మాణ సమయంలో ఇళ్ల వద్దనే ఉండి సక్రమంగా నిర్మింప చేసుకునే బాధ్యత తీసుకోవాలని లబ్దిదారులకు సూచించారు. గృహనిర్మాణశాఖ సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో వరప్రసాద్, ఏపీవో సుజాతలతో సమావేశం నిర్వహించి లబ్దిదారులకు 90 రోజుల పనిదినాలు త్వరగా అందేలా చూడాలని కోరారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తే స్లాబ్‌లు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ శ్రీనివాసులు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఉదయశ్రీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గిద్దలూరు, సెప్టెంబరు 12 : పట్టణంలోని కోటగడ్డ వీధిలోని సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ వెంక టదాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలిం చారు. సచివాలయ సిబ్బంది తో ఆయన సమావేశమై నిత్యం అందుబాటులో ఉండాలని, ప్రజలు పేర్కొన్న సమస్యల పరిష్కారానికి పని చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించాల్సిన బాధ్యత మీపై ఉందని కమిషనర్ పేర్కొన్నారు.

పనులు నిలిపివేత

పట్టణంలోని పాములపల్లి రోడ్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ నిలుపుదల చేయించారు. మున్సిపల్ ప్లాన్ అప్రూవల్ లేకుండా ఎలాంటి నిర్మాణాలను చేపట్టకూడదని, నిబంధనలు అతిక్రమించి పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుంతను పూడ్చరూ?



రోడ్డుపై పడిన గుంత

గిద్దలూరు, సెప్టెంబరు 12 : పట్టణంలోని కొమరోలు బస్టాండ్ సమీపంలో రోడ్డు మధ్యలో డ్రైనేజీ కాలువపై గుంతపడింది. కాలువపై ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలో కొంతభాగం విరిగిపోవడంతో గుంత ఏర్పడింది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఆ రోడ్డులో ఏర్పడిన గుంతను వెంటనే పూడ్చించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు.

అడవిపంది దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 12: పశువుల మేతకు వెళ్లిన రైతుపై అడవిపంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మండలంలోని కొత్తూరు గ్రామం పొలాల్లో గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన ఏర్వ జయరామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం జయరామిరెడ్డి నల్లమల అటవీ ప్రాంతం సమీపంలోని తన వ్యవసాయ భూమిలో పశువులకు పచ్చిగడ్డి కోస్తుండగా పక్కనున్న పొదల్లో పిల్లలతో ఉన్న అడవి పంది ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో పొరుగున ఉన్న కొందరు గమనించి కేకలు వేశారు. దీంతో పంది పిల్లలతో కలిసి అడవిలోకి వెళ్లింది. ఈ ఘటనలో జయరామిరెడ్డి గాయాలతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గుర్తించిన రైతులు 108కి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న రేంజి అధికారి విశ్వేశ్వరరావు బాధితున్ని పరామర్శించి ప్రభుత్వం నుంచి రావాలసిన సహాయం త్వరలోనే అందజేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

బేస్తవారపేట లైన్‌మన్‌కు గాయాలు

బేస్తవారపేట, సెప్టెంబరు12 : బేస్తవారపేట పట్టణ విద్యుత్ లైన్‌మన్ అశోక్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం రాత్రి పాపాయిపల్లెలో గణేష్ నిమజ్జన ఉత్సవ సమయంలో విద్యుత్‌లైన్ పరిశీలించడానికి బేస్తవారపేట జంక్షన్ నుంచి వెళుతుండగా ఎదురుగా ఒక ఆటో ఢీ కొట్టింది. దీంతో అశోక్‌కు కుడి కాలు తెగిపడిపోయింది. వెంటనే కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

పందిళ్లపల్లె వద్ద రెండు లారీలు ఢీ

బేస్తవారపేట, సెప్టెంబరు 12: మండలంలోని అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలోని పందిళ్లపల్లె టోల్ ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున ఎదురు ఎదురుగా వచ్చిన రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో రెండు లారీల ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్లకు స్వల్పగాయాలైనాయి.

అర్ధవీడు మాజీసర్పంచ్ రామిరెడ్డి మృతి

కంభం, సెప్టెంబరు 12 : అర్ధవీడు మాజీ సర్పంచ్ మునగాల రామిరెడ్డి (89) గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. సర్పంచ్‌గా ఉన్నపుడు అర్ధవీడు పంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. అర్ధవీడు శుక్రవారం అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు కుమారుడు మార్కాపురం జడ్పీ బాలుర హెచ్ఎం చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

తర్లుపాడు బీసీ కాలనీలో దాహం కేకలు



తోపుడు బండిపై నీటిని తీసుకెళుతున్న కాలనీవాసి

తర్లుపాడు, సెప్టెంబరు 12: తర్లుపాడులోని రైల్వేగేట్ వద్దనున్న బీసీ కాలనీలో తీవ్ర మంచినీటి సమస్య నెలకొంది. ఇప్పటి వరకు నాయుడుపల్లె రైతుల పొలాల నుంచి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా చేశారు. ప్రస్తుతం ఆ మోటర్ మరమ్మతులకు గురికావటంతో తీవ్ర మంచి నీటి ఎద్దడి నెలకొంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోయారు. ఈనేపథ్యంలో సైకిల్, మోటర్ సైకిల్స్, ఆటోలు, రిక్షాల ద్వారా బస్టాండ్ సెంటర్‌లోని చిన్నట్యాంకు నుంచీ నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ కాలనీలోని ప్రజలు రెక్కాడితేగానీ డొక్కాడదు. మంచినీటి కొరకు ఒకరు పనులు మానుకొని నిత్యం బస్టాండ్ సెంటర్ నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతు న్నారు. పాలకులు కాలనీలోని మంచినీటి సమస్యను పరిష్కరిస్తా మని హామీ ఇచ్చినప్పటికీ ఆ కాలనీలో ఇప్పటి వరకు సమస్య పరిష్కారం చూపలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీసీ కాలనీలోని మంచినీటి సమస్య పరిష్కరించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ స్పందిస్తూ, కొత్తగా బోరు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పంచాయతీ నిధుల అవకతవకలపై విచారించాలి

బీజేపీ మండల అధ్యక్షుడు గండివీరారెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 12: జడ్‌పీటీసీ మాజీ సభ్యులు వైసీపీ మండల నాయకులు అమిరెడ్డి రామిరెడ్డి పెద్దబొమ్మలాపురం పంచాయతీ నిధులు పక్కదారి పట్టించాడని బీజేపీ మండల అధ్యక్షుడు సురవరం గండివీరారెడ్డి ఆరోపించారు. స్థానిక శివసదన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దబొమ్మలాపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి నాడు అధికారం బలంలో మంత్రి ఆదిమూలపు సురేష్ అండదండలతో గ్రామ పంచాయతీలకు కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులన్నీ ఎటువంటి పనులు చేయకుండానే డ్రా చేశారన్నారు. ఆర్థికసంఘం నిధులు దుర్వినియోగంపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారించాలని కోరారు. నాటి మండల, పంచాయతీ అధికారులు కూడా ఈ అవినీతిలో భాగస్వాములయ్యారని ఆరోపించారు. సమగ్ర విచా రణకు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలనూ అనర్హులకు అందజేశారన్నారు. ఆయన వదినకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించార న్నారు. ఆమె భర్త, కుమారు లు ఉన్నత స్థితిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాష, అల్లూరిరెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు : పట్టణంలోని ఎస్టీ కాలనీలో బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావడమే కాకుండా దేశాన్ని అభివృద్ధి పథంలో నడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు ఆకర్షితులై పార్టీ సభ్యత్వాలు తీసుకుంటున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, ఎస్సీ మోర్చ ఇన్‌చార్జ్ బండారి జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు తరలింపు



విజయవాడకు నిత్యావసరాల లారీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 12: టీడీపీ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం సిద్ధం చేసిన నిత్యావసరాల ప్యాకెట్లను గురువారం రాత్రి విజయవాడకు తరలించారు. స్థానిక సౌజన్య ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దగ్గరుండి 9 రకాల నిత్యావసరాలను సంచుల్లో నింపించారు. వాటిని నాలుగు లారీల్లో లోడ్ చేశారు. అనంతరం లారీలను జెండా ఊపి విజయవాడ పంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ విజయవాడ నగరంలోని 58, 59 డివిజన్ల పరిధిలోని సింగ్‌నగర్, వాంబే కాలనీలలో నిత్యావసరాల ప్యాకెట్లను శుక్రవారం పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే అక్కడి అధికారులతో మాట్లాడామన్నారు. లారీల్లో తీసుకెళ్తున్న సరుకులను అక్కడ చిన్నపాటి ఆటోల్లో నింపి అన్ని ప్రాంతాల్లో సరఫరా చేస్తామన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, కౌన్సిలర్ నాలి కొండయ్య, పఠాన్ ఇబ్రహీం, కనిగిరి రమణ, చక్కా మధు, డి.మస్తానయ్య, గఫార్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో జీసీడీవో తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రమోద

కొమరోలు, సెప్టెంబరు 12 : మండలంలోని రాజుపాలెం కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని గురువారం జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీవో) ప్రమోద ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీ విద్యాలయంలోని రికార్డులను, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను, పరిసరాలను ప్రత్యేకాధికారి మందారోజ్ సులోచనతో కలసి పరిశీలించారు. విద్యాలయంలో విద్యార్థులతో ఆమె కాసేపు ముచ్చటించారు. విద్యార్థినులకు సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యాలయాన్ని పరిశీలించిన ప్రమోద సంతృప్తి వ్యక్తం చేసి, పలు సూచనలు చేశారు. విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు, ప్రతి విద్యార్థి పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని వారిని మంచిమార్గంలో నడిపించాలన్నారు. ఈ పర్యాయం మన విద్యాలయంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల యూడైస్ సమాచారాన్ని పూర్తి చేయాలి

కొమరోలు, సెప్టెంబరు 12 : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యుడైస్ ప్లస్‌ను త్వరగా పూర్తిచేసి ఇవ్వాలని ఎంఈవో బోర్రా వెంకటరత్నం తెలిపారు. స్థానిక మండల రిసోర్స్ కార్యాలయంలో మండలంలోని ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని ఎంఈవో అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటరత్నం మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్ల శుభ్రత, పచ్చదనం, పరిశుభ్రత కచ్చితంగా ఉండాలన్నారు. విద్యార్థుల్లో విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యాక్రమాల్లో పాల్గొనే విధంగా విద్యార్థులను తయారుచేయాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయునికి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి ప్రోత్సాహం విద్యార్థులకు అందాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ వెంకటేశ్వర్లు, సీఆర్‌పీలు పుల్లయ్య, రామాంజి, నారాయణలు పాల్గొన్నారు.

కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు



సీఎం చంద్రబాబుకు ఎంపీపీ తాటికొండను పరిచయం చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

తాళ్లూరు, సెప్టెంబరు 12: కష్టపడి పనిచేసేవారికి పార్టీలో తప్పక ఆదరణ వుంటుందని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావుకు భరోసా ఇచ్చారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులతోపాటు ఎంపీపీ తాటికొండ గురువారం వెలగపూడి సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్‌లు సీఎం చంద్రబాబుకు శ్రీనివాసరావును పరిచ యం చేశారు. టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని చంద్రబాబు సూచించారు.

చంద్రబాబును కలిసిన దేవినేని

ముండ్లమూరు, సెప్టెంబరు 12: ముఖ్యమంత్రి చంద్రబాబును మండలంలోని ఉమా మహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు దేవినేని కోటేశ్వరరావు బుధవారం రాత్రి విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోటేశ్వరరావును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పరిచయం చేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని ఈసందర్భంగా చంద్రబాబు పేర్కొన్నారు.

'అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ముండ్లమూరు, సెప్టెంబరు 12: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన కోయ బ్రహ్మం నాలుగు రోజుల క్రితం ఈదర వాగుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. గురువారం సాయంత్రం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు బ్రహ్మం తల్లిదండ్రులు అంజయ్య, పూర్ణమ్మలను పరామర్శించారు. అన్నివిధాలా కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్య పడవద్దన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మక్కెన రత్తయ్య, కుంచపు ఏడుకొండలు, అబ్బూరి గోవిందయ్య, నాగండ్ల రమణ, పూనూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

వెలిగండ్ల, సెప్టెంబరు 12: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈఘటన మండల పరిధిలోని పద్మాపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఆరోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధర్మరాజు గురవయ్య కొంతకాలంగా పక్షవాతంతో మంచం పట్టాడు. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చూసేవారులేక తనకుతాను కృంగిపోతూ ఉరేసుకొని మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

'రాజకీయాలకు బంధుత్వాన్ని ముడిపెట్టడం సరికాదు'

తాళ్లూరు, సెప్టెంబరు 12: రాజకీయాలకు బంధుత్వాన్ని ముడిపెట్టి సంబంధంలేని విషయాలను తనకు ఆపాదించడం సరికాదని తాళ్లూరు జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కొత్తపాలెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన మేనల్లుడు ఏదో చేశాడని, ఆవిషయాన్ని తనకు ఆపాదిస్తూ పత్రికల్లో (ఆంధ్రజ్యోతి కాదు) కథనాలు రావటం బాధాకరమన్నారు. తన మేనల్లుడు వ్యవసాయం పనిముట్లు ఇప్పించేందుకు డబ్బులు వసూలు చేసిన వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు

దర్శి, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరనిలోటని సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి టి.రంగారావు పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కట్టుబడి ఉన్న గొప్పనాయకున్ని దేశం కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. నివాళులర్పించినవారిలో సీపీఎం నాయకులు సందు వెంకటేశ్వరరావు, ఎస్ఎం బాషా తదితరులు ఉన్నారు.

పామూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని ఆపార్టీ నాయకుడు పాపిరెడ్డిపల్లి మిరావలి అన్నారు గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో కె.మాల్యాద్రి, అలాకలబక్ష్, సీహెచ్ వెంకటేశ్వర్లు, మహబూబ్ పీరా, పిచ్చిరెడ్డి, తదితరులు ఉన్నారు.

18న దర్శిలో జాబ్ మేళా

దర్శి, సెప్టెంబరు 12: స్థానిక పీటీఎస్ కల్యాణ మండపంలో ఈనెల 18న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన కంపెనీలతో మాట్లాడి జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 40 మందిపై కేసులు నమోదు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 12: సీఎస్‌పురం మండలంలో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కనిగిరి విద్యుత్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న 40 మందిని గుర్తించి రూ.లక్షా 46 వేలు జరిమానా విధించినట్లు ఏఈ కె.మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈఈ మాకినేని హరిబాబు, డీఈ ఆర్.ఉమాకాంత్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ మండపం వద్ద లడ్డూ చోరీ

పీసీపల్లి ,సెప్టెంబరు 12: గణేష్ మండపం వద్ద ఉంచిన వినాయకుని లడ్డూ చోరీకి గురైన ఘటన మండలంలోని పెదఅలవలపాడు ఎస్సీ కాలనీలో గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పది కేజీల లడ్డూను మండపంలోని వినాయకుని పాదాల చెంత ఉంచారు. ఈ విషయపై పీసీపల్లి ఎస్సై కోటయ్యను వివరణ కోరగా ఈ విషయాన్ని తన దృష్టికి ఎవరూ తీసుకురాలేదన్నారు. ఫిర్యాదుచేస్తే విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కనిగిరి, సెప్టెంబరు 12: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఛైర్మన్ గఫార్ అన్నారు. గురువారం స్థానిక 6, 8 వార్డులో పూడికతీత పనులు చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

త్వరలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ కార్యదర్శి పవన్‌కుమార్, మాలకొండారెడ్డి, మస్తాన్‌వలి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

కనిగిరి, సెప్టెంబరు 12: ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారికి గుంటూరులోని శంకర కంటి ఆసుపత్రికి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకోవటానికి వచ్చేవారు. ఆధార్, ఓటర్ లేదా ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఇంటి సభ్యుల ఫోన్ నంబర్ తీసుకురావాలని కోరారు.

మోపాడు రిజర్వాయర్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులు

పామూరు, సెప్టెంబరు 12: మండలంలోని మోపాడు రిజర్వాయర్ లోపలి భాగంలో దట్టంగా పెరిగిన చిల్ల చెట్లను ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో, ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో తొలగిస్తున్నట్లు డీఈ రవి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నీటి విడుదలను నిలిపివేశామని తెలిపారు. గేటు తూము ద్వారా పోతున్న లీకేజిని అరికడతామన్నారు. జంగిల్ క్లియరెన్స్ భాగంగా జైకో నిధులతో కట్టపై మొలచిన చెట్లను సైతం తొలగించి కట్ట వెడల్పు చేపట్టేలా చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- కస్తూర్బా పాఠశాలకు రూ.ఐదు లక్షలు సాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

వెలిగండ్ల, సెప్టెంబరు 12: అధికారులు నిబద్ధతతో పనిచేసి వెలిగండ్ల మండల అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం జరిగిన వెలిగండ్ల మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ రామణ మహాలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అధికారులు సమావేశానికి వచ్చేటప్పుడు ప్రజల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని రావాలన్నారు. సర్పంచులు పెట్టిన బిల్లులు, పనులను అనుమతించాలన్నారు. ఎవరైనా అవినీతి పాల్పడినట్లు తెలిసినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెలిగండ్లలో ప్రాథమిక పాఠశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ సురేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ గుంటక తిరుపతి రెడ్డి, ఎంపీడీవో రామచంద్రరావు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు నాణ్యమైన బియ్యం అందజేస్తాం

వెలిగండ్లలోని కస్తూర్బా పాఠశాలను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సందర్శించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే బియ్యం తినలేకపోతున్నామని తెలిపారు. తన సొంత నిధులతో నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేసి పాఠశాలకు అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దాతలు కూడా ముందుకువచ్చి పాఠశాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. పాఠశాలలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు.

కార్యక్రమంలో నాయకులు ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, కర్నాటి భాస్కర్‌రెడ్డి, సాన జయపాల్ రెడ్డి, చిలకల వెంకటేశ్వరరెడ్డి, పందు, తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పామూరు: గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న సూపర్‌వైజర్ పార్వతి

పామూరు సెప్టెంబరు 12: పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నా, వయసును బట్టి బరువు ఎత్తు పెరగాలన్నా సమతుల ఆహారం తీసుకోవడంతోనే సాధ్యమవుతుందని డాక్టర్ హరిబాబు తెలిపారు. మండలంలోని వగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషకాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని గురువారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి అధ్యక్షతన నిర్వ హించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చే గుడ్లు, చెక్కీలు, రాగిజావతోపాటు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. బాలికల్లో ఎక్కువ మంది రక్తహీనతకు గుర వుతున్నారని చెప్పారు. సమతుల ఆహారంతో రక్తహీనతను నివారించ వచ్చునన్నారు. అనంతరం పోషకాహార ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార అవశ్యకతపై తల్లులు, గర్భిణులు, కిషోర బాలికలను అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వ హించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.తిరుపతిరెడ్డి, ఆరోగ్య కార్యకర్త మహాలక్ష్మి, పి.మౌనిక, దేవిశ్రీ, లక్ష్మి, సునీత, ఈశ్వరమ్మ, రామాంజమ్మ, సుశీల, మరియమ్మ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పీసీపల్లి,సెప్టెంబరు 12: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జరీనా అన్నారు. గురువారం మండలంలోని పోతవరం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ జరీనా ఆధ్వర్యంలో జరిగిన పోషకాహార అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

గర్భిణులు సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఆకుకూరలతో పాటు బొప్పాయి తదితర పండ్లను తీసుకోవడం ద్వారా దృష్టిలోపం రాకుండా ఉండడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం గ్రామంలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 12: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో సీహెచ్ భారతి అన్నారు. మండలంలోని బొద్దికూరపాడులో జరిగిన పౌష్టికాహార మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. పిల్లలతో పాటు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో వై.యుగకీర్తి, హెచ్ఎం సుబ్బారావు, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో మరో సంక్షోభం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత ఎన్నికల్లో ఓటమి అనంతరం జిల్లా వైసీపీలో నెలకొన్న నైరాశ్యాన్ని తొలగించేందుకు ఆపార్టీ అధినేత గత కొంతకాలం నుంచి ప్రయత్నిస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు ఆయన ప్రయత్నాలు బెడిసికొడుతూనే ఉన్నాయి. గత ఎన్నికల్లో ఓటమి అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులుగా ఉన్న జంకె వెంటకరెడ్డి పదవికి రాజీనామా చేశారు. కొత్త అధ్యక్షుడిని నియమించే వరకు కొనసాగాలని ఆయనకు పార్టీ సూచించింది. అయితే కొత్త అధ్యక్షుడిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించాలని తొలుత జగన్ భావించిన విషయం తెలిసిందే. ఆ ప్రతిపాదనను జిల్లా నాయకులు వ్యతిరేకించారు. దీంతో ప్రతిపాదనను విరమించుకున్న జగన్ అనంతరం మరికొన్ని పేర్లను పరిశీలించినట్లు తెలిసింది. ఈ దశలో రాష్ట్రంలోను, జిల్లాలోను వైసీపీకి గుడ్‌బై చెప్పే వారి జాబితా పెరిగిపోయింది. జిల్లాలో తొలుత గిద్దలూరు మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు వైసీపీని వీడారు. దీంతో గిద్దలూరు మున్సిపాలిటీ టీడీపీ పరమైంది. ఆ తర్వాత ఒంగోలులో మేయర్, కార్పొరేటర్లు పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఓటమి అనంతరం ఒక్కసారి మాత్రమే ఒంగోలు వచ్చిన బాలినేని ఆ తర్వాత ఇటు వైపు చూడలేదు. ఒంగోలు కార్పొరేషన్ కూడా టీడీపీ వశం కావటం, ఇతర ప్రాంతాల్లో మరికొందరు నాయకులు కూడా కూటమి భాగస్వామి పార్టీల్లో చేరే ప్రయత్నాలు ప్రారంభించారు. చివరకు బాలినేని కూడా జనసేన వైపు దృష్టిసారించారనే ప్రచారం జరిగింది. ఉమ్మడి జిల్లా మొత్తంలో కొత్త ప్రకాశంలో రెండు నియోజకవర్గాల్లోనే ఆ పార్టీ గెలుపొందింది. వారిలో ఒకరైన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని జిల్లాపార్టీ అధ్యక్షుడిగా నియమిస్తారనే ప్రచారం జరిగింది. కారణాలు ఏమైనా ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదు.

జగన్‌ను కలిసిన బాలినేని

ఈ నేపథ్యంలో మాజీ మంత్రి బాలినేని బుధవారం సాయంత్రం తాడేపల్లిలో జగన్‌ను కలిశారు. నాలుగు రోజులుగా పదేపదే జగన్ నుంచి అందిన పిలుపు అనంతరం ఆయన కలిసినట్లు తెలిసింది. వెంటనే జగన్ జిల్లా పార్టీ అధ్యక్షుడి బాధ్యతలు తీసుకోవాలని, తిరిగి రాజకీయంగా చురుకైన పాత్ర పోషించాలని సూచించినట్లుగా సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను బాలినేని తోసిపుచ్చారు. తాను పదవులు తీసుకోనని చెప్పటంతోపాటు ఇప్పట్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే ఆలోచన కూడా లేదని చెప్పినట్లు తెలుస్తోంది. ఆతర్వాత బాలినేని జగన్ వద్ద ఎక్కువసేపు ఉండకుండా తిరిగి హైదరాబాద్ వెళ్లారు.

నేడు జిల్లా నేతలతో జగన్ భేటీ

ఈ నేపథ్యంలో జిల్లా పార్టీ నేతలతో జగన్ శుక్రవారం భేటీ కానున్నారు. ఆ మేరకు ఇద్దరు ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిన నాయకులు, ఇతర ముఖ్య నాయకులకు జగన్ వద్ద సమావేశానికి హాజరుకావాలని రాష్ట్ర పార్టీ నుంచి సమాచారం అందింది. ఇదే సమాచారాన్ని బాలినేనికి కూడా ఇచ్చినట్లు తెలిసింది. సమావేశానికి హాజరయ్యేందుకు బాలినేని సుముఖత చూపలేదని కూడా అంటున్నారు. శుక్రవారం సమావేశానికి బాలినేని రాకపోయినా జగన్ కీలక నిర్ణయాలు తీసుకుంటారా, జిల్లా అధ్యక్ష పదవిని మరొకరికి కట్టబెడతారా? అనేది చర్చనీయాంశమైంది.

మాజీ మంత్రితో బీజేపీ నేతల భేటీ

కాగా తాజా ఘటనలతో బాలినేని జనసేనలో చేరే ప్రయత్నాల్లో ఉన్నారనే ప్రచారం మరింత ఊపందుకుంది. జనసేనకు చెందిన ఒక నాయకుడు బాలినేనికి టచ్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే బాలినేని పవన్‌కళ్యాణ్‌తో భేటీ అయిన దాఖలాలు లేవు. ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్‌తో కలిసి జనసేన జిల్లాఅధ్యక్షుడు రియాజ్ సీఎం చంద్రబాబును కలిసి బాలినేని పాలనలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని కోరి ఉండటం విశేషం. ఒక జనసేన ముఖ్య నాయకుడు రియాజ్‌కు ఫోన్ చేసి ఏదైనా ఫిర్యాదు చేయదల్చుకుంటే పవన్‌కళ్యాణ్‌కు చేయాలి గాని, టీడీపీ అధినేత వద్దకు వెళ్లటం కరెక్టు కాదని చెప్పినట్లు తెలిసింది. ఇదేసమయంలో ఆరురోజుల క్రితం కొందరు బీజేపీ నాయకులు హైదరాబాద్ వెళ్లి బాలినేనిని కలిశారు. ఆ పార్టీలో చేరాలని కోరారు. బీజేపీ నాయకుల సూచనలతోనే తాము వచ్చినట్లు వారు చెప్పినట్లు తెలిసింది. ఈ దశలో బాలినేని జగన్‌ను కలిసి పార్టీ పదవి తీసుకోనని చెప్పటంతోపాటు పార్టీ కార్యక్రమాలకు తాను దూరంగా ఉంటానని చెప్పటం విశేషం.

వైభవంగా వినాయక నిమజ్జనం



ముండ్లమూరులో వినాయకుని నిమజ్జన ఊరేగింపు

దొనకొండ, సెప్టెంబరు 12: దొనకొండ, సెప్టెంబరు 12: విఘ్నేశ్వరిడి ఆశీస్సులు పొంది ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నరసింహ నాయునిపాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం నిమజ్జన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, కొత్తం రఘునాథరెడ్డి, శృంగారపు నాగసుబ్బారెడ్డి, శృంగారపు రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ఎన్ఎన్ పాలెంలో టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన గణనాథునికి గురువారం వైభవంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, కొత్తం రఘునాథరెడ్డి, శృంగారపు నాగసుబ్బారెడ్డి, మన్నెం గాలయ్య, దెగ్గెం పూడి చెంచయ్య తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అ నంతరం ఊరేగింపుగా కురిచేడు సాగర్ కెనాల్‌కు తరలించి నిమజ్జనం చేశారు.

కాగా, మండలంలోని వెంకటాపురంలో కొలువుదీరిన గణనాథునికి ప్రసాదంగా ఏర్పాటు చేసిన తొమ్మిది కేజీల లడ్డూకు నిర్వాహకులు వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన పుట్టా వెంకటరమణ రూ.లక్షా అరవై ఐదు వేలకు వేలం పాట పాడి గణనాథుడి లడ్డూ దక్కించుకున్నారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, సెప్టెంబరు 12: మండలంలోని పలుగ్రామాల్లో వినాయక విగ్రహాలు ఐదురోజుల పాటు పూజలందుకొని గురువారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. ముండ్లమూరులోని బీసీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం, తమ్మలూరు, బసవాపురం, పెద రావిపాడు, వేంపాడు, పూరిమెట్ల, ఈదర, ఉమామహేశ్వర అగ్రహారం తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు.

అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ, దర్శి సమీపంలోని సాగర్ కాలువల్లో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా ఎస్ఐ వై.నాగరాజు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, సెప్టెంబరు 12 : మండలంలోని బసవాపురం, పెదరావిపాడు గ్రామాల్లో టీడీపీ వర్గీయులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి లలిత్‌సాగర్ దంపతులు గురువారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, చుంచు వీర నారాయణ, ఏలూరి సుబ్బారావు, సందాడి వెంకట్, లింగారావు, గురవయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో.. తాళ్లూరు సెప్టెంబరు 12: గత ఆరు రోజులుగా పూజలు అందుకున్న గణనాథులను గురువారం నిమజ్జనానికి తరలించారు. మండలంలోని శివరాంపురం, బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం, లక్కవరం, తురకపాలెం, దారంవారిపాలెం, మన్నేపల్లిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను దోర్నపువాగు, గుండ్లకమ్మ తదితర వాగుల్లో నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రూ.లక్షలు పలికిన వినాయకుని లడ్డూ

పామూరు సెప్టెంబరు 12 : వినాయకుని మండపాల్లో ఏర్పాటుచేసిన లడ్డూ పాటల్లో భక్తులు పాల్గొని సొంతం చేసుకొన్నారు. పామూరు పట్టణంలోని రవికళామందిర్ వద్ద నిర్వహించిన లడ్డూను గుర్రం ప్రసాద్ రూ.లక్షా 16వేలకు దక్కించుకొన్నాడు ఆకులవీధిలోని లడ్డూను గుడిమెట్ల చరణ్ రూ.65 వేలకు, తూర్పువీధిలోని లడ్డూను పేరం నితిష్‌రెడ్డి రూ.61 వేలకు దక్కించుకొన్నాడు.

మండంలోని కోడిగుంపల గ్రామంలో వినాయ కుని లడ్డూను కందుల మహేష్, సౌమ్య దంపతులు రూ.42,116 లకు సొంతం చేసుకొన్నారు. పాటల్లో పాల్గొని స్వామి లడ్డూను దక్కించుకొన్న భక్తులను గణేష్ మండపాల ఉత్సవ కమిటీ నిర్వాహకులు అభినందిం చారు.

న్యాయం చేయాలని రైతుల వినతి



విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసిన బాధితులు

దర్శి, సెప్టెంబరు 12: సబ్సిడీపై ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తి నుంచి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. తాళ్లూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుడు నాగార్జునరెడ్డి ఐటీసీ ద్వారా సగం ధరకు సబ్సిడీపై ట్రాక్టర్లు, రొటోవేటర్లు, వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానని వందలాది రైతుల నుంచి కోట్లాది రూపాయలు వసూళ్లు చేసిన విషయం తెలిసిందే. బాధితులు ఇప్పటికే జిల్లా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి జరిగిన విషయం చెబితే న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో ఆయన వద్దకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈసందర్భంగా బాధిత రైతలకు న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

బెల్ట్‌షాప్ తొలగించాలని మహిళల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మహిళలు

కనిగిరి, సెప్టెంబరు 12: గ్రామంలో బెల్ట్‌షాప్ తొలగించాలని కోరుతూ గురువారం మండలంలోని నందనమారెళ్ల మహిళలు రహదారిపై రాస్తారోకో చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలోని పాలకుల అండతో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ గ్రామానికి చెందిన మహిళలు మద్యాన్ని అమ్మ వద్దంటూ షాపు యజమానికి పలుమార్లు చెప్పినా వినలేదు. దీంతో విసిగివేశారిని మహిళలు రోడ్డుపై అడ్డంగా నిలబడి వాహనాలను నిలిపివేశారు. అడ్డంగా టైర్లను పెట్టి వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు సంఘటనాస్థలికి వెళ్లి బెల్ట్‌షాపు తొలగించేలా చర్యలు తీసుకుంటామని మహిళలకు సర్దిచెప్ప డంతో ఆందోళ నను విరమించారు.





హాజరని చెప్పి తీర్మానాలపై సంతకాలు తీసుకోవడంపై చర్చిస్తున్న సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిలు

ధీమాలేని బీమా

వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి, తేమ ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు తరచూ నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడిన పంటలు కోల్పోతున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా అప్పుల పాలవుతున్న రైతులు చివరకు ఆయువు తీసుకుంటున్నారు. అన్నదాతలకు ఆర్థిక నష్టాలు, కష్టాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకం ప్రవేశపెట్టింది. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలో అందని ద్రాక్షగానే మారింది. రూ.వేలల్లో పెట్టుబడులు వర్షార్పణం అవుతుంటాయి. ఆ నష్టాల నుంచి కోలుకోవడం రైతులకు గగనంగా మారుతోంది. వాతావరణ ఆధారిత బీమా పథకం ద్వారా బాధిత రైతులకు పరిహారం అందించే విషయంలో అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. రైతులకు ఈ పథకంపై అవగాహన కల్పించి, నమోదు చేయించాల్సిన వ్యవసాయ, ఉద్యాన, ప్లానింగ్ శాఖలు అంతులేని నిర్లక్ష్యంతో ఉన్నాయి. దీంతో రైతులు పంటలు కోల్పోతున్నా బీమా పరిహారం అందుకోలేకపోతున్నారు. అధిక వర్షాల వలన పంటలను కోల్పోయిన రైతులకు బీమా అందుకునే అవకాశం ఉన్నా ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.



- అందని ద్రాక్షగా వాతావరణ ఆధారిత బీమా
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో అంతులేని నిర్లక్ష్యం
- పరిహారం అంశంలో దగాకు గురౌతున్న అన్నదాతలు
- అమలుపై పట్టీపట్టనట్లుగా వ్యవసాయ, ప్లానింగ్ శాఖలు
- వర్షపాతం ఆధారంగానే పరిహారమని రైతుల ప్రయోజనాలకు గండి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఈ నెలలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అతి భారీవర్షాలు కురిశాయి. వేల ఎకరాల్లోని పంటలు ముంపునకు గురయ్యాయి. ఇలాంటి పరిణామాలు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో ఏటా జరగడం సర్వసాధారణంగా మారుతుంటోంది. అయినా వాతావరణ ఆధారిత బీమా పథకం అందని ద్రాక్ష చందాన మారింది. నిబంధనల ప్రకారం ఖచ్చితంగా రైతులకు పరిహారం అందే అవకాశం ఉంది. అయితే పంటలు కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా వాతావరణ ఆధారిత బీమా పరిహారం అందించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు శూన్యం. సాధారణ పంటల బీమాకు, వాతావరణ ఆధారిత బీమాకు పూర్తిగా వ్యత్యాసం ఉంది. సాధారణ పంటల బీమా అమలులో సాగు చేసిన పంటలో 33 శాతం పూర్తిగా పంట దెబ్బతింటేనే పరిహారం చెల్లిస్తారు. వాతావరణ ఆధారిత బీమా పథకం అలా ఉండదు. పంట వేసిన సమయంలో అధిక వర్షాలు కురిస్తే జరిగే నష్టాన్ని అంచనా వేస్తారు. ఇలా పంట వివిధ దశల్లో అధిక వర్షాలు, వర్షాభావం వల్ల కలిగే నష్టాన్ని నమోదు చేయాలి. ఈ పరిస్థితుల్లో వాతావరణ బీమా పథకం అమలు కాకపోవడానికి గల కారణాలను సంబంధిత అధికారులు వెల్లడించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. పథకం లక్ష్యాలు ఘనంగా ఉన్నా పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం అందిన దాఖలాలు ఇప్పటి వరకు లేవు. గత ఏడాది తీవ్ర వర్షాభావం.. భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పత్తి, మిరప పంటలను వాతావరణ ఆధారిత బీమా పథకంలో చేర్చారు. సదరు రైతులు సాగు చేసిన పత్తి, మిరప పంటలకు వాతావరణ బీమా అమలు అవుతోంది. ఆయా పంటలకు ప్రభుత్వమే రైతుల తరపున ప్రీమియం చెల్లిస్తోంది. వాతావరణ ఆధారిత బీమాలో బీమా ప్రీమియం చెల్లించే ప్రతి రైతు అర్హుడే. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా కలిగే పంట నష్టాలకు బీమా వర్తిస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేస్తారు. అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతింటే పరిహారం చెల్లిస్తారు.

సాధారణంకన్నా అధిక వర్షపాతం

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో గత నెల 31, ఈ నెల 1 తేదీల్లో సాధారణ వర్షపాతం 680.76 మీమీ కాగా 15,764.1 మీమీ నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అంటే సాధారణం కన్నా వెయ్యింతల అధిక వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షాలు రైతులను కోలుకోలేని విధంగా నష్టపరిచాయి. మిరప, వరి, పత్తి, కంది పంటలకు అపార నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ తరుణంలో రైతులకు వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పరిహారం అందించాలి. రైతులకు సదరు పరిహారం అందేలా చర్యలు తీసుకోవడంలో ఉద్యాన, ప్లానింగ్ శాఖలు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. కుండపోత వర్షాలకు ఈ సారి కూడా వేలాది ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నా బాధిత రైతులకు బీమా ధీమా ఇచ్చే పరిస్థితులు కానరావడంలేదు. దీంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల వల్ల ఆయా పంటలకు జరిగిన నష్టానికి ఈ బీమా పథకం కింద పరిహారం అందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు లేవనే చెప్పాలి. 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంటలకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు. 31, 1 తేదీల్లో సాధారణం కన్నా వేల రెట్లు అధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. అధిక వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. పత్తి తొలికాపు దశలో అధిక వర్షాలు కురిశాయి. దీనివల్ల దిగు బడులను కోల్పోయారు. నీటిలో నాని ఉరకెత్తి మొక్కలు ఎండిపోయి ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడులను రైతులు కోల్పోయారు. ఇలా జరిగిన పంట నష్టం వాతావరణ ఆధారిత బీమా కిందకు వస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికలు ఆధారంగా, పంట నష్టపరిహారం కోసం వ్యవసాయ శాఖ నివేదికలు పంపించాల్సి ఉంటుంది. వ్యవసాయ స్పందించి రైతులకు మేలు చేసేందుకు కృషి చేయాలి. పల్నాడు జిల్లా పరిధిలోని 17 మండలాల్లో 23,317.5 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. 123 గ్రామాల పరిధిలో 9,006 మంది రైతులు నష్టపోయినట్లుగా గుర్తించారు. తుది నివేదికలో 21,212.5 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. అయితే 33 శాతం నష్టం 6,930 ఎకరాల్లో వాటిల్లిందని 3,253 మంది రైతులు నష్టపోయినట్లు మాత్రమే నిర్ధారించారు. అయితే 9,006 రైతులందరికీ వాతావరణ ఆధారిత బీమా పరిహారం వచ్చే అవకాశం ఉన్నా వ్యవసాయ, ప్లానింగ్ శాఖలు స్పందిస్తున్న దాఖలాలు లేవు.

హాజరని చెప్పి..

తీర్మానాలపై సంతకాలు

- తోటి ఉద్యోగస్తులకు జీడీసీసీ అధికారుల బురిడీ
- ఆర్థికపరమైన విషయాలు అజెండాలో చేర్చి దొడ్డిదారిలో సంతకాలు
- ఎదురు తిరిగిన సహకార శాఖ ఉద్యోగులు
- నకిలీ రుణాల రికవరీ ఊసెత్తని మహాజన సభ సమావేశం
- సొసైటీలకు మేలు చేసే అంశం ఒక్కటీ లేదని ఆరోపణలు
- ఇకపై విమానంలోనే సీఈవో అధికారిక పర్యటనలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 12 : గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీ) మహాజనసభ సమావేశంలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో గురువారం జరిగిన ఈ సమావేశంలో జీడీసీసీ అధికారులు తోటి ఉద్యోగస్తులను బురిడీ కొట్టించారు. హాజరు తీసుకుంటున్నామని చెప్పి ఏకంగా తీర్మానాలపై సంతకాలు తీసుకోవడం వివాదాస్పదమైంది. ఆర్థికపరమైన విషయాలు అజెండాలో చేర్చి దొడ్డిదారిలో సంతకాలు తీసుకున్నారని సొసైటీలకు పర్సన్ ఇంచార్జి లుగా ఉన్న సహకార శాఖ ఉద్యోగులు ఎదురు తిరగడంతో వ్యవహారం రచ్చకెక్కింది. తొలుత జీడీసీసీ బ్యాంకు 114వ వార్షిక నివేదికను, టేబుల్ అజెండా పత్రాలను సొసైటీలకు పర్సన్ ఇంచార్జిలకు అందజేశారు. సమావేశానికి వచ్చిన వారి హాజరు తీసుకుంటున్నామని చెప్పి వారితో సంతకాలు తీసు కున్నారు. బ్యాంకు పర్సన్ ఇంచార్జిగా ఉన్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ వచ్చిన తరువాత సమావేశం ప్రారంభించారు. కొద్ది సేపు వార్షిక నివేదిక, టేబుల్ అజెండాపై అధికారులు మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సమావేశం ముగించి వెళ్లిపోయారు. ఆ తర్వాత సొసైటీలకు పర్సన్ ఇంచార్జిలుగా ఉన్న సహకార శాఖ ఉద్యోగులు తీర్మాణం పుస్తకం కావాలని బ్యాంకు సీఈఓ కృష్ణవేణిని అడిగారు. అందుకు ఆమె సమాధానం దాటవేయడంతో ఉద్యోగులు ప్రత్యేకంగా సమావేశమై సభలో ప్రవేశపెట్టిన తీర్మానాలను తాము ఆమోదించ బోమని రాత పూర్వకంగా తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిలు మాట్లాడుతూ మహాజన సమావేశానికి సంబంధించిన తీర్మానాలు రాసేందుకు పుస్తకం లేదని సీఈఓ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంత పెద్ద బ్యాంకులో తీర్మానాలను రాసే పద్ధతి లేదని చెప్పడం అందరినీ మోసగించడమేనని అన్నారు. ఈ సమావేశంలో జరిగిన తీర్మానాలకు తమకు ఏ విధమైన సంబంధం లేదని ఉద్యోగులు స్పష్టం చేశారు.

స్వప్రయోజనాలు తప్ప....

జీడీసీసీ బ్యాంకు మహాజన సభ సమావేశంలో అక్కడ పనిచేస్తున్న అధికారుల ప్రయోజనాలు తప్ప మరేమీ లేవు. గత కొన్ని రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో జీడీసీసీ బ్యాంకులు వేదికగా అనేక కుంభకోణాలు జరిగాయి. ఈ సమావేశంలో వాటి తాలూకూ విచారణ నివేదికలను బయట పెడతారని,నకిలీ రుణాలను రికవరీ పై చర్చి స్తారని అందరూ భావించారు. కానీ, వాటి ప్రస్తావన లేకుండా నే సమావేశాన్ని 'మమ' అనిపించారు. రానున్న రోజుల్లో రైతు ప్రయోజనాలు ముడిపడిన సొసైటీలకు ఏమి మేలు చేస్తారన్న దానిపై కూడా చర్చ లేకుండానే సమావేశం ముగించారనే ఆరోపణలు వస్తు న్నాయి. జీడీసీసీలో పనిచేసే అధికారుల అలవెన్స్‌లు,ఇతర ప్రయోజనా లను అజెండాలో చేర్చి గుట్టుగా ఆమోదింపచేసుకున్నారు.

విమాన ప్రయాణం..

టేబుల్ అజెండాలో చేర్చిన మరో అంశం చర్చనీయాంశంగా మారింది. జీడీసీసీ సీఈఓ ఇకపై అధికారిక పర్యటన కోసం విమానంలో ప్రయాణించేందుకు వీలుగా తీర్మానం ప్రవేశపెట్టారు.రైల్లో ప్రయాణిస్తే సెకండ్ క్లాస్ ఏసీ, విమానం అయితే ఎకానమీ క్లాస్‌లో వెళ్ళేట్టుగా తీర్మానం పెట్టారు.టేబుల్ ఎజండా సబ్జెక్ట్ 6 లోని 2,3,4,5,6 అంశాలపై సొసైటీ పర్సన్ ఇంచార్జిలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త గా మూడు శాఖల ఏర్పాటు

జీడీసీసీ అదనంగా 21 శాఖలు ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు పంపగా ఆర్‌బీఐ అందులో మూడింటికి పచ్చజెండా ఊపింది. పెదకాకాని, పెదనందిపాడు, ముట్లూరులో జీడీసీసీ బ్రాంచీలు ఏర్పాటు చేయనున్నట్లు వార్షిక నివేదికలో వెల్లడించారు. నికర లాభం రూ.21.94కోట్లు 2023-2024 సంవత్సరానికి గానూ బ్యాంకు నికర లాభం రూ. 21.94 కోట్ల ని నివేదికలో వెల్లడించారు.

మార్చి 29 వరకే ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవి

- నవంబరు 6 వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం

నరసరావుపేట, సెప్టెంబరు 12: పట్టభద్రుల నియో జకవర్గ ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ లో భాగంగా పట్టభద్రులు ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పట్టభద్రులకు ఓటు నమోదు దరఖా స్తుకు నవంబరు 6 చివరి తేదీగా నిర్ణయించింది. ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు గురువారం ప్రకటించారు. ఈ ప్రకారం ఓటర్ల జాబితా ముద్రణ నవంబరు 20, ముసాయిదా ఓటర్లజాబితా ప్రకటన 23, అభ్యంతరాల స్వీకరణ 23 నుంచి డిసెంబరు 9, ఓటర్ల తుది జాబితాను 30న ప్రకటించనున్నారు.

విపత్తును ప్రకృతి వైపరీత్యంగా ప్రకటిస్తున్నాం

- కలెక్టర్ జె.వెంకటమురళి



బ్యాంకర్లతో సమావేశమైన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 12 : కృష్ణానది వరద విపత్తును ప్రకృతి వైపరీత్యంగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వరద విపత్తు జిల్లాను తీవ్ర నష్టానికి గురి చేసిందన్నారు. ముఖ్యంగా జిల్లాలోని రైతులకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యం అవుతున్న బ్యాంకర్లు విపత్తు సమయంలోను తమవంతు సహాయం అందించాలన్నారు. రైతులను ఆదుకోవటానికి రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం పనిచేయాలన్నారు. జిల్లాలో 1.81 లక్షల ఎకరాలు సాగు అవుతుండగా 86 వేల ఎకరాలలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రైతులకు అపార నష్టం వాటిల్లిందన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని లంకగ్రామాలకు చెందిన రైతులు భారీగా నష్టపోయారన్నారు. మానవతా దృక్పథంతో రైతులపై బ్యాంకర్లు కనికరం చూపాలన్నారు. విపత్తునకు గురైన ప్రాంతాలలో బ్యాంకర్లు అవగాహన సదస్సులు నిర్వహించి రుణసదుపాయానికి కృషి చేయాలన్నారు. రుణాల రీషెడ్యూల్‌పై బ్యాంకర్లు దృష్టిపెట్టాలని కలెక్టర్ చెప్పారు. రికవరీపై ఒత్తిడి చేయరాదన్నారు. లంకగ్రామాలలో గోకులాలు తక్షణమే మంజూరు చేయాలన్నారు.

బ్యాంకర్లంతా ఒకరోజు వేతనం విరాళం : ఎల్‌డీఎం

వరదబాధితులను ఆదుకోవటానికి బ్యాంకర్లు అంతా ఒక రోజు వేతనం ఇవ్వనున్నట్లు ఎల్‌డీఎం శివకృష్ణ తెలిపారు. విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, రీజనల్ మేనేజర్ మాధురి, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.1.5 కోట్ల విరాళం



సీఎంకు చెక్కును అందజేస్తున్న విక్రం నారాయణరావు

చినగంజాం, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులకు అండగా ఉండేందుకు మండలంలోని గొనసపూడి గ్రామానికి చెందిన యువ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు విక్రం నారాయణరావు ముందుకు వచ్చారు. వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి నారాయణరావు కుటుంబ సభ్యులు రూ.1,55,55,555 అందజేశారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబును విక్రం నారాయణరావు తండ్రి వెంకటరావుతో కలిసి విరాళం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు కొండ్రగుంట శ్రీహరిబాబు, బత్తుల శ్రీనివాసరావు, దివ్వకోలు రాము, కందిమళ్ల పూర్ణచంద్రరావు ఉన్నారు.

మెరుగైన

సేవలందించడమే లక్ష్యం

- ఆర్టీసీ సంస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి
- హైదరాబాద్‌కు ఏసీ బస్సు ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

అద్దంకి, సెప్టెంబరు 12: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి డిపో నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సును గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. సంస్థ బలోపేతంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. 13 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం వచ్చాక 1500 బస్సులను ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థకు చేయూత ఇవ్వాలని మంత్రి కోరారు.



హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



పంట నష్టాన్ని సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

- ప్రహసనంగా పంట నష్టం నమోదు
- వారం నుంచి క్షేత్రస్థాయిలో సిబ్బంది వివరాలు నమోదు
- ఈ-క్రాప్ యాప్‌లో నమోదుపై తాజా ఆదేశాలతో మళ్లీ మొదటికి
- ప్రాథమిక అంచనాలతో పోలిస్తే తుది లెక్కల్లో భారీగా తగ్గిన నష్టం

గణన.. గగనం

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరద.. వానలు తగ్గుముఖం పట్టి నాలుగు రోజులైనా ఇంకా వేల ఎకరాల్లో పైరు ముంపులోనే ఉంది. పెట్టుబడిలో ఒక్క రూపాయి వచ్చే పరిస్థితి లేదు. దీంతో ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీపైనే బాధిత రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో జరుగుతున్న పంట నష్టం గణన ప్రహసనాన్ని తలపిస్తోంది. వారం క్రితం నుంచి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట నష్టం వివరాలను సర్వే నెంబర్ల ఆధారంగా నమోదు చేస్తున్నారు. దాదాపు 50 శాతం పూర్తి చేశారు. అయితే ఆ వివరాలను ఈ క్రాప్ యాప్‌లో లాగిన్ అయి నమోదు చేయాలని తాజాగా వ్యవసాయ శాఖ తెలిపింది. దీంతో నష్టం గణన మళ్లీ మొదటికొచ్చినట్లయింది. పైగా ఈక్రాప్ ప్రక్రియ జరుగుతుండగానే వరదలు ముంచెత్తాయి. చాలా మంది రైతులు ఇంకా ఈ క్రాప్‌లో పంటలను నమోదే చేయించలేదు. వీరి విషయంలో కూడా యాప్‌లో ప్రత్యేక ఆప్షన్ ద్వారా నష్టం నమోదు చేస్తామని యంత్రాంగం చెబుతున్నా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వానలు తగ్గుముఖం పట్టగానే క్షేత్రస్థాయిలో పంటనష్టం గణనను జిల్లా వ్యాప్తంగా 151 బృందాలతో మాన్యువల్‌గా చేపట్టింది. ఉద్యాన పంటల విభాగం కూడా పొరుగు మండలాల నుంచి అదనపు సిబ్బందిని తెప్పించుకుని మరీ గణనను చేపడుతుంది. ఇంకా పంట నష్టం లెక్కలు ఓ కొలిక్కి రాకముందే వివరాలను మాన్యువల్‌గా కాకుండా ఈ పంట యాప్‌లో నమోదు చేయాలనే ఆదేశాలతో ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. పైగా సిబ్బందిపై అదనపు భారం పడుతుండడంతో ఇదంతా పూర్తయ్యేసరికి మరో పదిరోజులు సమయం పడుతుందన్న అభిప్రాయాన్ని యంత్రాంగం వెలిబుచ్చుతోంది. వరదల ధాటికి దెబ్బతిన్న పంటల్లో 30 శాతం వరకు ఈ-యాప్‌లో నమోదుకు దూరంగానే ఉన్నాయి. మాన్యువల్ విధానాన్ని పక్కనబెట్టి పంట నష్టం వివరాలకు ఈ పంట యాప్‌ను ప్రామాణికంగా తీసుకోవడంతో దానిలో వివరాలు పొందుపరచని రైతుల్లో నష్టంపై ఆందోళన మొదలైంది. రోజుల తరబడి తమ పంటలు నీళ్లల్లో ఉన్నప్పుడు గణన చేయకుండా ఇప్పుడు వచ్చి ఎలాంటి డ్యామేజీ జరగలేదని వివరాలు రాసుకోవడంపై అన్నదాతలు మండిపడుతున్నారు

పొంతన లేని లెక్కలు..

వరదల వల్ల వ్యవసాయ పంటలకు జరిగిన నష్టం ప్రాథమిక అంచనాల ప్రకారం 86,650 ఎకరాలుగా వ్యవసాయ శాఖ లెక్కకట్టింది. కానీ తుది లెక్కలకు వచ్చేసరికి ఆ సంఖ్య 54,000 ఎకరాలకు తెగ్గోసుకుపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ప్రాథమిక అంచనాల కన్నా వాస్తవిక నష్టం లెక్కలు విపత్తుల సమయంలో పెరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఒక వేళ తగ్గితే పది లేదా ఇరవై శాతం తగ్గుదలతో తుది లెక్కలు ఉంటాయి. కానీ ఊహించని విధంగా ప్రాథమిక అంచనాలతో పోలిస్తే 30 శాతం తగ్గుదల నమోదు కావడంపై అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదు....

వరదల వల్ల నష్టపోయిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఇదే అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. కానీ నమోదు విధానంలో నిలకడలేని నిర్ణయాలకు తోడు పంట నష్టం గణనలో జరుగుతున్న జాప్యం కూడా అన్నదాతలకు శాపంగా మారుతోందని తెలుస్తోంది. నిబంధనల ప్రకారం పంటలకు జరిగిన నష్టం 33 శాతానికి మించితేనే ఇన్‌పుట్ సబ్సిడీ పొందడానికి అర్హులని చెబుతున్నాయి. కానీ రోజుల తరబడి ముంపులోనే ఉన్నప్పుడు కానరాని యంత్రాంగం తీవ్రత తగ్గాక ఫీల్డ్ విజిట్‌కు వెళ్లి యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసి వివరాలు నమోదు చేస్తుండడం కూడా రైతులకు ప్రతికూలంగా మారింది. వాస్తవానికి ఈ నెల 10కే పంట నష్టం గణన పూర్తి చేసి, 11 నుంచి 16 వరకు సోషల్ ఆడిట్ పూర్తి చేసి 18కి తుది జాబితాను ప్రభుత్వానికి అందించాలని తొలుత వ్యవసాయ శాఖ నిర్దేశించింది. కానీ మధ్యలో వర్షాలు పలకరించడం దానికి సిబ్బంది నిర్లక్ష్యం కూడా తోడవడంతో గణన ఆశించిన స్థాయిలో ముందుకు కదల్లేదు. ఈ లోగానే నమోదు విషయంలో ఈ యాప్‌ను తెరపైకి తేవడంతో మరింత జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ఇంకా ముంపులోనే కనగాల పరిధిలోని వరి పైరు

ఉద్యోగుల బదిలీల గడువు మళ్లీ పొడిగింపు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 12 : రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీల గడువును ప్రభుత్వం మళ్లీ పొడిగించింది. దీంతో మొదట ప్రకటించిన తేదీ నుంచి గడువును రెండుసార్లు పొడిగించినట్లు అయింది. ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆగస్టు 31లోపు ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే 31 నాటికి భారీ వర్షాలు, విజయవాడ వరదల నేపథ్యంలో గడువును ప్రభుత్వం సెప్టెంబరు 15వ తేదీ వరకు పొడిగించింది. అయితే వరద పరిస్థితులు ఇంకా కుదుటపడకపోవడంతో బదిలీల గడువును ఈనెల 22 వరకు పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రక్రియను ఈనెల 22లోపు పూర్తిచేయాలని, 23 నుంచి ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగుల బదిలీల గడువును ఈనెల 30 వరకు పొడిగించారు. ఈ శాఖలో అక్టోబరు 1 నుంచి బదిలీల నిషేధం అమలులోకి వస్తుంది.

నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

చినగంజాం, సెప్టెంబరు 12 : భావనారాయణస్వామి దేవస్థానంలో చినగంజాం గ్రామ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొండపాటూరు వెంకటేష్ అధ్యక్షతన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో అక్టోబరు 6వ తేదీన ఒంగోలు కాపు కల్యాణ మండపంలో జరిగే ప్రతిభ పురస్కారాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం నాయకులు ఆవిష్కరించారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బి.ఫార్మసీ, మెడిసిన్ తదితర పరీక్షలలో ఉత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు, దివ్యాంగులకు, క్రీడాకారులకు ప్రోత్సాహక, ఉపకార వేతనాలు, ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ప్రకాశం జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పథకమూరి మధుబాబు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు మార్కాపురం వెంకటరామరావు, సంయుక్త కార్యదర్శి నాదెండ్ల రాఘవ, ఆంధ్రప్రదేశ్ వాయిద్య కళాకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు రామాంజనేయులు, పర్చూరు నియోజకవర్గ సంఘ కన్వీనర్ మాచవరపు నటరాజ్, గ్రామ ప్రధాన కార్యదర్శి మాచవరపు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు మాచవరపు సాంబశివరావు, రాకేష్ పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను వినియోగించుకోవాలి

బల్లికురవ, సెప్టెంబరు 12 : భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వరం అని ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకోవాలని జిల్లా ఐఈఆర్‌టీ కోఆర్డినేటర్ ఎం.జ్యోత్స్న పేర్కొన్నారు. గురువారం బల్లికురవ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని కోఆర్డినేటర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో ఆమె మాట్లాడారు. భవిత కేంద్రం ద్వారా అందుతున్న వసతుల గురించి తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను రోజూ భవిత కేంద్రానికి పంపిస్తే వారు కూడా అందరి వలే చదువులో ముందుకు వెళ్లడంతో పాటు తెలివితేటలు కూడా మెరుగు పడతాయన్నారు. ఇక్కడకు వచ్చే పిల్లలు, తల్లులకు బస్సు చార్జీలను ఇస్తారని తెలిపారు. టెన్త్ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ట్యాబ్‌ను అందజేశారు. వారంలో ఒక రోజు ఫిజియోథెరపి చేస్తారని తెలిపారు. ఈ తనిఖీలో ఐఈఆర్‌టీలు నాగబాబు, నాజీలీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అంకమ్మరావు ఉన్నారు.

డ్రోన్‌తో పిచికారీ ఉపయోగం

ఇంకొల్లు, సెప్టెంబరు 12 : పంటలపై డ్రోన్‌తో పురుగు మందు పిచికారీతో రైతులకు ఉపయోగకరమని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు. ఇంకొల్లులో గురువారం మొక్కజొన్నపై డ్రోన్‌తో పిచికారీ చేయడంవల్ల కలిగే ఉపయోగాలను తెలిపారు. తక్కువ కూలీలతో ఎక్కువ విస్తీర్ణంకు పిచికారి చేయడంతో పాటు ఎత్తైన పంటకు కూడా సులువుగా మందు వేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల వ్యవసాయాధికారి వేణుబాబు,సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

కామన్‌వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించిన సెయింట్ ఆన్స్ విద్యార్థి



సయ్యద్ ఖాజావలికి చెక్‌ను అందజేస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 12 : సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థి సయ్యద్ ఖాజావలి 2026లో జరగబోయే కామన్ వెల్త్ గేమ్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ వరల్డ్ క్లాసిక్ అండ్ ఎక్విప్డ్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ మాల్టా-2024 పోటీలలో ఖాజావలి బ్రాంజ్ మెడల్‌ను సాధించాడు. ఈ నేపథ్యంలో గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఖాజావలికి రూ.30వేల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు మాట్లాడుతూ ఖాజావలి జేఎన్‌టీయూ (కే) ఫార్మేషన్ డే సందర్భంగా ప్రకటించిన అవార్డులలో కళాశాల ఎంబీఏ విద్యార్థి ఖాజావలి అప్రిసియేషన్ అవార్డు ఫర్ పెర్ఫార్మెన్స్ ఇన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అవార్డును ప్రదానం చేశారన్నారు. ఇటీవల పంజాబ్ రాష్ట్రం పాటియాలలో జరిగిన జాతీయ జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పలు విభాగాలకు సంబంధించి రెండు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలను సాధించాడన్నారు. అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు భారతదేశం తరపున యూరప్‌లో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ వరల్డ్ క్లాసిక్ అండ్ ఎక్విప్డ్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ మాల్టా-2024లో సాధించిన బ్రాంజ్ మెడల్‌తో పాటు 2026 జరగబోయే కామన్‌వెల్త్ గేమ్స్‌లో పాల్గొనేందుకు సాధించిన అర్హతకు సంబంధించిన పూర్వాపరాలను వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు వివరించారు. ఈ క్రమంలో భారీ కేక్ కట్ చేసి కళాశాలలో సంబరాలు నిర్వహించారు. ఖాజావలి తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఆర్. ఇమ్మానియేల్, డాక్టర్ సి. సుబ్బారావు (అక్రిడిటేషన్స్), వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన

ఒంగోలు(కలెక్టరేట్),సెప్టెంబరు 12 :ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. జీవో నెంబరు 85కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా వైద్యులు ఉద్యమబాట పట్టారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు సర్వీసు కోటా కింద పీజీ చదువుకునేందుకు కేటాయించిన 30శాతం కోటాను 15శాతం తగ్గించడంతో వైద్యులు ఈ ఆందోళన చేపట్టారు. జీవో వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులు ఉన్నత విద్యలో సీట్లను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జారీచేసిన జీవోకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఆందోళన కొనసాగింది. శుక్రవారం రాష్ట్ర అసోసియేషన్ సమావేశం జరగనుంది. అందులో ఇప్పటివరకు జరిగిన ఆందోళనపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు పూర్తి స్థాయిలో ఆందోళనలు చేపట్టే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలతోపాటు వైద్యశాఖ ఉన్నతాధికారులను కలిసి ఈ సమస్యను వివరించనున్నట్లు తెలిసింది. అప్పటికి కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రణాళిక ప్రకటించి తదనుగుణంగా ముందుకుపోనున్నారు. కాగా గురువారం రాత్రి పీహెచ్‌సీ వైద్యులు కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్ కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

టీడీపీలో చేరిన మరో వైసీపీ కార్పొరేటర్

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 12: వైసీపీ నుంచి మరో కార్పొరేటర్ తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక 49వ డివిజన్‌కు చెందిన అంగిరేకుల గురవయ్య గురువారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇప్పటికే వైసీపీ నుంచి 19మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరగా, తాజాగా మరొకరు చేరడంతో ఆ సంఖ్య 20కి చేరింది. ఇదిలా ఉండగా, గతంలో టీడీపీ కార్పొరేటర్లు ఆరుగురు, జనసేన కార్పొరేటర్ ఒకరు ఉన్నారు. మొత్తం టీడీపీ బలం 27కు పెరిగింది. అంతేకాకుండా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్‌విజయ్‌కుమార్ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉండటంతో టీడీపీ బలం 30కి చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్నివేళలా అండగా ఉంటానని తెలిపారు.

పనులు పంచుకుతిన్నారు

ఒంగోలు కార్పొరేషన్‌లో వెలుగుచూసిన వైసీపీ అవినీతి దందా



ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం

- జగన్ సభకు నీళ్ల ఖర్చు రూ.10 లక్షలు
- కార్పొరేషన్ పెద్దలు, అధికారుల కుమ్మక్కుతో పనులు పక్కదారి
- పుష్‌కార్టుల మరమ్మతులు, పరికరాల కొనుగోలు పేరుతో దోపిడీ

ఒంగోలు నగరపాలక సంస్థలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నడిచిన నిధుల దోపిడీ వ్యవహారం తాజాగా వెలుగుచూసింది. టెండర్ పద్ధతిన పనులు చేపడితే పైసలు మిగిలేది తక్కువే అని భావించిన కొందరు నాటి వైసీపీ పెద్దలు, అధికారులతో కలిసి చక్రం తిప్పారు. నామినేషన్ పద్ధతిన పనులు విభజించి, భారీగా దోచుకునేందుకు పావులు కదిపారు. నిబంధనలకు విరుద్ధంగా అత్యవసరం పేరుతో అందరూ పంచుకుని పనులు చేపట్టారు. దీంతో కార్పొరేషన్ ఖజానాకు భారీగా గండిపడింది. అటు కార్పొరేటర్ల పెద్ద, ఇంజనీర్లు, కమిషనర్ అందరూ ఒక్కటై వ్యవహారం నడిపినట్లు తెలుస్తోంది. ముందుగానే పర్సంటేజీలు నడవగా దీనికి సంబంధించి బిల్లులు ప్రస్తుతం ఆన్‌లైన్ చేయడం గమనార్హం.

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 12: ఒంగోలు నగర కార్పొరేషన్‌లో నామినేషన్ పనుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పందొమ్మిది పనులకు రూ.95లక్షల ఖర్చుచేసినట్లు బిల్లులు పెట్టారు. అయితే నిన్నమొన్నటివరకు వైసీపీలో కీలకంగా వ్యవహరించిన ఆ పార్టీ కార్పొరేటర్ పెద్ద నేడు టీడీపీలో ఉండగా, ఎన్నికల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా సాధారణ సర్వసభ్య సమావేశానికి ఈ వ్యవహారం రాకుండా స్టాండింగ్ కౌన్సిల్‌తో ఆమోదింపజేశారు. ఇదంతా ఇలా ఉంచితే ఈ పనులన్నీ తెనాలికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు మాత్రమే కేటాయించడం అనుమానాలకు తావిస్తోంది. అయితే ప్రస్తుతం ఇందుకు సంబంధించిన బిల్లులన్నింటినీ ఆన్‌లైన్ చేయగా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ముందుగా పర్సంటేజీలు ముట్టచెప్పినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ పనుల ద్వారా కార్పొరేషన్ ఖజానాకు లక్షల్లో నష్టం వాటిల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేస్థాయిలో పనుల ఆమోదానికి అంగీకారం తెలిపిన నాటి వైసీపీ పెద్దలు, ఇంజనీర్లు, ఇటీవల బదిలీపై వెళ్లిన కమిషనర్‌కు భారీగానే ముట్టినట్లు సమాచారం.

రూ.95లక్షలకు టెండర్ కాదని నామినేషన్

ఒంగోలులో పారిశుధ్యం పనుల్లో ఉపయోగించే చెత్త సేకరణ వాహనాలు (పుష్‌కార్టులు) రిపేరుకు అక్షరాల రూ.30లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు. 2015లో నగరంలో పారిశుధ్యం మెరుగునకు సుమారు 450 పుష్‌కార్టులు కొనుగోలు చేశారు. కాగా వాటిలో ప్రస్తుతం 250 బండ్లు వరకు రిపేరుకు రాగా, మరో వంద బండ్లు పూర్తిగా తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. ఇదిలా ఉంచితే మరి కొన్ని ఇంకా బాగు చేయాల్సి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నేతల కన్ను పుష్‌కార్టులపై పడటంతో పారిశుధ్య విభాగంలో అవినీతికి తెరలేచింది. పుష్‌కార్టుల రిపేరుకు రూ.25లక్షలు ఖర్చు అయినట్లు చూపుతుండగా, వాటికి పెయింటింగ్‌ల కోసం అదనంగా మరో రూ.5లక్షలు ఖర్చుచేసినట్లు లెక్కలు తేల్చారు. ఇదిలా ఉంచితే పారిశుధ్య కార్మికులకు గ్లౌజ్‌లు, కొబ్బరి నూనెలు, యాప్రాన్‌లు, పారిశుధ్య పరికరాలు కొనుగోలుకు మరో రూ.20 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు చూపారు. అయితే అందులో ఇంతవరకు కొబ్బరి నూనె ఇవ్వకపోగా, కనీసం పరికరాలు కూడా కొనుగోలు చేయలేదని సమాచారం. మరోవైపు కాలువల్లో పూడికతీత పనులకు ఏటా రూ.40 లక్షల నుంచి రూ. 50లక్షలు కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి ఖర్చుచేస్తుండగా, అవికాకుండా పనులు చేపట్టినందుకు ఎక్స్‌కవేటర్‌లు ఏర్పాటు చేసినట్లుగా చూపారు. ఎక్స్‌కవేటర్ బిల్లులే రూ.10లక్షలు ఖర్చు అయినట్లు లెక్కలు కట్టారు.

జగన్ సభకు నీళ్ల ఖర్చు రూ.10 లక్షలు

వడ్డించే వాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చున్నా ఇబ్బంది లేదన్నట్లు ఉంది కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు వ్యవహారం. తుఫాన్‌విపత్తులు, విషజ్వరాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే చేపట్టే అత్యవసర పనులను ఏడు నెలల క్రితం అప్పటి సీఎం జగన్ సభకు ముడిపెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ఒంగోలు పరిధిలోని నరసాపురం అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన జగన్ సభకు కార్పొరేషన్ నిధులు భారీగా ఖర్చయినట్లు పాలవర్గ పెద్దలు తేల్చారు. ప్రజలు, లబ్ధిదారులను తరలించేందుకు ఏర్పాటు చేసిన బస్సుల కోసం, అలాగే వేదికపై పెద్దల దాహం తీర్చడం కోసం అక్షరాల రూ.10 లక్షలు ఖర్చు అయినట్లు లెక్కలు తేల్చారు. వాస్తవానికి రూ.5లక్షలు దాటితే ఆ పనులకు టెండర్లు పిలవాలి. కానీ ఇక్కడ నిబంధనలకు అధికారులు, పాలవర్గ పెద్దలు తూట్లు పొడిచారు. విభజన పేరుతో రూ.5లక్షల చొప్పున వేర్వేరుగా పనులు చేపట్టారు. ఈ పనులన్నీ టెండర్ పద్ధతిన పిలిస్తే పర్సంటేజీలు అందరికీ ఇవ్వాల్సి వస్తుందని భావించిన సదరు పాలక పెద్దలు, ఇంజనీర్లు, పూర్వపు కమిషనర్ కుమ్మక్కయి పనులు విభజించారు. నామినేషన్ పద్ధతిన భారీగా దోపిడీకి తెరదీయడంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగానే గండిపడింది. పనిలో పనిగా వారి సొంత ఖజానాకు భారీగానే లాభం చేకూరింది.

ఒకే వ్యక్తికి అన్నీ పనుల కేటాయింపు

వాస్తవానికి కార్పొరేషన్ ద్వారా ఖర్చుచేసే నిధులు, చేపట్టే పనులకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రొక్యూర్‌మెంట్‌తో టెండర్లు పిలవాలి. అందులో పాల్గొనే కాంట్రాక్టర్ పనులు దక్కించుకునేందుకు లెస్ టెండర్ వేసి, నిర్ణీత కాలంలో పనులు పూర్తిచేయాలి, అయితే ఇక్కడ పూర్తి మొత్తం రూ.95 లక్షలకు పనులు చేపట్టాలంటే టెండర్‌లు పిలవాల్సి రావడంతో అడ్డదారులు వెతికారు. రూ.5లక్షలలోపు పనులకు నామినేషన్ పద్ధతిన ఇచ్చేందుకు కమిషనర్‌కు అధికారం ఉంటుంది. రూ.10 లక్షలు దాటితే ఖచ్చితంగా టెండర్లు పిలవాలి. కానీ ఇక్కడ పనులు పక్కదారి పట్టించేందుకు అందరూ కుమ్మక్కయ్యారు. అందుకు ఇంజనీర్లు వంత పాడారు. దీంతో రూ.5లక్షల చొప్పున పనులు విభజించి ఏకంగా పందొమ్మిది పనులు పిలిచి, వేర్వేరుగా ఇచ్చేశారు. ఇదిలా ఉంచితే ఈ పనులన్నీ ఒకే వ్యక్తికి కాంట్రాక్ట్ ఇవ్వడం గమనార్హం. గతంలో తెనాలిలో కమిషనర్‌గా పనిచేసి, ఎన్నికలకు ముందు ఒంగోలుకు బదిలీపై వచ్చి, గత నెలలో బదిలీ అయిన అధికారికి అత్యంత సన్నిహితుడుగా ఉండే వీరశేఖరరావుకు కేటాయించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై కొందరు కాంట్రాక్టర్లు, కార్పొరేటర్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

సర్కార్ మద్యం దుకాణాలు రద్దు



- పాత స్వరూపంలోకి ఎక్సైజ్ శాఖ
- వచ్చేనెల ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 12: సర్కార్ మద్యం దుకాణాలను రద్దుచేసి గతంలో మాదిరిగా ప్రైవేటు మద్యం దుకాణాలను ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు వచ్చే నెల 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి రానుంది. ఆదేక్రమంలో గత ప్రభుత్వంలో జీవో నంబరు 12 ప్రకారం ఎక్సైజ్ శాఖలో ఉన్న 70శాతం ఉద్యోగులను విడగొట్టి ఎస్ఈబీకి కేటాయించారు. కాగా ఈనెల 11న సాధారణ పరిపాలన శాఖ జీవో నంబరు 12ను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఎస్ఈబీలో ఉన్న ఉద్యోగులు అందరూ తిరిగి ఎక్సైజ్ శాఖలోకి విలీనమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు మద్యం పాలసీ మీద అనేక రాష్ట్రాలలో ఉన్న సిస్టంను అధ్యయనం చేసి బుధవారం మొదటిసారిగా భేటీ అయ్యారు. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఏదిఏమైనా సర్కార్ మద్యం దుకాణాలు రద్దు వైపే మొగ్గుచూపే అవకాశం ఉంది. వచ్చేనెల నుంచి నూతన పాలసీ అమలులోకి తెచ్చేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు.

ఎస్ఈబీ పూర్తిగా రద్దు

ఎక్సైజ్ శాఖలో ఉన్న 70శాతం ఉద్యోగులను విభజించి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాస్తవంలోకి వెళితే ఎస్ఈబీ వచ్చిన తరవాత గంజాయి, ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ రవాణా, ఇసుక రవాణా అధికమయ్యాయి. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, గంజాయిలను అరికట్టడంలో ఆ శాఖ వైఫల్యం చెందింది. కాగా జిల్లాలో ఉన్న 175 మంది ఎస్ఈబీ ఉద్యోగులు 12జీవో రద్దుతో తిరిగి మాతృశాఖకు వచ్చారు. వీరిలో ఇరువురు ఈఎస్‌లు, ఏఈఎస్‌లు ఇద్దరు, సీఐలు 10మంది, 15మంది ఎస్సైలు, 28మంది హెడ్ కానిస్టేబుళ్లు, 98 మంది కానిస్టేబుళ్లు, 10మంది మినిస్టీరియల్ సిబ్బంది ఎక్సైజ్ శాఖకు బదిలీ అయ్యారు. ఒంగోలు, మార్కాపురంలో ఉన్న ఎస్ఈబీ ఈఎస్ కార్యాలయాల్లో ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్లు ఎక్సైజ్ శాఖకు బదలాయించారు.

1 నుంచి నూతన మద్యం పాలసీ

వచ్చేనెల 1 నుంచి నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు మద్యం దుకాణాలకు టెండర్ విధానం అమలులోకి తెచ్చే ఆలోచనలో ఉంది. దీంతో సర్కార్ మద్యం దుకాణాలు రద్దయి ప్రైవేటు దుకాణాలు రానున్నాయి. అందుకోసం ఈనెల 15 నుంచి ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 2019లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 331 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రైవేటు దుకాణాలను రద్దు చేసి ప్రభుత్వ దుకాణాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో 20శాతం దుకాణాలను తగ్గించి 2019-20లో 265కి ప్రభుత్వ దుకాణాలకు అనుమతి ఇచ్చారు. 2020-21 లో మరలా 13శాతం తగ్గించారు. దీంతో 222 దుకాణాలు మాత్రమే నడిచాయి. కొద్దిరోజులు తర్వాత ఎలైట్ మాల్స్ టూరిజం ప్రాంతాలలో అనుమతి పేరుతో జిల్లాలో మరో 36 దుకాణాలను ఇచ్చారు. ప్రస్తుతం ఇప్పుడు 258 మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రైవేటు దుకాణాలకు ఈవేలం విధానం అమలుపరిచే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేయాలనే విషయమై కసరత్తు ఇప్పటికే ప్రారంభమైంది.

15న ఖోఖో నేషనల్ సెలక్షన్ ట్రయల్స్

పంగులూరు, సెప్టెంబరు 12 : అండర్ 14 జాతీయ స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్ల ఎంపికకు ఈ నెల 15వ తేదీన పంగులూరులో ఖోఖో నేషనల్ సెలక్షన్ ట్రైల్స్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోషియేషన్ చైర్మన్ డాక్టర్ బాచిన గరటయ్య, కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 20 నుంచి 22 వరకు పంగులూరులో జరగాల్సిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రకృతి విపత్తు వలన నిలిచిపోయినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల సంఘ కార్యదర్శుల సలహాలు, సూచనల మేరకు డైరెక్ట్ నేషనల్ సెలక్షన్ ట్రైల్స్ ఈ నెల 15న పంగులూరు ఎంఎస్.ఆర్ అండ్ బీఎన్ఎం కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లా నుంచి 5గురు బాలురు, 5 మంది బాలికలు ఈ సెలక్షన్‌కు హాజరవుతున్నారని తెలిపారు. వీరిలో జాతీయ జట్లకు ఎంపికయ్యే వారికి పంగులూరులో శిక్షణ ఇస్తారని వారు తెలిపారు.

28 నుంచి జార్ఖండ్‌లో జాతీయ స్థాయి పోటీలు

ఈ నెల 15వ తేదీన ఎంపికయ్యే రాష్ట్ర బాల బాలికల జట్లకు పంగులూరులో శిక్షణ పొందుతారని తెలిపారు. అనంతరం ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని అసోషియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య, కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు.

ఈనాం భూముల సర్వే ప్రారంభం

- 15రోజుల పాటు కొనసాగనున్న పనులు
- 800 సర్వే నెంబర్లు, 4500 ఎకరాల భూములకు సంబంధించి వివరాలు సేకరించనున్న అధికారులు



చెన్నుపల్లిలో ఈనాం భూముల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, మండల సర్వేయర్

బల్లికురవ, సెప్టెంబరు 12 : ఎన్నో దశాబ్దాల నుంచి భూములు సాగు చేసుకుంటున్న తమకు హక్కులు లేవని రైతులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. గురువారం నుంచి చెన్నుపల్లి ఈనాం భూముల ఎంజైమెంట్ సర్వే మెదలైంది. బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామంలో మెత్తం 800 సర్వే నెంబర్లలో సుమారుగా 4500 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని రైతులు ఎన్నో దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్నారు. ఈ భూమిలో తమకు హక్కు ఉందని ఈనాం దారులు అంటున్నారు. దీంతో రైతుల సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు కూడా అందించలేదు. భూములు సాగు చేసుకుంటున్న హక్కులు మాత్రం సక్రమంగా అబించడం లేదని రైతులు తమ బాధను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు రాగా అయన ప్రభుత్వం ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు చెన్నుపల్లి, రెవెన్యూ పరిధిలో ఉన్న ఈనాం భూముల సర్వే చేస్తున్నారు. మండలంలోని అన్ని సచివాలయాల సర్వేయర్లను, గ్రామ రెవెన్యూ అధికారులను, ఎనిమిది టీంలుగా ఏర్పాటు చేసి భూములపై ఎవరు ఉన్నారు. రైతులకు ఎంత భూమి ఉంది. ఖాళీగా భూములు ఎన్ని ఉన్నాయి అన్న వివరాలను పూర్తిగా సేకరిస్తున్నారు. తదుపరి సర్వే వివరాలను 15 రోజుల్లో పూర్తి చేసి జాయింట్ కలెక్టర్‌కు పంపిస్తామని సర్వే బృందాలు ఈ సందర్భంగా తెలిపారు. చెన్నుపల్లి ఈనాం భూముల సర్వేను ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, మండల సర్వేయర్ కిషోర్ దగ్గర ఉండి పరిశీలిస్తున్నారు. సర్వే టీంలతో, రైతులతో వారు మాట్లాడుతూ దగ్గర ఉండి రైతులు సర్వే చేయించుకోవాలని ఏవైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకు రావాలని అన్ని సర్వే నెంబర్లను పూర్తి స్థాయిలో కొలతలు వేసి రైతుల వివరాలను సేకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

విధి ఆడిన వింతనాటకం

- రెండు రోజుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు
- శోకసంద్రంలో బంధువులు



తల్లిదండ్రులతో చిన్నారులు (ఫైల్)

చీరాలటౌన్, సెప్టెంబరు 12 : చిన్నారుల జీవితాల్లో విధి వింత నాటకం ఆడింది. కాలికి మట్టి అంటకుండా చూసే తండ్రి, పన్నెత్తి మాటైనా ఆడని తల్లి. ఆనందమయంగా సాగే వారి జీవితంలో పెను విషాదం నిండింది. రెండు రోజుల వ్యవధిలోనే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు దిక్కుతోచని వారిగా మిగిలారు. ఈ దారుణ ఘటన చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ ఆంధ్రకేసరిగనర్ గ్రామంలో చోటుచేసుకుంది.

గ్రామానికి చెందిన దుడ్డు సతీష్‌కుమార్(41), కుమారి(35) దంపతులు. వీరికి 12, 10 సంవత్సరాల వయస్సు ఉన్న ఇద్దరు బాలికలు ఉన్నారు. సతీష్ ఎంటెక్ పీహెచ్‌డీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. భార్య బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోనే ప్రభుత్వ కళాశాలలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మరో నెలలో ఆమె ఉద్యోగం రెగ్యులర్ అవుతుందన్న ఆనందంలో ఉండగా అకస్మాత్తుగా బ్రెయిన్ కేన్సర్ రూపంలో కుమారి మంచం పట్టింది. దీంతో ఆమెకు అనేక చోట్ల వైద్యం అందించిన సతీష్ సొంతూరు ఆంధ్రకేసరి నగర్‌లో ఉంచి మందులు వాడుతున్నారు. ఎప్పటిలాగే విధులు ముగించుకుని ఇంటికి చేరిన సతీష్ వారం కిందట గుండెపోటుతో అవస్థలు పడ్డాడు. ఈసమయంలో సమాచారం అందుకున్న బంధువులు హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలించి రెండు రోజులపాటు చికిత్స అందించారు. ఈ క్రమంలో గత సోమవారం తెల్లవారుజామున హాస్పిటల్లోనే మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన మరువక ముందే మంచంపై ఉన్న కుమారి గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. పిల్లలు ఆక్రందనలు ఆకాశాన్నంటాయి. చూస్తున్న బంధువులు, చూపరులు దేవుడా చిన్నారులకు ఏమిటి ఈ శోకమంటూ కన్నీటి పర్యంతమయ్యారు.


నగదును అందజేస్తున్న దాతలు

గోకులానికి విరాళాలు

అద్దంకి, సెప్టెంబరు 12 : అద్దంకి పట్టణంలోని విశ్వభారతి కళాశాల సమీపంలో మిల్‌లో నిర్వహిస్తున్న హరిహర గోకులంలో ఆవుల పెంపకానికి పలువురు దాతలు గురువారం విరాళాలు అందజేశారు. అద్దంకి పట్టణానికి చెందిన పసుమర్తి రామారావు, రత్నకుమారి కుమార్తె వెంకటనాగ లక్ష్మి, సుధీర్ వివాహం ఇటీవల జరగగా నూతన వధూవరులు గురువారం రూ.15వేలను అందజేశారు. గుంటూరుకు చెందిన తల్లీ కుమారుడు జయశ్రీ, కృష్ణసాయి రూ.10వేల రూపాయలను గోశాల నిర్వాహకుడు సుబ్బారావుకు అందజేశారు.

ఐటీడీపీ కృషి భేష్


ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న మంత్రి

అద్దంకి, సెప్టెంబరు 12 : వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలలోకి తీసుకువెళ్లడంలో ఐటీడీపీ కృషి అభినందనీయమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా కూటమి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించడంలో ప్రథమ స్థానంలో నిలిచిన అద్దంకి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా కు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పంపిన ప్రశంసాపత్రాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం అందజేశారు. వైసీపీ చేసే అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని మంత్రి రవికుమార్ అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లు వినియోగించుకోవాలి

మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల, సెప్టెంబరు 12 : వ్యవసాయ కనెక్షన్‌ల కోసం ఇస్తున్న ట్రాన్స్ ఫార్మర్‌లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. గురువారం మండలంలోని రావినూతలలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు, నూతన వ్యవసాయ కనెక్షన్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.1.82కోట్లతో కురవానివానిపాలెం గ్రామానికి నూతన విద్యుత్ లైను, సబ్ స్టేషన్ ఆవరణలో నూతన బ్రేకర్ ఏర్పాటు పనులను మంత్రి ప్రారంభించారు. ఈ నూతన లైను ఏర్పాటుతో 24 గంటల విద్యుత్ సౌకర్యం లభిస్తుందన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు ఇచ్చే లైన్లు, గృహ అవసరాలకు ఇచ్చే లైన్లు వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఈరెండూ ఒకే లైనులో ఉండడం వలన కొన్ని గ్రామాలకు త్రీ ఫేజ్ విద్యుత్ ఉండేది కాదన్నారు. రాష్ట్రం మొత్తం మీద 40,336 నూతన వ్యవసాయ విద్యుత్ కనెన్షన్‌లను మంజూరు చేసామని, అందులో అద్దంకి నియోజకవర్గానికి అత్యధికంగా 1363 కనెక్షన్ లు మంజూరైనట్లు గొట్టిపాటి తెలిపారు. ఇందుకోసం 21 కోట్ల రూపాయల బడ్జెట్‌ను మంజూరు చేశామన్నారు. మొత్తం కనెక్షన్‌లు ఇవ్వడానికి 355 ట్రాన్స్ ఫార్మర్‌లు అవసరం అన్నారు. ఇప్పటి వరకు 80 ట్రాన్స్ ఫార్మర్‌లు మంజూరయ్యాయన్నారు. హెచ్‌వీడీఎస్ ఫండ్స్ ద్వారా 104 ట్రాన్స్ ఫార్మర్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. కొన్నిచోట్ల ఒకటి, రెండు కనెక్షన్‌లకే ట్రాన్స్ ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నందున ఖర్చు పెరిగి, ట్రాన్స్ ఫార్మర్‌ల సామర్థ్యం మేరకు పనిచేసే అవకాశం ఉండదన్నారు. ఒక్కో ట్రాన్స్ ఫార్మర్ కింద 5 కనెక్షన్ లు ఏర్పాటు చేస్తే ఎక్కువ మందికి వ్యవసాయ విద్యుత్ ఇవ్వడంతో పాటు ఖర్చు, ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యం అన్ని ఉపయోగంలో ఉంటాయన్నారు. లైన్లు మార్పిడి కార్యక్రమం 10 రోజులలో పూర్తవుతుందని అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఈఈ మస్తాన్‌రావు, ఏడీఈ డీ సత్యనారాయణ, మేదరమెట్ల ఏఈ ఎం.శ్రీనివాసరావు, సర్పంచ్ చాట్ల విజయవీణ, తెలుగుదేశం నాయకులు కారుసాల నాగేశ్వరరావు(బాబు), కారుసాల గురుబాబు, మోపర్తి లక్ష్మీనారాయణ, చేబ్రోలు కస్తూరి, రామినేని వెంకటరమణ, చేబ్రోలు నాగేశ్వరరావు, మోపర్తి వెంకట్రావు తదితరులతో పాటు టీడీపీ మండల నాయకులు చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, సింగమనేని వాసు, నాదెండ్ల కోటేశ్వరరావు, మందా నాగేశ్వరరావు, మోరవినేని రాంబాబు, తదితర నాయకులు హాజరయ్యారు.


విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రవికుమార్

అద్దంకి డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

అదనంగా 10 బస్సులు : మంత్రి

అద్దంకి, సెప్టెంబరు 12 : అద్దంకి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అద్దంకి డిపో నుంచి హైదరాబాద్ అదనంగా రెండు సర్వీసులను ఏర్పాటు చేయడంతో పాటు అదనంగా హైదరబాద్, బెంగళూరుకు ఏసీ బస్సులు వేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి నుంచి హైదరాబాద్‌కు సూపర్‌లగ్జరీ బస్సును ప్రారంభించిన ఆయన మాట్లాడారు. అద్దంకి డిపోకు 10 బస్సులు అదనంగా మంజూరు చేసినట్లు రవికుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థుల కోసం రద్దు చేసిన బస్ సర్వీసులను పునరుద్ధరిస్తామన్నారు. అద్దంకి డిపోను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. డిపోకు పూర్వ వైభవం తీసుకు రావడంతో పాటు ఆదర్శ డిపో గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అద్దంకి డిపోకు ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తామన్నారు. డిపో ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఈడీ విజయరత్నం, డీపీటీఎం రవికాంత్, డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి, కార్మిక సంఘాల నేతలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రద్దయిన బస్సులను పునరుద్ధరించండి

అద్దంకి డిపో పరిధిలో గతంలో నడిచిన పలు రూట్లలో రద్దయిన బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని, కొత్త సర్వీసులను ఏర్పాటు చేయాలని మంత్రి రవికుమార్‌కు పలు గ్రామాల నేతలు, ప్రజలు వినతి పత్రాలను అందజేశారు. శింగరకొండపాలెం, చినకొత్తపల్లి మీదుగా చిలకలూరిపేట, వైదన, చెన్నుపల్లి మీదుగా చిలకలూరిపేట, మణికేశ్వరం, బూదబాడ తదితర గ్రామాలకు బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలని, పమిడిపాడు నుండి హైదరాబాద్ నడుపుతున్న బస్ ను నూజెళ్లపల్లి వరకు పొడిగించాలని తదితర సమస్యలతో వినతిప త్రాలను అందజేశారు.


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఏచూరి మృతికి సంతాపం

అద్దంకి, సెప్టెంబరు 12 : సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరి సీతారాం అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, అద్దంకి మండల శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, రఘుచంద్, మన్నం త్రిమూర్తులు, పనకా రామాంజనేయులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పర్చూరు : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతి పట్ల కమ్యూనిస్టు నేతలు గురువారం ప్రకటనలో సంతాపం తెలిపారు. ఏచూరి విద్యార్థి దశ నుంచే అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని కమ్యూనిస్టు నేత నరిశెట్టి ఆచార్యులు అన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు జైలు జీవితం గడిపిన వారిలో ఆయనొకరన్నారు. పోరాటాల్లో పేదల పక్షాన నిలిచిన మహోన్నత వ్యక్తిగా ఏచూరి అని కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో జి.ప్రతాప్, బండి శంకరయ్య ప్రభుదాసు, బండారు దాసు, కె.శ్రీనివాసరావు ఉన్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టండి

పంగులూరు, సెప్టెంబరు 12 : మొక్కజొన్న పైరుకు ఆశించిన కత్తెర పురుగు నివారణకు రైతులు తక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని అలవలపాడు గ్రామంలో మొక్కజొన్న పైరును ఏవో సుబ్బారెడ్డి గురువారం పరిశీలించారు. ఆలస్యంగా విత్తడం వలన పంటలో పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. విత్తనం విత్తిన దశ నుంచి పంట కోతదశ వరకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కత్తెర పురుగు తీవ్రత ఉంటే లాంబ్డా సైహలోత్రిన్ 20 శాతం, ఈసీ 200 మి.లీ. మందు 200లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మందు ద్రావణం పిచికారీ చేసేటప్పుడు మొక్కజొన్న మొవ్వు సుడులు బాగా తడిసేలా చూడాలన్నారు. కత్తెర పురుగు ఉధృతిని, పురుగు కలిగించే నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు కత్తెర పురుగు నివారణకు తగు చర్యలు చేపట్టాలని సుబ్బారెడ్డి తెలిపారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

పంగులూరు, సెప్టెంబరు 12 : ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలోని అలవలపాడు, బైటమంజులూరు గ్రామ సచివాలయాల వద్ద రైతు సంఘం ప్రతినిధులు రైతులతో కలసి గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం రూ.20వేల ఆర్థిక సాయం వెంటనే అందించాలని కోరారు. కార్యదర్శులకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రామచంద్రరాజు, సుబ్బరాజు, శంకర్‌బాబు, కృష్ణంరాజు, సాగర్, చెన్నారెడ్డి, నాగేశ్వరరావు, పున్నారావు పాల్గొన్నారు.

పోషక విలువలను తెలుసుకోవాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 12 : పౌష్టిక ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ఇందిరమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని శంఖవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఆకుకూరలు, చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలసంజీవని కిట్స్‌లను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం బాలసంజీవని ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్‌కే మస్తాన్‌బీ, ఎస్.సౌభాగ్యం, బి.రాజ్యం, నాగమ్మ, వరలక్ష్మి, సుభాషిణి పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

చినగంజాం : ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతులుగా ఉంటారని ఇంకొల్లు సెక్టారు సీడీపీవో ఝాన్సీ అన్నారు. మండలంలోని సంతరావూరు 1వ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భవతులు, బాలింతలు, మహిళలకు పోషకాహారం, రక్తహీనతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుధ్యానాలను రోజువారీ ఆహారంలో తీసుకోవడం వలన పోషకాలు అధికంగా లభిస్తాయిని సీడీపీవో తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం ఎలా తయారు చేసుకోవాలి, రక్తహీనతకు సంబంధించి ఎలాంటి వైవిధ్య భరితమైన ఆహారం తీసుకోవాలి, పోషకాహారం, రక్తహీనత లోపం లేకుండా ఎలా ఉంచుకోవాలి తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీలు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో పలు కరాల ఆహార పదార్థాలను తమారుచేసి వాటిని ప్రదర్శనగా ఉంచారు .గర్భవతులకు, బాలింతలకు టీహెచ్‌ఆర్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వదన, హిమబిందు, కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 12 : రక్తహీనతతో బాధపడుతున్న పట్టణంలోని వెంకాయమ్మకు, చాటకొండ మధుసూదనరావుకు అవసరమైన రక్తాన్ని రోటరీ క్లబ్ వారు సమకూర్చారు. రక్తం అవసరం కావడంతో బంధువులు రోటరీ క్లబ్ సభ్యులు చుండూరి మురళీ సుధాకరరావును సంప్రదించారు. వెంటనే పట్టణంకు చెందిన దర్శి గొరంట్ల అచ్చయ్య డ్రై ఫ్రూట్ వ్యాపారి దివ్వెల వీర వెంకట సత్యనారాయణ ద్వారా రక్తదానం చేయించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.


రత్తమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఏలూరి కార్యాలయ సిబ్బంది

టీడీపీ నేత వెంకటస్వామికి మాతృ వియోగం

ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

జాగర్లమూడి (పర్చూరు), సెప్టెంబరు 12 : తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గ సీనియర్ నేత ధూళిపల్లి వెంకటస్వామి తల్లి రత్తమ్మ (95) బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంకటస్వామి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గురువారం పలువురు టీడీపీ నాయకులు పెద్దజాగర్లమూడి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. స్వగ్రామం జాగర్లమూడిలో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో ఏలూరి క్యాంప్ కార్యాలయ సిబ్బంది, మండల నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు. రత్తమ్మ అంతిమ యాత్రకు ఆయా గ్రామాల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

చంద్రమ్మకు మంత్రి గొట్టిపాటి నివాళి

పంగులూరు, సెప్టెంబరు 12 : మండలంలోని చందలూరు గ్రామంలో గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు కుటుంబాలను పరామర్శించారు. గురువారం జరిగిన పెంట్యాల చంద్రమ్మ దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పోలూరి శింగయ్య, అల్లం అంజమ్మ, చిట్టాబత్తిన సుబ్బారావు, పాలెపు హనుమంతరావు ఇళ్లకు వెళ్లి కుటుంబసభ్యులను గొట్టిపాటి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ సుబ్బారావు, పెంట్యాల రాధాకృష్ణ, రామలింగస్వామి, పెంట్యాల వెంకటేశ్వర్లు, కొల్లి సురేంద్ర, కందిమళ్ల రామాంజనేయులు, సుబ్బారావు పాల్గొన్నారు.

కషాయాల ద్వారా పురుగుల నివారణ


కషాయ తయారీని పరిశీలిస్తున్న వాణిశ్రీ

బల్లికురవ, సెప్టెంబరు 12 : గ్రామాలలో అందుబాటులో ఉండే పలు రకాల ఆకుల ద్వారా కషాయాలను తయారు చేసి పంటలకు వాడితే పురుగు మందులు వాడకుండానే వాటిని నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.వాణిశ్రీ తెలిపారు. మండలంలోని కొణిదెన క్లస్టర్ పరిధిలో ఉన్న నక్కబొక్కలపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పలు రకాల ఆకులతో తయారు చేస్తున్న కషాయాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో కషాయాలను తయారు చేసుకోవచ్చన్నారు. ఒకసారి తయారు చేస్తే ఏడాదంతా పంటకు పిచికారీ చేసుకోవచ్చన్నారు. 10 రకాల ఆకులతో తయారు చేసిన దశపర్ని కషాయాన్ని పరిశీలించారు. రైతులకు నీమాస్త్రం, ద్రవ జీవామృతం, బీజామృతం లాంటి కషాయాలను తయారు చేయించి అన్ని గ్రామాలలో అందుబాటులో ఉంచామని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోహన్, చందనదుర్గ, వెంకటేశ్వర్లు, పలు గ్రామాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడం అభినందనీయం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

పంగులూరు, సెప్టెంబరు 12 : ప్రకృతి విపత్తుతో సర్వం కోల్పోయిన వరద బాధితులను ఆదుకునేందుకు సాయమందించడం అభినందనీయమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయ సిబ్బంది, మండల సమాఖ్య, వీవోఏలు వరద బాధితుల సహాయార్థం లక్షా వెయ్యి నూటపదహారు రూపాయల డీడీని గురువారం మంత్రి గొట్టిపాటికి అందచేశారు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన కర్రి సత్యనారాణ రూ.50వేల చెక్కును మంత్రికి అందచేశారు. చందలూరు గ్రామానికి చెందిన పల్లపోలు శ్యామ్‌సుందర్ రూ.10వేలు అందజేశారు. చందలూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు, ఏపీఎం జ్యోతి ప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, పెంట్యాల రాధాకృష్ణ, రామలింగస్వామి, టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్, షేక్ మస్తాన్‌వలి, చింతల సహదేవ్, నార్నె సుబ్బారావు, స్వామి, చిలుకూరి వెంకటేశ్వర్లు, ఆదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గొట్టిపాటి వెంకటరమణ, నాగలక్ష్మి, ఉన్నం రవి, కాజా పలువురు నేతలు, వీవోఏలు పాల్గొన్నారు.


వరద బాధితులుకు నిత్యావసరాలను తరలిస్తున్న రోటరీ సభ్యులు

మంత్రికి విరాళాల అందజేత

అద్దంకి : వరద బాధితుల సహాయార్థం పలువురు దాతలు ముందుకు వచ్చి గురువారం మం త్రి రవికుమార్ కు అందజేశారు. ఇంకొల్లు మండలం గంగవరం కు చెందిన కరి సత్యనారాయణ 50వేల రూపాయలు, జె.పంగులూరు మండల సమాఖ్య ఆధ్వర్యంలో 1,01,116 రూపాయలు, అద్దంకి ఏపియస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం ఆధ్వర్యంలో 20,116 రూపాయలు, కొరిశపాడు ఐసీడీయస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు 87 వేల రూపాయలను మంత్రి రవికుమార్ కు అందజేశారు. సీడీపీఓ కృష్ణకుమారి, సూపర్‌వైజర్ పద్మావతి, అనంతలక్ష్మి, ధనలక్ష్మి, పార్వతి, చంద్రమతి, మాధవి, రజనీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 12 : వరద బాధితులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆపద్బంధు పథకం ద్వారా నిత్యావసర సరుకుల బ్యాగ్‌లను అందజేశారు. గురువారం వరద వలన కొల్లూరు ప్రాంత వాసులకు రోటరీ డిస్ట్రిక్ 3150 పరిధిలోని క్లబ్‌ల సహకారంతో నిత్యావసర సరుకుల కిట్స్‌ను సీనియర్ రోటేరియన్ కాకర్ల వెంకటేశ్వర్లు పాల్గొని పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు.


వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

విద్యుత్ చౌర్యం నేరం

ఈఈ జాన్ థామస్

పర్చూరు, సెప్టెంబరు 12 : విద్యుత్ అక్రమ వినియోగం, చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ శాఖ ఈఈ జాన్ థామస్ అన్నారు. గురువారం విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో మండలంలో తినిఖీలు చేపట్టారు. మండలంలో అధనపు లోడుతో విద్యుత్‌ను వినియోగించుకుంటున్న సర్వీసులను గుర్తించి 136 కేసులు నమోదు చేసినట్ల అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి రూ.3,72లక్షల అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. తనిఖీల అనంతరం అద్దంకి నాంచారమ్మ మండప ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు ఆ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పర్చూరు డీఈఈ, ఎస్.రమేష్‌బాబు, చీరాల డీఈఈ టి.శ్రీనివాసరావు, వేటపాలెం డీఈఈ జె.శ్రీనివాసరావు, ఒంగోలు డీఈఈ వి.శ్రీనివాసరావు, నరసింహారావు, పర్చూరు ఏఈ ఎల్.రమేష్ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్

గ్రామ వెల్ఫేర్ సహాయకులకు శానిటేషన్ పర్యవేక్షణ బాధ్యత

పర్చూరు, సెప్టెంబరు 12 : ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఇకపై శానిటేషన్ పర్యవేక్షణ బాధ్యతలను గ్రామ వేల్ఫేర్ సహాయకులు నిర్వహించాలని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వెల్ఫేర్, ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల్ఫేర్ అసిస్టెంట్‌లు ప్రతి సోమ, గురువారాల్లో స్వయంగా పాఠశాలలకు వెళ్లి టాయిలెట్స్, వాష్ బేసిన్, ఫ్లోర్‌లను పర్యవేక్షించి సంబంధిత యాప్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. దీనిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

పర్చూరు, సెప్టెంబరు 12 : పర్చూరులోని అద్దంకి మాన్యంలో బాల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వియాయక విగ్రహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ తహశీల్దార్ వేముల నాగలక్ష్మి పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గణేష్‌ను విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించే విధంగా ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న, తులసి ప్రశాంతి పాల్గొన్నారు.

నిమజ్జనాల సందడి


పర్చూరులో నిమజ్జనానికి తరలిస్తున్న భారీ గణపతి

పర్చూరు, సెప్టెంబరు 12 : వినాయ విగ్రహాల నిమజ్జనోత్సవాలు సందడిగా సాగుతున్నాయి. పెద్ద ఎత్తున విగ్రహాలను గురువారం నిమజ్జనానికి వాడరేవు తరలించారు. డీజే మోతలు, డ్యాన్స్‌లు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా గణనాథులను గంగమ్మ ఒడికి చేర్చారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

మార్టూరు : మార్టూరు సెంటరులో నిమజ్జనాల సందర్భంగా పండుగ వాతావరణం ఏర్పడింది. బొడ్డురాయి సెంటరు వద్ద శ్రీవాసవి అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటుచేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ట్రాక్టరుపై ఊరేగిస్తూ నిమజ్జనానికి తీసుకువెళ్లారు. మహిళలు స్వామి వారికి వార్లుపోశారు. వాసవీ యూత్ మహిళలు పాటలు పాడుకుంటూ స్వామివారిని బొల్లాపల్లి సాగర్ కాలువలో నిమజ్జనం చేశారు.

ఇంకొల్లు : వినాయకుని విగ్రహాలను గురువారం నిమజ్జనానికి తరలించారు. మండపాలలో ఏర్పాటు చేసిన వినాయకుల వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారు. తటాకాంజనేయస్వామి గుడి వద్ద, అభయాంజనేయ స్వామి గుడి వద్ద, బస్టాండు సమీపంలో ఆంజనేయస్వామి గుడి వద్ద, రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారు. వడ్డెరకాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గురువారం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

చినగంజాం : పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవ పందిళ్లలో గణనాథులను ప్రత్యేకంగా అలంకరించి ఆరవ రోజైన గురువారం భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రోజూ పూజలు, భజనలు, అన్నదానాలు జరుగుతున్నాయి. కడవకుదురు గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహన్ని మహిళల కోలటాం, డీజే సౌండ్‌తో యువత నృత్యాల నడుమ గ్రామంలోని పురవీధులలో ఊరేగింపు నిర్వహించి, అనంతరం మోటుపల్లి తీర ప్రాంతంలో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. పెదగంజాం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను భక్తులు పెదగంజాం, బాపయ్యనగర్ తీరప్రాంతాలలో నిమజ్జనం చేశారు.

రెండు రోడ్డు ప్రమాదాలు

- తప్పిన ప్రాణాపాయం
- తాగి వాహనాలు నడపడమే కారణం


అపస్మారక స్థితిలో జయకృష్ణ
శ్రీనును ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

చీరాలటౌన్, సెప్టెంబరు 12 : గురువారం ఒక్కరోజే రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఈపూరుపాలెంకు చెందిన జయకృష్ణ మద్యం సేవించి చీరాల వైపు నుంచి ద్విచక్ర వాహనంపై ఈపూరుపాలెం వెళుతున్నారు. అలాగే ఎదురుగా ఓ వ్యక్తి చిన్నపిల్లలను స్కూల్లో దింపేందుకు స్కూటీపై వెళుతున్నారు. ఈక్రమంలో ప్రధాన రహదారిలో విజయలక్ష్మి థియేటర్ ఎదురుగా అతివేగంగా జయకృష్ణ వారిని ఢీకొన్నారు. దీంతో తండ్రి, చిన్నపిల్లలు ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా జయకృష్ణ తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ అక్కడకు వెళ్లి వివరాలు సేకరించారు. జయకృష్ణను ఆసుపత్రికి తరలించారు.

ఏరియా హాస్పిటల్ ఎదురుగా

చీరాల ఏరియా హాస్పిటల్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. చీరాల పరిధిలోని పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీను పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని ఇతనితో పాటు బంధువైన నాగరాజుతో కలిసి మద్యం సేవించి ఇద్దరు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా ఏరియా హాస్పిటల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను వేగంగా ఢీకొన్నారు. శ్రీనుకుడి కాలువిరిగి గాయాలపాలుకాగా, నాగరాజుల స్వల్ప ర గాయాలతో బయటపడ్డారు. శ్రీనుకు ఏరియా వైద్యశాలలో చికిత్స అందించి గుంటూరుకు తరలించారు. అతిగా మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదాలు జరిగాయి.

సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలి


చీరాలటౌన్, సెప్టెంబరు 12 : దళితుల సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు అన్నారు. గురువారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల జీవన మనుగడలో ఐక్యమత్యంతో ముందుకు సాగాలన్నారు. ఈనెల 22న చీరాలలో నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కరవది సుబ్బారావు, ప్రకాష్, జోసఫ్, చంద్ర పాల్గొన్నారు.




సోమశిలలో 48.605 టీఎంసీల నీరు

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 14,714 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా 48.605 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టాకు 550, కండ లేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి



● ఆశావహులపై విజయవాడ ముంపు ప్రభావం ● సహాయక చర్యల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిజీ బిజీ ● అక్కడ పరిస్థితులు చక్కబడ్డాకే పదవులు



'నామినేటెడ్' భర్తీ.. దసరా తర్వాతే!

విజయవాడ ముంపు.. కూటమి నేతల ఆశలపై నీళ్లు చల్లింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ఈ నెలలో లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బెజవాడలో పరిస్థితులు చక్కబడ్డాకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతర విషయాలు ఆలోచించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో నామినే టెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న ఆశవహులు దసరా వరకు వేచి చూడక తప్పదని తెలుస్తోంది.

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 12 : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కూటమి పార్టీలను కాపాడుకోవడానికి, ఎన్నికల్లో మన విజయానికి కృషి చేసిన పలువురు నాయకులు నామినేటెట్ పోస్టుల మీద ఆశలు పెట్టుకున్నారు. సీఎం చంద్రబాబు సైతం 2014-19 కాలానికి భిన్నంగా నామినేటెడ్ పదవులను వెంటనే భర్తీ చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఆ పోస్టులకు అర్హులైన నాయకుల పేర్లను పరిశీలించారు. వడపోత కార్యక్రమం దాదాపు పూర్తయిన దశలో మరో 20 రోజుల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. ఈ క్రమంలో కూటమి నేతల్లో ఉత్కంఠ మొదలయ్యింది. సరిగ్గా ఈ సమయంలోనే అనుకోని ఉప్పెన విజయవాడను ముంచెత్తింది. సీఎం చంద్రబాబు రేయింబవళ్లు విజయవాడలోనే తిష్టవేసి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. రాష్ట్ర యంత్రాంగాన్ని, పార్టీ శ్రేణులను పూర్తిగా వరద బాధితుల సహాయక చర్యలకు వినియోగించారు. ముంపు ప్రభావం తగ్గుముఖం పట్టినా విజయవాడ కోలుకోవాలంటే చాలా కాలం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పటి వరకు చంద్రబాబు మరో పనిపై దృష్టి సారించే అవకాశం లేదు. ఈ క్రమంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ అనివార్యంగా వాయిదా పడింది. విజయవాడ అన్నివిధాలా కోలుకుంటే విజయదశమికి నామినెటెడ్ పదవుల విషయం చంద్రబాబు పరిశీలించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. అంతవరకు ఆశావహులు ఎదురు చూడాల్సిందే.

ఉద్యోగుల బదిలీల గడువు

22 వరకు పొడిగింపు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 12 : ఉద్యోగుల బదిలీల గడువును ఈ నెల 22వ తేదీ వరకు కూటమి ప్రభుత్వం పొడిగించింది. వాస్తవానికి గత నెల 31వ తేదీ నాటికే స్థానచలనాలు ముగించాల్సి ఉంది. అయితే, ఆ సమయానికి బదిలీ ప్రక్రియ పూర్తి కాకపోవటంతో ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. ప్రస్తుతం విజయవాడలో వరదల కారణంగా బదిలీల ప్రక్రియను మళ్లీ ప్రభుత్వం పొడిగించింది.

జిల్లాకు జ్వరమొచ్చింది. ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. వర్షాలు కురవడం, దోమల ఉత్పత్తి పెరగడం, నీటి నిల్వలు, పారిశుధ్యలేమి తదితర కారణాలతో జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వర పీడుతులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు నిండుతున్నాయి. ఇవికాక అనుమానిత చికున్‌గున్యా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.



నెల్లూరు : జీజీహెచ్ ఓపీ విభాగంలో రోగులు

జ్వరం.. జ్వరం..

ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్లే

- 15వేల మందికిపైగా బాధితులు
- చికున్‌గున్యా అనుమానిత కేసులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : జిల్లాలో ఇటీవల వర్షాలు కురవడంతో కొత్తనీటి రాక, నీటి వనరుల కలుషితం వల్ల వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్తుల్లో జ్వరాల కేసులే 40 శాతం ఉంటున్నాయంటే ఏ స్థాయిలో జ్వరాలు ప్రబలుతున్నాయో అర్థమ వుతుంది. పల్లెల్లోనూ పెద్ద సంఖ్యలో జ్వరపీడితులు ఉంటున్నారు. గ్రామీణ వైద్యులను ప్రతిరోజూ పదుల సంఖ్యలో బాధితులు కలిసి చికిత్స చేయించుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా వాటిలో గత వారం రోజులలో 350 మందికి పైగా జ్వరాల కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఏరియా, జిల్లా ఆసుపత్రులతోపాటు నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజుకు 2వేలకు మందికిపైగా వివిధ రకాల రోగులు వస్తున్నారు. వీరిలో జ్వరపీడితులే ఎక్కువగా ఉంటున్నారు. ఇక, జిల్లాలో 2వేలకు పైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా వాటికి వచ్చే జ్వరాల బాధితుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 15వేలకు మందికి పైగా వైరల్ జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇవికాక టైఫాయిడ్, మలేరియా వంటి కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి.

● **డెంగ్యూ జ్వరాలూ ఎక్కువే !**

జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ విషజ్వరాలు కలవర పెడుతున్నాయి. ఇప్పటి వరకు 75 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని వైద్య ఆరోగ్యశాఖ చెబుతుండగా ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే 300కు పైగా కేసులు ఉన్నట్లు అక్కడి వైద్యులు చెబుతున్నారు. నెల్లూరులోని ఒక్క ప్రైవేట్ ఆసుపత్రిలోనే 52 మంది డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ప్రస్తుత తరుణంలో జ్వరాలతోపాటు గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గు జలుబు కేసులు కూడా ఎక్కువగా ఉన్నాయి.

● **సర్వే లేదు.. ప్రచారం కరువు**

జ్వరాల నియంత్రణకు గతంలో వైద్య ఆరోగ్యశాఖ ఫీవర్ సర్వే చేపట్టేది. ఇంటింటికి తిరిగి వైరల్ ఫీవర్ కేసులు, చికిత్స వంటి వివరాలను ఆరోగ్య కార్యకర్తలు నివేదిక రూపొందించేవారు. విషజ్వరాలు ఎక్కువగా నమోదైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. కానీ, ఇప్పుడు ఆ సర్వే జరగటం లేదు. అలాగే, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ యంత్రాంగం వైఫల్యం చెందుతోంది. వ్యాధులపై అవగాహన కల్పించే అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయడంలో తగిన కసరత్తు, ప్రచారం కరువవుతున్నాయి. వర్షాలు కురుస్తున్నప్పుడు ముందస్తు హెచ్చరికలు చేయాల్సిన వైద్యశాఖ ఆ దిశగా కృషి చేయడంలేదన్న విమర్శలున్నాయి. దీనిపై అధికారులు దృష్టిసారించాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి...

జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. లార్వా దశలోనే దోమల నివారణకు మందులు వాడాలి. లార్వా ఉన్న నీటిలో వంద మి.లీ. కిరోసిన్‌ను పోస్తే వెంటనే అవి మరణిస్తాయి. నివాసాల్లో దోమతెరలు, దోమల నివారణ మందులు వాడుకోవడం మంచిది. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే వైద్యుని సంప్రదించాలి. దగ్గు, జలుబుతో బాధపడే వారు మాస్కులు, చేతిరుమాలు ఉపయోగించాలి.

నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి



విష జ్వరాల బాధితులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నారు. ప్రస్తు తం జిల్లాలో వర్షాలు కురుస్తుండటం, జ్వరాలకు ఇదే సీజన్ కావటంతో జ్వరపీడితులు ఆసుపత్రులకు ఎక్కువగా వస్తున్నారు. టై ఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. డెంగ్యూ బాధితులు పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. తప్పనిసరిగా కరోనా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి పరీక్షలు, చికిత్స ద్వారా జ్వరపీడితులు పూర్తిగా కోలుకుంటారు.

- డాక్టర్ కృష్ణమూర్తి, జీజీహెచ్, అసోసియేట్ ప్రొఫెసర్



వైద్య పరీక్షల కోసం వేచిఉన్న రోగులు

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదైన జ్వరాల కేసులు

జ్వర రకం	ప్రభుత్వం	ప్రైవేట్
వైరల్ ఫీవర్	4,000	15,000
డెంగ్యూ ఫీవర్	75	568
అనుమానిత చికున్‌గున్యా	-	90
టైఫాయిడ్	2000	4300
మలేరియా	4	80

- కాసులిస్తే ఎనీవేర్ అక్రమ రిజిస్ట్రేషన్లు
- కోర్టులో ఉన్నా, నిషేధిత ఆస్తి అయినా కూడా..
- వివాదాస్పద స్థలానికి తాజాగా రిజిస్ట్రేషన్
- రూ.1.50 కోట్ల ఒప్పందం

పైసలిస్తే పచ్చజెండా !

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12: ముడుపులు ఇస్తేచాలు ఎనీవేర్ అక్రమ రిజిస్ట్రేషన్లకు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ సిద్ధంగా ఉంది. దూరప్రాంతాల్లో ఉన్నవారు స్వస్థలాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతే, అలాంటి వారి కోసం ప్రభుత్వం ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌ను ప్రవేశపెట్టింది. ఈ విధానం రిజిస్ట్రేషన్ శాఖలోని లంచావతారులకు వరంగా మారింది. ఈ పద్ధతిని వినియోగించుకుని, కాసులు ఇస్తే చాలు... ప్రభుత్వ భూమైనా, కోర్టు వ్యవహారంలో ఉన్న భూమి నైనా రిజిస్ట్రేషన్ చేసే పరిస్థితి ఇక్కడుంది.

● **ఆ పోస్టుకు డిమాండ్**

కొంతకాలం కిందట నెల్లూరులో ఓ విలువైన భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెలుగులోకి వచ్చింది. రూ. కోట్ల విలువ చేసే ఆభూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని, ఆ భూమి సొంత దారు గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. ఈ క్రమంలో ఆనాటి సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ చేశారు. ఆ తరువాత పైరవీలు సాగించి స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ పోస్టు కోసం ఎందోమంది ప్రయత్నించారు. వేరే చోట పనిచేస్తూ ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జిగా పనిచేసేందుకు కొందరు వచ్చారు.

● **ప్రక్షాళన ప్రారంభం**

ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టాక రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన ప్రారంభమైంది. దీంతో స్టోన్‌హౌస్‌పేటలో పనిచేస్తున్న ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఉన్నం శ్రీనివాసులును యథాస్థానమైన వెంకటగిరికి పంపించారు. ఆయన వెళ్లిన తరువాత రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ సహాయకుడు మిల్కిరోషన్‌ను ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. అలాగే ముత్తుకూరుకు మురళీకృష్ణను ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. ఎక్కడో పనిచేస్తున్న వారు, రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగే కార్యాలయాల్లో పదవుల కోసం పైరవీలు సాగిస్తూ, ఉన్నతాధికారుల మెప్పుపొందుతూ నియామకాలు పొందుతున్నారు. విషయం బయటకు పొక్కితే రిజిస్ట్రేషన్లు రద్దు చేసేసి చేతులు దులుపుకుంటున్నారు.అయితే సబ్ రిజిస్ట్రార్లకు ఎలాంటి శిక్షలూ ఉండటం లేదు.

● **తాజాగా కోర్టులో ఉన్న భూమికి రిజిస్ట్రేషన్**

తాజాగా ఈ నెల 10న కోర్టులో ఉన్న భూమికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్ట్రేషన్‌ను రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2 రిజిస్ట్రేషన్ చేశారు. 29604-24 డాక్యుమెంటు నంబరుతో ఈ రిజిస్ట్రేషన్ జరిగింది. కోర్టులో ఉన్న ఈ భూమికి రిజిస్ట్రేషన్ చేయకూడదని తెలిసినా చేసేశారు. 2.39 సెంట్లు ఉన్న భూమిలో 1.22 సెంట్ల భూమిని జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) రిజిస్ట్రేషన్‌ను సబ్‌రిజిస్ట్రార్ జాఫర్ చేశారు. అయితే ఇక్కడ ఓ మతలబు ఉంది. ఈ రిజిస్ట్రేషన్‌కు ఎనీవేర్ పద్ధతిని వినియోగించారు. స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి వచ్చే ఈ భూమిని నెల్లూరు రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఎనీవేర్ పద్ధతిలో రిజిస్టర్ చేశారు. ఇందుకు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ మిల్కిరోషన్ ఆమోదం తెలిపారని తెలిసింది. ఆర్‌వో సబ్‌రిజిస్ట్రార్ జాఫర్ జీపీఏ రిజిస్ట్రేషన్‌ను ఈనెల 10న చేసేశారు. పంచాగ్నుల రాధాకృష్ణమూరి అనే వ్యక్తి ఆంధ్ర ఫకీర్‌రావు అనే వ్యక్తికి జీపీఏ రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ భూమి విలువ బయట మార్కెట్‌లో రూ.10 కోట్లకు పైగా ఉంటుందని సమాచారం. దీని జీపీఏ రిజిస్ట్రేషన్‌కు రూ. 1.50 కోట్లు లంచం సమర్పించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల హస్తం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ జీపీఏ రిజిస్ట్రేషన్ విషయం గుంటూరు పద్మావతి అనే మహిళ ఆదేరోజు తెలుసుకుని ఆభూమి తనదని, అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని రిజిస్ట్రేషన్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ కమిషనర్ సంబంధిత డీఐజీని విచారించాలని ఆదేశించారు. దీంతో డీఐజీ జిల్లా రిజిస్ట్రార్‌ను విచారణకు పంపినట్లు తెలిసింది. గురువారం జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణచేపట్టినట్లు తెలిసింది.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రార్ ఆమోదంతోనే చేశా..

సబ్‌రిజిస్ట్రార్ జాఫర్ మాట్లాడుతూ తాను, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ మిల్కిరోషన్ ఆమోదం(అప్రూవల్) తెలుపడంతో ఎనీవేర్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేశానని చెప్పారు. అయితే డాక్యుమెంటును ఈ-ఫైల్ చేస్తున్న సందర్భంలో పద్మావతి అనే మహిళ తన వద్దకు వచ్చి జీపీఏ రిజిస్ట్రేషన్ జరిగిన భూమి తనదని చెప్పటంతో ఆమె చేత ఒక అర్జీ రాయించుకున్నానని చెప్పారు

- ఆర్‌వో సబ్ రిజిస్ట్రార్ జాఫర్

డాక్యుమెంటు రద్దు చేయించాం



గుంటూరు పద్మావతి, పీపీవీ ఎస్ఎస్ నారాయణ అనే వారు 29604-24 డాక్యుమెంటు జీపీఏ రిజిస్ట్రేషన్ విషయమై డీఐజీ కిరణ్‌కుమార్‌కు, తనకు ఫిర్యాదు చేయటంతో ఆ డాక్యుమెంటు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించాం. ఈ విషయమై స్టోన్‌హౌస్‌పేట కార్యాలయంలోనూ, ఆర్‌వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ విచారణ జరిపాం. నివేదికను డీఐజీకి అందచేస్తాం.

- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ముగ్గురిపై వేటు ?

నెల్లూరు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ముగ్గురిని గురువారం రాత్రి రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీ ఆదేశాలతో ఆ శాఖ జిల్లా అధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫోన్ చేయగా చేయగా వారు స్పందించలేదు.

పాడిరైతులకు అందుబాటులో ఉంటూ

మెరుగైన సేవలందించాలి

● పశువైద్యులకు కొత్త జేడీ రమేష్‌నాయక్ సూచన



నెల్లూరు(వ్యవసాయం) : గ్రామాల్లోని పశువైద్యశాలల్లో వైద్యులు పాడి రైతులకు అందు బాటులో ఉంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలందించాలని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌నాయక్ ఆదేశించారు. జిల్లా జేడీగా ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యసేవల్లో అలసత్వం, జాప్యానికి చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరి సహకారంతో ప్రభుత్వ పథకాలు ప్రతి పాడిరైతుకు అందేందుకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా ప్రతి పశువుకు బీమా చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులు గోకులాల కోసం దరఖాస్తు చేసుకోవాల ని కోరారు. వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భధారణ వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. కాగా, గతంలో జేడీగా పనిచేస్తున్న డాక్టర్ మహేశ్వరుడు ఉద్యోగవిరమణ పొందడం తో వెటర్నరీ పాలిటెక్నిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావు ఇన్‌చార్జి జేడీగా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో కావలి డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రమేష్‌నాయక్‌కు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి జిల్లా జేడీగా నియమించింది.



మాట్లాడుతున్న డాక్టర్ పెంచలయ్య

సమయపాలన పాటించకుంటే జీతాలు నిలిపేస్తాం

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోతే జీతభత్యాలు నిలిపివేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించా రు. గురువారం ఆయన చాంబర్‌లో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యాలయ వేళలను కచ్చితంగా పాటించాలని, ముఖ ఆధారిత హాజరు వేయాలని ఆదేశించారు. ముఖ హాజరు వేయని వారు, సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో వైద్య పథకాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డెమో కనకరత్నం, మంజుల, రమేష్‌బాబు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి శనివారం నెల్లూరుకు వస్తున్నారని ఐసీడీఎస్ పీడీ హేన సుజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె నెల్లూరు జైలును సందర్శిస్తారని, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.



వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయకృష్ణ

కన్నకొడుకే కడతేర్చాడు!

కుటుంబ కలహాలతో ఘాతుకం

పోలీసుల అదుపులో నిందితుడు

సైదాపురం, సెప్టెంబరు 12 : కుటుంబ కలహాలతో కన్నతండ్రినే కడతేర్చాడో సుపుత్రుడు. నిద్రిపోతున్న తండ్రిపై బండరాయితో మోది హత్య చేశాడు. సైదాపురం పంచాయతీ మొలకలపూండ్ల గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు... సైదాపురం పంచాయతీ పరిధిలోని మొలకలపూండ్ల గ్రామానికి చెందిన పాలేపు వెంకటేశ్వర్లు (55) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మనస్పర్థల నేపథ్యంలో చాన్నాళ్ల క్రితం భార్య బుజ్జమ్మ, కుమారుడు శివాజీతో విడిపోయి తమ్ముడు శ్రీనివాసులు వద్దనే ఉంటున్నాడు. అయితే, తమను పట్టించుకోవడం లేదంటూ తండ్రిపై శివాజీ ఆగ్రహం పెంచుకున్నాడు. ఈ విషయమై తరచూ వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. అయితే, ఏం జరిగిందో ఏమోగానీ గురువారం తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో ఇంటి ముందు నిద్రపోతున్న తండ్రి ముఖంపై కొడుకు శివాజీ బండరాయితో విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత తన తండ్రిని తానే చంపేశానని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్ఐ క్రాంతికుమార్, క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మృతుడి తమ్ముడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గూడూరు ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు చెప్పారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రేపటి నుంచి స్వచ్ఛతా హి సేవా

లింగసముద్రం, సెప్టెంబరు 12: మహాత్మాగాంధీ జయంతి, స్వచ్ఛభారత్ మిషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 14 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మండలంలో స్వచ్ఛతా హై సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ రామసుబ్బారావు గురువారం తెలిపారు.

రాళ్లపాడులో నిమజ్జనం వద్దు

లింగసముద్రం, సెప్టెంబరు 12: రాళ్లపాడు ప్రాజెక్టు లోతట్టు ప్రాంతంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం చేయకూడదని ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళి లింగసముద్రం, కొండాపురం మండలాల ప్రజలకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాలను లోతట్టులో వేస్తే తాగునీరు కలుషితం అవుతుందన్నారు. ప్రాజెక్టు కొత్త గేట్ల ముందు ఉన్న గైడ్‌బండ్, మన్నేరులో నిమజ్జనం చేసుకోవాలన్నారు. అలా కాకుండా ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ విచారణ

కొండాపురం, సెప్టెంబరు 12: స్థానిక మండల కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధిహామీ 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు ఏపీవో చెంచయ్య తెలిపారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2014 మార్చి మధ్యకాలంలో జరిగిన ఉపాధి పనులపై ఈ నెల 1 వ తేదీ నుంచి సిబ్బంది సామాజిక తనిఖీ, 5 వ తేదీ నుండి 11వరకు గ్రామసభలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. బహిరంగ విచారణకు మండల ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు హాజరుకావాలని కోరారు.

రేపు కావలిలో మెగా లోక్ అదాలత్

కావలి రూరల్, సెప్టెంబరు 12: పట్టణంలో శనివారం జరుగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు కురాని కేసులు, పెండింగ్ కేసులు ఖర్చు. కాలయాపన లేని అప్పీల్ లేని అంతిమ తీర్పు లోక్ అదాలత్‌లో వస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయ సహాయం ఇస్తామన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12: పట్టణం డిగ్రీ కళాశాల సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలి పొందాలన్నారు. పనుల వద్ద కూలీలకు సిబ్బంది వసతులు కల్పించాలన్నారు. అనంతరం జాబ్‌కార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందజేశారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12: పట్టణంలోని బెస్తవీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గురువారం టీడీపీ నాయకులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, నాయకులు సందానీ, అఖిల్, కాంతారావు, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీక్లబ్ సభ్యులు

జలదంకి, సెప్టెంబరు 12: జమ్మలపాలెం సాయి నర్సింగ్ కాలేజీ ఆవరణలో గురువారం కావలి రోటరీక్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కాలేజీ కరస్పాండెంట్ దశరథ రామిరెడ్డిని రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, క్లబ్ సభ్యులు హరినారపరెడ్డి, కొండారెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

కంద్రా మాల్యాద్రికి పితృవియోగం

కందుకూరు, సెప్టెంబరు 12: నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, పార్టీ పట్టణ మాజీఅధ్యక్షుడు కంద్రా మాల్యాద్రి తండ్రి సోమయ్య గురువారం సాయంత్రం మృతి చెందారు. వయోభారంతో ఆయన చుట్టుగుంటలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏచూరి మరణం తీరనిలోటు

కందుకూరు, సెప్టెంబరు 12: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని నియోజకవర్గ సీపీఐ నేతలు మాలకొండయ్య, షేక్ హుస్సేన్‌లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమదశ నుంచే వామపక్ష భావజాలం అలవర్చుకుని దోపిడీలేని వర్గరహిత సమాజం కోసం ఏచూరి ఎనలేని కృషిచేశారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

కందుకూరు, సెప్టెంబరు 12: స్థానిక ఏకలవ్యనగర్ వద్ద ఈ నెల 2న జరిగిన ద్విచక్ర వాహనాల ప్రమాదంలో గాయపడిన బాలవెంకట మణికంఠ ఒంగోలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందారు. పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలకు వెళ్లిన యువకులు మోటారుసైకిళ్లు ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మణికంఠ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.

ప్లాంటేషన్ల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు, సెప్టెంబరు 12: మండలంలోని కనియంపాడు, విరువూరు ప్లాంటేషన్‌లలో నాటిన మొక్కలను గురువారం కావలి సబ్ డీఎఫ్‌వో రాజశేఖర్ పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కోటికి ఎసరు' కథనానికి స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన ఆయా ప్లాంటేషన్‌లను పరిశీలించి మొక్కలు నాటే విధానం తదితర అంశాలపై ఆరా తీశారు. పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా నిబంధనల మేరకు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

ఆక్రమణలో రామన్న చెరువు

● ఆందోళనలో ఆయకట్టుదారులు ● చోద్యం చూస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 12: మండలకేంద్రం సమీపంలోని రామన్నచెరువు ఆక్రమణలతో రోజురోజుకు కుంచించుకపోతుంది. చెరువు లోతట్టు ప్రాంతం విస్తీర్ణం సుమారు 110ఎకరాలు ఉండగా ప్రస్తుతం 70ఎకరాలు మాత్రమే ఉంది. సుమారు 40 ఎకరాలకు పైగానే లోతట్టు ప్రాంతం ఆక్రమణలకు గురైంది. వర్షాభావంతో గత 15ఏళ్ల నుండి చెరువులోకి వర్షం నీళ్లు రాకపోవడంతో చుట్టుప్రక్కల పొలాలు కలిగిన రైతులు లోతట్టు ప్రాతంలోని చిల్లచెట్లు పీకేసి భూమిని చదును చేసి గట్టు వేసి ఆక్రమించేస్తున్నారు. అలాగే వీటికి విద్యుత్ మోటర్లు వేసి ఉద్యాన పంటలు, నిమ్మ, బత్తాయి, మొక్కలు వేసి లక్షలు లాభాలు ఆర్జిస్తున్నారు. ఆక్రమించిన భూములకు చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నారు. చెరువులో సుమారు 30 లక్షలకు పైగా విలువ కలిగిన చిల్లకర్ర ఉంది. గత ఏడాది నాలుగైదు లక్షలు విలువ కలిగిన చిల్లకర్రను నిరికివేసి పొగాకు బ్యారనీలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. అలాగే ఇటుకబట్టీల యజమానులు మట్టిని తరలిస్తున్నారు. ఈ ఆక్రమణలతో నీటి సామర్థ్యం తగ్గి నీరంతా వృథాగా పోయే అవకాశం ఉందని చెరువు కింది వంద ఎకరాలల్లో సాగులో ఉన్న ఆయకట్టుదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు హద్దులు నిర్ణయించి, పరిరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


రామన్నచెరువు భూమిని ఆక్రమించి సాగు చేసిన పశుగ్రాసం

వైసీపీ పాలనలో పడకేసిన పారిశ్రామిక ప్రగతి

● మొక్కుబడిగా మిగిలిన ఇండస్ట్రియల్ పార్కు
● నిరుద్యోగుల ఆశలు ఆవిరి


అలంకారప్రాయంగా ఉన్న రోడ్డు


నారంపేట వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు వేసిన శిలాఫలకం

ఆత్మకూరు, సెప్టెంబరు 12: వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రగతి పడకేసింది. పరిశ్రమల ఏర్పాటు కలగా మిగిలింది. నారంపేట వద్ద ఏర్పాటుచేసిన ఇండస్ట్రియల్ పార్కు మొక్కుబడిగా మిగిలింది. మండలంలోని నారంపేట సమీపంలో జాతీయ రహదారి పక్కనే 173ఎకరాల్లో నూతనంగా ఇండస్ట్రియల్ పార్కుకు దివంగత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి 2020 సెప్టెంబరు 20న శంకుస్థాపన చేశారు. దాని అభివృద్ధికి మొదటివిడతగా సుమారు రూ.30కోట్ల రూపాయల మేర నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 87ఎకరాల్లో మాత్రం కేవలం రోడ్లు, డ్రైనేజీ పనులు జరిగాయి. మిగిలిన 87ఎకరాలు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ 87 ఎకరాల్లో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ స్థాపించేందుకు సంబంధిత యాజమాన్యం భూములు పరిశీలించి వెళ్లింది. అయితే ఈ పరిశ్రమ ఎట్టకేలకు బద్వేల్‌కు తరలివెళ్లింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటు ఊసే లేకపోవడం గమనార్హం.

పారిశ్రామిక ప్రగతికి గ్రహణం

ఆత్మకూరులో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ ఏర్పాటుచేసి ఉంటే రూ. 1600 కోట్లు పెట్టుబడులు, 2500 పైచిలుకు ప్రత్యక్ష ఉద్యోగాలు, మరో 500 మంది వరకు పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చి ఉండేవి. జామాయిల్ రైతులకు ఎంతో ఉపయోగకరమైన ఈ పరిశ్రమతో పాటు అనుబంధ పరిశ్రమలు అందుబాటులోకి వచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతామని ఆశించామని, అయితే నిరాశే మిగిలిందని, ఇకనైనా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు, నిరుద్యోగ యువత కోరుతున్నారు.

వరద బాధితులకు దాతల చేయూత


మంత్రి లోకేష్‌కు విరాళం ఇస్తున్న కందుకూరు ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కావలి టౌన్, సెప్టెంబరు 12: బీసీ ఐక్యవేదిక సభ్యులు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా విజయవాడలోని వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్, న్యాయవాది సాయిప్రసాద్, చిన్ని వరప్రసాద్, గౌరిశంకర్, చంద్రమౌళి, నారాయణ, గిరి పాల్గొన్నారు.

కందుకూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గం ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.2లక్షలు విరాళం అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ఈ విరాళాన్ని అందజేశారు.


దుప్పట్లు పంపిణీలో కమిషనర్ శ్రావణ్‌కుమార్, నేతలు

రాధారమణ సేవలు మరువలేనివి


రాధారమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12: మెట్ట ప్రాంతంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పారిశ్రామికవేత్త బత్తుల రాధారమణ చేసిన కృషి మరువలేనిదని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం గంగిరెడ్డిపల్లిలో జరిగిన రాధారమణ ఉత్తర క్రియల్లో పలు పార్టీల నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనం తరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకట రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి చల్లా ప్రసాద్, నాయకులు కరమతుల్లాబాషా, సందానీ, తుమ్మల కిరణ్, అలీజాన్, ఇలియాజ్ తదితరులున్నారు.

మంత్రి ఆనం పరామర్శ


సుబ్బరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆనం

అనంతసాగరం, సెప్టెంబరు 12: మండల టీడీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీత, ఆమె కుటుంబ సభ్యులను గురువారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చిలకలమర్రిలో పరామర్శించారు. సునీత భర్త మాజీ ఎంపీపీ సుబ్బరాజు ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చెరువు పోరంబోకు భూమిలో పనులు చేపడితే చర్యలు

కలువాయి, సెప్టెంబరు 12: చెరువు పోరంబోకు భూమిలో పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆక్రమణదారుడిని హెచ్చరించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మాదన్నగారిపల్లె సర్వే నెం 56లోని చెరువు పోరంబోకు భూమిని కొందరు ఆక్రమించి చదును చేస్తున్నట్లు గురువారం తహసీల్దారు సంజీవకుమారికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆర్ఐ మస్తాన్‌వలీ, వీఆర్వో జనార్ధన్ పరిశీలించి ఎలాంటి పనులు చేపట్టినా చర్యలు తీసు కుంటామని ఆక్రమణదారుడిని హెచ్చరిం చినట్లు తెలిపారు.


చెరువు పోరంబోకు భూమిని పరిశీలిస్తున్న ఆర్ఐ మస్తాన్‌వలీ

హోంగార్డు మృతికి సంతాపం


హోంగార్డ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీఐ వెంకట్రావు

సీతారామపురం, సెప్టెంబరు 12: స్థానిక పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ ఖాదర్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. గురువారం స్వగ్రామమైన సీతారామపురంలో అబ్దుల్ ఖాదర్ మృతదేహానికి ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, సీతారామపురం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ వెంకటసుబ్బయ్య, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, పోలీస్ సిబ్బంది నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై సీడీపీవో విచారణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 12: కొండసముద్రం అంగన్‌వాడీ కేంద్రం-2 కార్యకర్త తాటిపర్తి శిరీషాపై కందుకూరు ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ట గురువారం విచారణ చేపట్టారు. శిరీషా ఉద్యోగం కోసం స్థానిక పత్రాలు సృష్టించి అధికారులను తప్పుదోవ పట్టించినట్లు గ్రామస్థులు గ్రీవెన్‌సెల్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు డైరక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. శిరీషా పుట్టినిల్లు మాత్రమే కొండసముద్రం అని ఆమె భర్త కళవళ్ల గ్రామం అని గ్రామస్థులు సీడీపీఓకు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, స్థానికులు మన్నం చిరంజీవి, నల్లమోతు రాంబాబు, ఉన్నం సురేష్‌బాబు, గుర్రం నాగార్జున పాల్గొన్నారు.

రూ.4లక్షలు పలికిన లడ్డూ


లడ్డూతో గుండాబత్తిన మాలకొండయ్య కుటుంబసభ్యులు

కందుకూరు, సెప్టెంబరు 12: విక్కిరాలపేట వినాయకుని విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన లడ్డూకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన గుండాబత్తిన మాలకొండయ్య రూ.4లక్షలకు అత్యధికంగా వేలం పాడి దక్కించుకున్నారు. అనంతరం మేళతాళాలు మధ్య అట్టహాసంగా ఆయన లడ్డూను తన ఇంటికి తీసుకెళ్లారు.

కందుకూరు ఆర్టీవోగా లక్ష్మి



కందుకూరు, సెప్టెంబరు 12: స్థానిక ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఓ టీవీఎన్ లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె చిలకలూరిపేట ఎంవీఐగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. సిబ్బంది స్వాగతం పలికారు.

కుమార్తెను వేధిస్తున్నాడని తల్లి ఫిర్యాదు

కావలి రూరల్, సెప్టెంబరు 12: స్థానిక క్రిష్టియన్‌పేటలో ఉంటున్న తమ కుమార్తెను పట్టణానికి చెందిన జక్కంపూడి సుబ్బానాయుడు వేధిస్తున్నాడని గురువారం రాత్రి ఒక మహిళ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె పర్సనల్ ఫొటోలు, వీడియోలు అందరికి పంపుతానని బెదిరించటంతో పాటు కళాశాలకు వెళ్తుండగా స్కూటీని అడ్డగిస్తూ బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ మేరకుకేసు నమోదు చేశామన్నారు.

ఉత్తర కాలువకు నీరు విడుదల చేయాలి

● సీపీఎం నాయకుల డిమాండ్

అనంతసాగరం, సెప్టెంబరు 12: సోమశిల జలాశయానికి వరద జలాలు వస్తున్న తరుణంలో ఉత్తర కాలువకు నీరు ఇవ్వాలని సీపీఎం నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉత్తర కాలువ పరిధిలో ఉన్న చెరువులకు నీరు లేక ఎండిపోవడంతో రైతులు, మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ యంత్రాగం చొరవ చూపి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం చేయలేని జగన్ విమర్శలా..?

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ దోపిడీ లెక్కలు తేలాలి
● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్

కావలి టౌన్, సెప్టెంబరు 12: వరద బాధితులకు సాయం చేయలేని జగన్ చేసేవారిని విమర్శించడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో జరిగిన ఆయన బీజేపీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలకులు వరదలు వస్తే ఏరియల్ రివ్యూలకు పరిమితమైందని గుర్తుచేశారు. వరద బాధితలను ఆదుకునేందుకు అహర్నిశలు కష్టపడిన కూటమి నేతలను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అవినీతి, అన్యాయాలను ప్రజలు తెలుసుకున్నారని చెప్పారు. కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం సొమ్మును స్వాహా చేశారని మండిపడ్డారు. ఆయన ఇంటిముందు అసైన్‌మెంట్ స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. బీజేపీ సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బ్రహ్మానందం, పురుసు వెంకటేశ్వర్లు, మందా కిరణ్, సుజిత్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో బీజేపీ నేత భరత్‌కుమార్

ఎమ్మార్సీకి సెమిస్టర్-2 పుస్తకాలు

లింగసముద్రం, సెప్టెంబరు 12: స్థానిక మండల విద్యావనరుల కేంద్రానికి గురువారం సెమిస్టర్-2 కి సంబంధించిన పుస్తకాలు వచ్చాయి. 1వ తరగతి నుండి 10వ తరగతికి వరకు కొన్ని సబ్జక్టులకు చెందిన పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ-2 శివకుమార్ తెలి పారు. పుస్తకాలను త్వరలో అన్ని పాఠశాలలు, హైస్కూళ్లకు పంపిణీ చేయ నున్నట్లు చెప్పారు.


పుస్తకాలు దించుతున్న కూలీలు

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన


వైద్యశాల ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

కావలి టౌన్, సెప్టెంబ రు 12: తమను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు గురువారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు పసుపు లేటి పెంచులయ్య మాట్లాడా రు. స్థానిక ఏరియా వైద్యశాలలో 15ఏళ్ల నుంచి పనిచేస్తున్న ప్రభుత్వం పర్మి నెంట్ చేయకపోవడం విచారకరమన్నారు. కరోనా కష్టకాలంలో విధులు నిర్వహిస్తే పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపాల్, మధుసూదన్‌రావు, స్టాఫ్ నర్సులు నూర్జహాన్, రాజ్యలక్ష్మి, స్వాతి, రాధిక, కల్యాణి పాల్గొన్నారు.

కంప్యూటరైజ్డ్‌కు సహకరించండి

అల్లూరు, సెప్టెంబరు 12: సహకార సంఘాల సభ్యుల పేర్లు కంప్యూటరైజ్డ్ చేస్తున్నట్లు సంఘంలోని ప్రతి ఖాతాదారుడు అందుకు సహకరించాలని పర్సన్ ఇన్‌చార్జి రమేష్‌బాబు కోరారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహాజనసభలో ఆయన మాట్లాడారు. ఆధార్, పాన్, భూమి పాసుబుక్కు, రెండు ఫొటోలను అందజేయాలన్నారు. పూర్తి వివరాలను అందజేస్తే కంప్యూటరీకరణలో వివరాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గోగుల శ్రీనివాసులు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బ్యాంక్ మేనేజరు స్వప్న, సూపర్‌వైజర్ మహేష్, పీఏసీఎస్ సీఈవో రాధయ్య పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల వితరణ

కావలి టౌన్, సెప్టెంబరు 12: బుడమగుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం విశ్రాంత ఉపాధ్యాయులు సమ దుస్తులు కుట్టించుట, స్టేషనరీ, పౌష్టికాహారం కోసం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సిద్దిక్, సుధాకర్, షేక్ జిలానీ బాష, కుమ్మరకొండూరు, ఉమామహేశ్వరశర్మ పాల్గొన్నారు. స్థానిక ఉపాధ్యాయులు రామారావు, ప్రసాద్‌లు వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఏ ఎస్ పేట, సెప్టెంబరు 12: మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు రూ.300కూలి గిట్టుబాటు అయ్యేలా పనిచేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. గురువారం ఆయన అక్బరాబాదులో జరుగుతున్న పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేయాలని, తద్వారా అత్యధికంగా కూలీ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చవటపల్లి, వెదనపర్తికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

కలువాయి, సెప్టెంబరు 12: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో గురువారం నుంచి చవటపల్లి, వెదనపర్తి గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం ప్రారంభించారు. కలువాయి నుంచి నెల్లూరుకు చీపినాపి, పర్లకొండ రింగ్‌రోడ్డులో నడిచే ఈ బస్సు వెరుబొట్లపల్లి నుంచి వెదనపర్తి, చవటపల్లి మీదుగా ఆదూరుపల్లికి చేరుకుంటుంది. ఉదయం 9గంటలకు నెల్లూరు వైపు, సాయంత్రం 4గంటలకు కలువాయి వైపు ఈ బస్సు సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదల్ నాయుడు, దనియాల చంద్రయ్య నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారులపై పశువుల సంచారం

● ప్రమాదాల బారిన వాహన చోదకులు


బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

సీతారామపురం, సెప్టెంబరు 12 : మండలంలోని రోడ్లు, ప్రధాన కూడళ్లలో పశువుల సంచారంతో ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సీతారామపురం బస్టాండు, మెయిన్ బజార్, సీతారామపురం పరిసరాల్లో పశువులు ఎక్కువగా సంచరిస్తూ వ్యాపారులు, కొనుగోలుదారుల చేతుల్లోని కూరగాయలను తినేస్తున్నాయి. వాటి యజమానులు పాలు ఇచ్చే సమయానికి ఇంటికి తోలుకెళ్లి తర్వాత బహిరంగ ప్రదేశాల్లో విడిచి పెట్టేస్తుండడంతో రాత్రి, పగలూ తేడా లేకుండా గుంపులు గుంపులుగా బస్టాండు సెంటర్‌లో సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారులపై అడ్డుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి పశువుల యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన మతిస్థిమితం లేని వ్యక్తి

● పోలీసులకు స్థానికుల సమాచారం

సంగం, సెప్టెంబరు 12: మండలపరిధిలోని జంగాలదొరువు శివారులో మధుసూదన్‌రెడ్డి అనే రైతు పొలానికి సమీపంలో రోడ్డు పక్కన ఓ మతిస్థిమితంలేని ఓ వ్యక్తి గత ఐదు రోజులుగా పడి ఉన్నాడు. ఇతని చేతికి గొలుసులు వేసి ఉన్నాయి. ఇతను ఏయస్‌పేట దర్గా నుంచి తప్పించుకుని వచ్చిన వాడుగా భావిస్తున్నారు. దర్గా నిర్వాహకులు స్పందించి మతిస్థిమితంలేని వ్యక్తిని దర్గాకు తీసుకెళ్లి బంధువులకు సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక పోలీసులకు సమాచారమిచినట్లు రైతు తెలిపాడు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం


సంగమేశ్వరాలయంలో లలిత సహస్ర నామాన్ని పఠిస్తున్న మహిళలు

సంగం, సెప్టెంబరు 12: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో గురువారం మహిళలు లలిత సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో చేశారు. హిందూ ధర్మ ప్రచార మహాసభ ఆధ్వర్యంలో ఉదయం 11-30 గంటలకు దేశ వ్యాప్తంగా లక్ష మంది మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేయాలని నిర్ణయించారు. ఆమేరకు సంగమేశ్వరాలయంలో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి లలిత సహస్రనామ పారాయణం చేశారు.

లక్ష్యాలను అధిగమించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని మండల ప్రత్యేకాధికారి పద్మావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ అతిథిగృహంలో పక్కాగృహాల నిర్మాణాలపై మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్కుఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి చివరి నాటి కి పక్కాగృహాల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు.